www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## జలాలపై జాలీగా.. ఆకాశమే హద్దుగా..
14

నీటిపై నుంచి నింగిలోకి ఎగిరిన సీ ప్లేన్

సెమీ ట్రయల్ రన్ సక్సెస్

నేడు ఏపీ సీఎం చేతుల మీదుగా ట్రయల్ రన్

బెజవాడ నుంచి శ్రీశైలానికి రానున్న చంద్రబాబు


సెమీ ట్రయల్‌లో భాగంగా శ్రీశైలం జలాశయంలో ల్యాండయిన సీప్లేన్

శనివారం | 9-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 221 |

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 10.46 తదుపరి నవమి; నక్షత్రం: శ్రవణం ఉ. 11.48 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: మ.3.40-5.12; దుర్ముహూర్తం: ఉ.6.20-7.50; అమృతఘడియలు: రా.12.56-2.29; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.20; సూర్యాస్తమయం: 5.36

వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## హైదరాబాద్‌లో ట్రంప్ టవర్లు


పుణెలోని ట్రంప్ జంట టవర్లు

మాదాపూర్‌లోని ఖానామెట్‌లో నిర్మాణం

భారీ విస్తీర్ణంలో జంట టవర్ల ఏర్పాటు

నిర్మాణానికి 2022లోనే భూమి కొనుగోలు!

దేశంలోని మరో 5 ప్రాంతాల్లోనూ టవర్లు

ఇప్పటికే 4 చోట్ల ఉన్న భారీ భవంతులు

2

## 'సుపారీ' సొమ్ము ఇప్పించండి!

ఇస్తామన్నది ఇంకా చెల్లించలేదు

పోలీసు స్టేషన్‌లో 'కాంట్రాక్టు కిల్లర్' ఫిర్యాదు

యూపీలో ఓ మహిళా న్యాయవాది హత్య కేసులో మలుపు

అత్తింటివారే సుపారీ ఇచ్చినట్లు వెల్లడి

2


జస్టిస్ చంద్రచూడ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కపిల్ సిబల్

## మనసు నొప్పించి ఉంటే క్షమించండి
2

కావాలని ఏమీ చేయలేదు

సర్వీస్‌లో చివరి రోజు జస్టిస్ చంద్రచూడ్ భావోద్వేగం

సీజేఐకి ఘనంగా వీడ్కోలు పలికిన జడ్జిలు, లాయర్లు



## సమోసాపై సీఐడీ!

సీఎం కోసం తెచ్చిన సమోసాలు మాయం

అంతర్గత దర్యాప్తునకు ఆదేశించిన సీఐడీ

హిమాచల్‌ప్రదేశ్‌లో రాజకీయ రగడ

ఇవన్నీ బీజేపీ వదంతులేనన్న సీఎం సుఖు

సంగెంలో పూజల అనంతరం శివలింగాన్ని గుండెలకు హత్తుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి; సంగెం మూసీ వంతెన మీద నుంచి సాగుతున్న ముఖ్యమంత్రి పాదయాత్ర




## మూసీ పునరుజ్జీవాన్ని అడ్డుకుంటే కుక్కచావే!

### బుల్డోజర్లు ఎక్కించైనా మూసీ ప్రక్షాళన చేపడతాం

మూసీ కాలుష్యం అణుబాంబు కంటే ప్రమాదం

ప్రక్షాళన చేయకపోతే నా జన్మ దండగ

నకిలీ బీజేపీ నేతలవి అవాకులు.. చవాకులు

మోదీ చేస్తే మెచ్చుకుంటారు.. మేం చేస్తే తప్పా?

బిడ్డ జైలుకెళ్తే దుఃఖించావు.. మా బిడ్డల బాధలు పట్టవా కేసీఆర్?.. ఈ పాదయాత్ర ట్రైలరే

అసలు సినిమా ముందుంది: సీఎం రేవంత్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా సంగెంలో మూసీ బాట

యాదాద్రి/చౌటుప్పల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును అడ్డుకోవాలని చూసేవారు కుక్కచావు చస్తారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. బుల్డోజర్లు ఎక్కించి అయినా ప్రాజెక్టును చేపట్టి తీరతామని ప్రకటించారు. మూసీ కాలుష్యం వల్ల ఆ నది పరీవాహక ప్రాంత ప్రజలు అణుబాంబుతో కలిగే ప్రమాదం కంటే ఎక్కువ దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరంగా ఉండాల్సిన మూసీ.. శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పునరుజ్జీవంతోనే వారికి ఆ సమస్య నుంచి విముక్తి కలుగుతుందని చెప్పారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం వద్ద మూసీ పునరుజ్జీవ యాత్రను సీఎం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ

మిగతా 13వ పేజీలో...

### యాదగిరిగుట్ట ఆలయానికి ప్రత్యేక బోర్డు

యాదాద్రి ఇకపై యాదగిరిగుట్ట: సీఎం

పుట్టినరోజున స్వామివారిని దర్శించుకున్న రేవంత్‌రెడ్డి
12

### హ్యాపీ బర్త్‌డే రేవంత్‌రెడ్డి.. హైదరాబాద్‌లోనే ఉన్నా!

ప్రభుత్వ ఏజెన్సీలు ఎప్పుడొచ్చినా స్వాగతం

పాలన తెలియని నీకు పగ్గాలు అప్పగిస్తే..

ప్రజల బతుకుల్లో మన్నుపోసినవ్: కేటీఆర్

## భూముల బదలాయింపుల కేసులో.. అమోయ్‌కు బిగుస్తున్న ఉచ్చు

దర్యాప్తులో సహకారం కోసం డీజీపీతో ఈడీ అధికారుల భేటీ

ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు సమన్లు జారీ చేసేందుకు సిద్ధం.. తమకు సహకరించాలని విజ్ఞప్తి

వారిపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కేసులు పెట్టనున్న పోలీసులు


అమోయ్ కుమార్

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూ బదలాయింపుల కేసులో రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్, ఇతరులకు ఈడీ ఉచ్చు బిగుస్తోంది. మహేశ్వరం భూముల కేసుకు సంబంధించి నమోదైన కేసులో ఈడీ విచారణ జరుపుతున్న క్రమంలో.. పలు కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుత, మాజీ ఐఏఎస్‌లతోపాటు ఇతర అధికారులు, అప్పటి నాయకుల ప్రమేయంపైనా ఈడీకి 12 ఫిర్యాదులు అందాయి. దీంతో ఈడీ 'ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్(పీఎంఎల్ఏ)' కింద విచారణకు సిద్ధమైంది. ఈ మేరకు కేసుల నమోదు, దర్యాప్తు, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవడంలో తమకు సహకరించాలని కోరుతూ ఈడీ అధికారులు శుక్రవారం డీజీపీ జితేందర్‌తో భేటీ అయ్యారు. తమ విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలు, తాము సేకరించిన ఆధారాలపై ఆయనతో సుదీర్ఘంగా చర్చించారు. భూదాన్ భూముల వ్యవహారంలో స్థానిక పోలీసులకు లేఖలు రాసినా ఏ వివరాలూ ఇవ్వలేదని డీజీపీ దృష్టికి తీసుకొచ్చారు. శంకర్ హిల్స్ సొసైటీ, బాలసాయిబాబా ట్రస్ట్ భూములు, రాయదుర్గంలోని కొన్ని

మిగతా 12వ పేజీలో...

### అమ్మోయ్.. అన్ని దందాలా!?

అమోయ్ బృందంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు

ధరణిని అడ్డుపెట్టుకొని భూ కుంభకోణాలు

విచారణ జరిగితే మరిన్ని విషయాలు వెలుగులోకి!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

గత ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా అమోయ్‌కుమార్ పనిచేసిన కాలంలో భూ కుంభకోణాలు భారీగా జరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రస్తుతం మహేశ్వరం మండలం నాగారంలోని 42 ఎకరాల భూదాన భూముల అన్యాక్రాంతంపై నమోదైన కేసులో ఈడీ విచారణ జరుపుతుండగా.. మరికొన్ని భూముల అక్రమాలపై కూడా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. వీటిలో కొన్ని వివరాలు..

1 మియాపూర్ సర్వే నంబరు 100/ఆ లోని 8 ఎకరాల భూమిని పట్టాభూమిగా మార్చినట్లు ఆరోపణలున్నాయి. 1 ఖాజాగూడలోని సర్వే నంబరు 27/2లోని అత్యంత విలువైన 27 ఎకరాల భూమిని ప్రైవేటు బిల్డర్లకు అనుకూలంగా

మిగతా 12వ పేజీలో...

## మెడికల్ రీయింబర్స్‌మెంట్.. ఆన్‌లైన్‌లోనే!
3




ఉద్యోగులు, పింఛనుదారులకు ఊరట

ప్రస్తుతం నేరుగా బిల్లులు అందించాల్సిన పరిస్థితి

డీఎంఈ స్ర్కూటినీకే ఐదారు నెలలపైగా సమయం

ఆ ఇబ్బందులను పరిష్కరించేలా సర్కారు నిర్ణయం

స్ర్కూటినీని ఆరోగ్యశ్రీ ట్రస్టుకు అప్పగించే యోచన

ఆస్పత్రుల బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే చాలు

## గోరుముద్ద నుంచే బ్యాక్టీరియా

చిన్నతనంలోనే కడుపులోకి హెచ్ పైలోరీ

దానిబారిన దేశంలో 50-60 కోట్ల మంది!

ఒకరికి నుంచి మరొకరికి తేలిగ్గా వ్యాప్తి

ఎన్నెన్నో వ్యాధులకు కారణం

శ్వాసపరీక్షలతో గుర్తించి చికిత్స చేయొచ్చు

నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ బారీ మార్షల్

దేశంలోనే ఏఐజీలో తొలి పరిశోధన కేంద్రం

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అమ్మ చేతి గోరు ముద్ద.. బిడ్డలకు అమృతంతో సమానం! కానీ.. అది ఒకప్పటి మాట!! మనిషి జీర్ణకోశ కణజాలానికి పట్టుకుని అల్సర్ నుంచి జీర్ణాశయ క్యాన్సర్ దాకా పలు వ్యాధులకు, సమస్యలకు కారణమయ్యే హెలికోబ్యాక్టర్ పైలోరీ (హెచ్.పైలోరీ) అనే బ్యాక్టీరియా శరీరంలో చేరడానికి

మిగతా 14వ పేజీలో...



### అలీగఢ్.. సెంట్రల్ యూనివర్సిటీ కాదు!
2

మైనారిటీ హోదా ఇచ్చే అంశంపై కొత్త ధర్మాసనం విచారణ జరపాలి

విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకునే హక్కు మత, భాషా మైనారిటీలకుంది

సుప్రీంకోర్టు 4:3 మెజారిటీ తీర్పు

## ధాన్యం.. మాయం!

### 15 లక్షల టన్నుల ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లర్లు

విలువ రూ.3,301 కోట్ల పైమాటే.. విజిలెన్స్, పౌర సరఫరాల తనిఖీల్లో వెల్లడి

బియ్యం ఇవ్వలే, ధాన్యం ఆచూకీ దొరకలే.. డిఫాల్ట్ జాబితాలో 1,634 రైస్ మిల్లులు

*2018 వరకు రాష్ట్రంలోని రైస్‌మిల్లుల్లో లెక్క తేలని ధాన్యం 97,813 టన్నులు మాత్రమే. కానీ, బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ 2022-23 ఖరీఫ్ సీజన్ నాటికి ఆ మొత్తం ఏకంగా 15 లక్షల టన్నులకు పెరిగింది. అంటే ఐదేళ్లలో ఏటా 3 లక్షల టన్నుల ధాన్యం మాయమైంది.*



హైదరాబాద్/నెట్‌వర్క్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లుల్లో ధాన్యం మాయమైంది. గత ప్రభుత్వ హయాంలో.. ఇచ్చిన ధాన్యాన్ని ఇచ్చినట్లే మిల్లర్లు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. భారత ఆహార సంస్థకు గానీ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు గానీ బియ్యం అప్పగించకుండా ఏళ్ల తరబడి బకాయిలు పెట్టారు. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించగా.. మిల్లర్ల బండారం బయటపడింది. తనిఖీ నివేదికలోని సమాచారం ప్రకారం.. రైస్ మిల్లర్లు మాయం చేసిన ధాన్యం 15 లక్షల టన్నులు కాగా, దాని విలువ రూ.3,301 కోట్లపైమాటే. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 1,634 రైస్ మిల్లుల యాజమాన్యాలను డిఫాల్టర్ల జాబితాలో చేర్చారు. సాధారణంగా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు అప్పగిస్తుంది. బాయిల్డ్ బియ్యమైతే 68 శాతం, ముడి బియ్యమైతే 67 శాతం చొప్పున తిరిగి ప్రభుత్వానికి చేర్చాల్సి ఉండగా.. చాలా మంది మిల్లర్లు ధాన్యాన్ని ఇష్టానుసారం అమ్మేసుకున్నారు. అధికారులు ఎంత ఒత్తిడి చేసినా, కేసులు నమోదు చేసినా బెదరడం లేదు. దీంతో మిల్లర్ల బకాయిలు కొండలా పేరుకుపోతున్నాయి. 2010 నుంచీ కొనసాగుతున్న బకాయిలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక క్షేత్రస్థాయి తనిఖీలకు ఆదేశించింది. ఇందులో భాగంగా 2022-23 ఖరీఫ్ నాటికి పేరుకుపోయిన బకాయిలు రూ.3,301కోట్ల వరకు ఉన్నట్లు తేలింది. అంటే.. అంత విలువైన ధాన్యాన్ని మిల్లర్లు మాయం చేసినట్లు స్పష్టమైంది. అంతేకాదు.. 2022- 23లో రబీ సీజన్‌కు సంబంధించి టెండర్ల ద్వారా విక్రయించేందుకు నిల్వ ఉంచిన ధాన్యాన్ని కూడా కొందరు రైస్ మిల్లర్లు అమ్ముకున్నారు. 35లక్షల టన్నుల్లో.. దాదాపు 12లక్షల టన్నుల ధాన్యం మాయమైనట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ తనిఖీల తర్వాత జిల్లాల వారీగా పలు మిల్లులపై కేసులు నమోదు

మిగతా 14వ పేజీలో...



## శునకాల కళేబరాలు తొలగించారు
14

బతికున్నవాటికి ఆహారం పెట్టారు.. 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన మంచిర్యాల యంత్రాంగం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్న హరీశ్‌రావు

### ఉద్యోగుల సమస్యలపై.. క్యాబినెట్ సబ్ కమిటీ

చైర్మన్‌గా భట్టి.. సభ్యులుగా శ్రీధర్‌బాబు, పొన్నం

డీఏ, పీఆర్సీ, సీపీఎస్ అంశాలపై అధ్యయనం

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. సభ్యులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్.. ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావును నియమించింది. సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ) ముఖ్యకార్యదర్శి ఈ క్యాబినెట్ సబ్ కమిటీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల సమస్యల

మిగతా 13వ పేజీలో...

## హైదరాబాద్‌లో ట్రంప్ టవర్లు

**మాదాపూర్‌లోని ఖానామెట్‌లో నిర్మాణం**

న్యూఢిల్లీ, నవంబరు 8: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌కు చెందిన నిర్మాణ సంస్థ తెలంగాణలోనూ అడుగు పెడుతోంది. హైదరాబాద్‌లో ట్రంప్ టవర్లను నిర్మించనుంది. భారత్‌లో ఇప్పటికే నాలుగు నగరాలు ముంబై, కోల్‌కతా, గుర్గావ్, పుణెల్లో ట్రంప్ టవర్స్ నిర్మించిన ఆ సంస్థ.. తాజాగా మరో ఆరు టవర్లను నిర్మించాలని నిర్ణయించింది. హైదరాబాద్‌తోపాటు నోయిడా, బెంగళూరుతోపాటు పుణెలో మరో టవర్‌ను నిర్మించనుంది. దీంతో భారత్‌లో ట్రంప్ టవర్ల సంఖ్య 10కి చేరనుంది. తద్వారా అమెరికా బయట అత్యధికంగా ట్రంప్ టవర్లు భారత్‌లోనే ఏర్పాటు కానున్నాయి. కాగా, హైదరాబాద్‌లో స్థానిక మంజీరా గ్రూప్‌తో కలిసి జంట టవర్లు నిర్మించే యోచనలో ట్రంప్ నిర్మాణ సంస్థ ఉంది. ఇందుకోసం 2022లోనే మాదాపూర్‌లోని ఖానామెట్‌లో 2.92 ఎకరాల భూమిని హెచ్ఎండీఏ వేలంలో కొనుగోలు చేసింది. 27 అంతస్తుల్లో నాలుగు బెడ్‌రూంలు, ఐదు బెడ్‌రూంల అపార్టుమెంట్లతో నిర్మించనున్నారు. నాలుగు బెడ్‌రూంల అపార్టుమెంట్ల విస్తీర్ణం 4వేల నుంచి 5వేల చదరపు అడుగులు, ఐదు బెడ్‌రూంల అపార్టుమెంట్ల విస్తీర్ణం 6వేల చదరపు అడుగులు ఉండనున్నట్లు తెలుస్తోంది. చదరపు అడుగుకు రూ.13 వేలుగా ధరను నిర్ణయించాలని అప్పట్లో భావించారు. నాటి లెక్క ప్రకారమే నాలుగు బెడ్‌రూంల అపార్టుమెంట్ ధర రూ.5.5 కోట్లు కానుంది. ఇక ఇతర నగరాల్లో ట్రిబెకా డెవలపర్స్‌తో కలిసి నిర్మించే టవర్లలో అపార్టుమెంట్లే కాకుండా.. ఆఫీసులు, విల్లాలు, గోల్ఫ్ కోర్సులు ఉండనున్నాయి.

## ట్రంప్ గెలిచారు.. అమెరికాలో ఉండలేను!

- ఎలాన్ మస్క్ కూతురి ఆవేదన..



వాషింగ్టన్, నవంబరు 8: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలవడంతో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఖుషీ ఖుషీగా ఉండగా.. ఆయన కూతురు వివియన్ జెన్నా విల్సన్ మాత్రం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తనకు అమెరికాలో భవిష్యత్తు కనిపించట్లేదని.. దేశాన్ని వీడాలనుకుంటున్నట్లు సామాజిక మాధ్యమం థ్రెడ్స్ వేదికగా వెల్లడించారు. ఎలాన్ మస్క్‌కు మొదటి భార్య ద్వారా కలిగిన ఆరుగురి సంతానంలో వివియన్ విల్సన్ ఒకరు.. అయితే అబ్బాయిగా పుట్టిన వివియన్.. 18 ఏళ్ల వయసు (2022)లో తండ్రిని ఎదిరించి లింగ మార్పిడి చేయించుకొని అమ్మాయిగా మారారు. తాజాగా ట్రంప్ గెలుపుతో అమెరికాలో తన లాంటి ట్రాన్స్‌జెండర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆమె వాపోయారు. 'కొన్నాళ్లుగా దేని గురించైతే బాధపడుతున్నానో అదే జరిగింది. అమెరికాలో నాకు భవిష్యత్తు కనిపించట్లేదు. ఆయన (ట్రంప్) పదవిలో నాలుగేళ్లే ఉండనున్నప్పటికీ.. లింగమార్పిడి వ్యతిరేక నిబంధనలు ఒక్కసారిగా అమల్లోకి రాకపోయినా.. వాటిని కావాలని ఓటేసిన వారు అంత తొందరగా మారరుగా..' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ కుల క్రీడ!

## ఒకరిపై మరొకరిని ఉసిగొల్పుతోంది: మోదీ

- దళితులు, ఓబీసీలు, గిరిజనుల అభ్యున్నతి ఆ పార్టీకి ఇష్టం లేదు
- వారి ఐక్యతను దెబ్బతీయడమే కాంగ్రెస్ 'యువరాజు' పని
- ఆ పార్టీ పరాన్నజీవిగా మారింది
- మహారాష్ట్ర ప్రచారంలో ప్రధాని మోదీ



నాసిక్, నవంబరు 8: భారతీయ సమాజాన్ని కులాల పేరిట చీల్చాలని కాంగ్రెస్ చూస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం ఒక కులాన్ని మరో కులంపైకి ఉసిగొల్పుతూ ప్రమాదకర క్రీడ ఆడుతోందని మండిపడ్డారు. జాతి మొత్తం హెచ్చరికగా ఉండాలని.. అన్ని వర్గాలు ఐకమత్యంగా ఉంటేనే భద్రత ఉంటుందని స్పష్టం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన ధూలే, నాసిక్ సభల్లో ప్రసంగించారు. రాష్ట్రంలో ఇవే ఆయన మొదటి ర్యాలీలు. కులగణన చేపట్టాలంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేస్తున్న డిమాండ్‌ను ప్రస్తావిస్తూ.. ఎస్సీ, ఎస్టీలు, బీసీల ఐక్యతను చెడగొట్టడమే ఆ పార్టీ ప్రధాన ఎజెండా అని మోదీ విమర్శించారు. 'గిరిజన తెగల మధ్య చిచ్చు పెట్టాలన్నది కాంగ్రెస్ ఎజెండా. మతపరమైన గ్రూపులతో కలిసి గతంలో ఈ కుట్ర పన్నినప్పుడు దేశ విభజనకు దారితీసింది. ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను ఒకరిపై మరొకరిని రెచ్చగొడుతోంది. దళితులు, బీసీలు, గిరిజనుల పురోగతి దానికి ఇష్టం ఉండదు. అందుకే కులాలవారీగా వారిని విభజించాలని చూస్తోంది. ముఖ్యంగా ఎస్సీలు, ఎస్టీలు బలహీనంగా ఉండాలన్నదే దాని ఉద్దేశం. నెహ్రూ కాలం నుంచీ కాంగ్రెస్, ఆయన కుటుంబం రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయి. గాంధీ-నెహ్రూ కుటుంబ నాలుగో తరం యువరాజు (రాహుల్) కూడా ఈ దిశగానే పనిచేస్తున్నారు. మనందరం ఒక్కటిగా ఉంటేనే భద్రంగా ఉంటాం (ఏక్ హై తో సేఫ్ హై)' అని నినదించారు. కాంగ్రెస్ పరాన్నజీవిగా మారిందన్నారు. ఊతకర్రలపై నడుస్తోందని చెప్పారు. మహారాష్ట్ర, యూపీ, బిహార్, జార్ఖండ్ సహా పలు రాష్ట్రాల్లో మిత్రపక్షాల మద్దతుంటే తప్ప పోరాడలేని పరిస్థితిలో ఉందన్నారు. కాగా, తన ప్రభుత్వ హయాంలో పదేళ్లలో దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి విముక్తి చేశామన్నారు.

### ఎంవీఏలో కుర్చీలాట!

కాంగ్రెస్, ఎన్సీపీ(శరద్ పవార్), ఉద్ధవ్ శివసేనలతో కూడిన మహారాష్ట్ర వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో సీఎం కుర్చీ కోసం అంతర్గత పోరాటం జరుగుతోందని మోదీ అన్నారు. ఎంవీఏ బండికి చక్రాలు గానీ, బ్రేకులు గానీ లేవని.. అందులోని ప్రతి పార్టీ డ్రైవర్ సీటులో కూర్చోవాలని తహతహలాడుతోందని ఎద్దేవాచేశారు. వచ్చే ఐదేళ్లలో మహారాష్ట్రలో అభివృద్ధి కొత్త శిఖరాలకు చేరుతుందని.. బీజేపీ సారథ్యంలోని మహాయుతి ప్రభుత్వం మాత్రమే సత్పరిపాలన అందించగలదని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణను రద్దుచేశామని చెప్పారు. కానీ, ఇండీ కూటమి భారత రాజ్యాంగాన్ని కశ్మీరులో లేకుండా చేయాలని చూస్తోందని.. ప్రపంచంలో ఏ శక్తీ ఆ అధికరణను పునరుద్ధరించజాలదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఎజెండాను ప్రోత్సహించవద్దని.. వేర్పాటువాదుల భాష మాట్లాడవద్దని ఆ కూటమి పార్టీలను మోదీ కోరారు. ప్రజల ఆశీర్వాదం తనకున్నంత వరకు ఆ పార్టీల ఎజెండా నెరవేరదన్నారు.


## మతాల మధ్య మోదీ గోడలు

- మత ప్రాతిపదికన దేశాన్ని చీల్చే కుట్ర
- మణిపూరే అందుకు నిదర్శనం: రాహుల్



లోహర్‌డగా, సిండెగా, నవంబరు 8: దేశంలో ప్రజల్ని మత ప్రాతిపదికన చీల్చాలని మోదీ ప్రయత్నిస్తున్నారని రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. మణిపూర్ తగలబడటానికి అదే కారణమని ఆరోపించారు. ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం లోహర్‌గడా, సిండెగాలలో చేపట్టిన ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీ వైఖరి వల్ల దేశంలో 90శాతం ప్రజలు వారి హక్కుల్ని, ప్రయోజనాలని కోల్పోయారని విమర్శించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు, సిక్కుల మధ్య బీజేపీ వైరం సృష్టించాలనుకుంటోందని ఆరోపించారు. "దేశాన్ని ఒక్కటి చేయడం కోసమే నేను 4వేల కి.మీల పాదయాత్ర చేశాను. 90శాతం జనాభా కలిగిన ఆదివాసీలు, దళితులు, ఓబీసీల కోసం గొంతెత్తుతాను. కానీ నేను దేశాన్ని విడగొట్టాలని చూస్తున్నానని బీజేపీ విమర్శిస్తోంది. వెనుకబడిన వర్గాల హక్కుల పోరాడటం తప్పే అయితే ఆ తప్పునే నేను కొనసాగిస్తా"నని చెప్పారు. బీజేపీ... నీటిని, భూమిని, అడవిని(జల్, జంగల్, జమీన్) ఆదివాసీల నుంచి దూరం చేయాలని చూస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని నాశనం చేయాలనుకుంటున్న ఎన్డీఏ కూటమికి, రాజ్యాంగాన్ని పరిరక్షించాలనుకుంటున్న ఇండియా కూటమికి మధ్యనే ఎన్నికల్లో పోటీ అని పిలుపునిచ్చారు. బలహీనవర్గాల ప్రజల పరిస్థితి మెరుగుపడటం కోసం, దేశాభివృద్ధి కోసం కులగణన అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కాగా, నోట్ల రద్దు నిర్ణయం వల్ల దేశంలో ఎంఎస్ఎంఈ పరిశ్రమలతో పాటు అసంఘటిత రంగం కుదేలైందని తద్వారా గుత్తాధిపత్యానికి దారి తీసిందని రాహుల్ విమర్శించారు. నోట్ల రద్దు చేసిన శుక్రవారానికి 8 ఏళ్లు పూర్తైంది.

## లోకం తీరు




## అమెరికా వలస విధానంపై పిడుగు

- అధ్యక్షుడు బైడెన్ తెచ్చిన కొత్త పాలసీ 'కీపింగ్ ఫ్యామిలీస్ టుగెదర్' నిలిపివేత
- ట్రంప్ నామినేట్ చేసిన జడ్జి ఉత్తర్వులు
- సుమారు 5 లక్షల మందిపై ప్రభావం

వాషింగ్టన్, నవంబరు 8: అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఇంకా గద్దెనెక్కక ముందే.. శ్వేతసౌధంలోకి అడుగు పెట్టకముందే.. వలస విధానంలో సంచలనం చోటు చేసుకుంది. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ఈ ఏడాది జూన్‌లో 'కుటుంబాలను కలిపి ఉంచడం'(కీపింగ్ ఫ్యామిలీస్ టుగెదర్) అనే నూతన వలస విధానాన్ని తీసుకువచ్చారు. దీని ద్వారా అమెరికాలో నివసిస్తున్న విదేశీ పౌరులు తమ కుటుంబ సభ్యులకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోయినా.. చట్టబద్ధత పొందే వీలు కల్పించారు. అయితే.. ఈ విధానాన్ని తాజాగా గతంలో డొనాల్డ్ ట్రంప్ నామినేటెడ్ చేసిన టెక్సాస్‌లోని జిల్లా జడ్జి జస్టిస్ జె. కాంప్‌బెల్ బార్కర్ నిలుపుదల చేశారు. "ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఫెడరల్ ఏజెన్సీలకు చట్టబద్ధత లేదు" అని తీర్పు వెలువరించారు. దీంతో నూతన విధానానికి అర్హులైన సుమారు 5లక్షల మంది పౌరులపై పిడుగు పడినట్టయింది. ట్రంప్ అప్రతిహత విజయం దక్కించుకున్న కొన్ని గంటల్లోనే ఆయన నామినేట్ చేసిన జడ్జి తీర్పు వెలువరించడం చర్చకు దారితీసింది. అక్రమ వలస దారులను దేశం నుంచి పంపేస్తానని ఎన్నికల సమయంలో ట్రంప్ పదే పదే చెప్పిన విషయం తెలిసిందే. టెక్సాస్ కోర్టు తాజా తీర్పుపై 'అమెరికన్ ఫ్యామిలీస్ యునైటెడ్' సంఘం అధ్యక్షుడు ఆష్లే డీ అజెవెడో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీర్పు లక్షల మంది ఆశలను ఛిద్రం చేసిందన్నారు.

# వయనాడ్‌లో రాష్ట్రేతరులదే హవా!

**ఉప ఎన్నిక బరిలో 16 మంది అభ్యర్థులు**

- వారిలో 11 మంది బయటి రాష్ట్రాల వారే
- ఏపీ, తెలంగాణ నుంచీ ఒక్కొక్కరు పోటీ

వయనాడ్, నవంబరు 8: వయనాడ్ ఎంపీ స్థానానికి ఈ నెల 13న జరగనున్న ఉప ఎన్నికలో పోటీ పడుతున్న 16 మంది అభ్యర్థుల్లో ఏకంగా 11 మంది రాష్ట్రేతరులే కావడం విశేషం. వీరిలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఎన్నికల అరంగేట్రం చేస్తున్నారు. ప్రధాని మోదీ, ఏబీ వాజపేయి, మన్మోహన్ సింగ్, పీవీ నరసింహారావు సహా ఎందరో అగ్రనేతలపై 200కు పైగా ఎన్నికల్లో పోటీచేసి 'ఎలక్షన్ కింగ్'గా పేరొందిన కె.పద్మరాజన్(తమిళనాడు) కూడా బరిలో నిలిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై పోటీ చేసిన జయేంద్ర కె. రాథోడ్(గుజరాత్) సైతం పోటీలో ఉన్నారు. వీరితో పాటు నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి షేక్ జలీల్(ఏపీ), జాతీయ జనసేన పార్టీకి చెందిన దుగ్గిరాల నాగేశ్వరరావు(తెలంగాణ), కిసాన్ మజ్దూర్ బేరోజ్‌గార్ సంఘ్‌కు చెందిన గోపాల్ స్వరూప్ గాంధీ(యూపీ), బహుజన్ ద్రావిడ పార్టీ నుంచి ఎ.సీత(తమిళనాడు) పోటీ చేస్తున్నారు. ఇంకా నూర్ ముహమ్మద్ (తమిళనాడు), ఇస్మాయిల్ జాబీ ఉల్లా (కర్ణాటక), రుక్మిణి (కర్ణాటక) సోను సింగ్ యాదవ్ (యూపీ) స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. ఇక సీపీఐ నుంచి సత్యన్ మోకేరి, బీజేపీ తరఫున నవ్యా హరిదాస్ పోటీ చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థి ఆర్. రాజన్ ఒక్కరే వయనాడ్ నియోజకవర్గానికి చెందినవారు. కాగా, వయనాడ్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ కూడా స్థానికేతరుడే.

### 'జమాతే' మద్దతుతో ప్రియాంక పోటీ

తిరువనంతపురం, నవంబరు 8: కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వయనాడ్‌లో జమాతే ఇస్లామీ మద్దతుతో పోటీ చేస్తున్నారని కేరళ సీఎం విజయన్ ఆరోపించారు. ఈ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ లౌకిక వాద ముసుగును పూర్తిగా బట్టబయలు చేశాయని విరుచుకుపడ్డారు. 'అసలు కాంగ్రెస్ వైఖరి ఏమిటి? జమాతే ఇస్లాం గురించి మన దేశానికి తెలియనిది కాదు. ఆ సంస్థ భావజాలం ప్రజాస్వామిక విలువలకు అనుగుణంగా ఉందా?' అని విజయన్ ప్రశ్నించారు.

## టైలర్ షాపుల్లో ఆడవాళ్లకు కొలతలు మహిళలే తీసుకోవాలి

- ఉత్తరప్రదేశ్ మహిళా కమిషన్ ప్రతిపాదన

లఖ్‌నవూ, నవంబరు 8: టైలర్ షాపుల్లో మహిళల దుస్తుల కొలతలు కేవలం మహిళలే తీసుకోవాలని, జిమ్‌లలో మహిళా ట్రైనర్లు మాత్రమే మహిళలకు శిక్షణ ఇవ్వాలని, సెలూన్లలో మహిళలు మాత్రమే మహిళలకు సేవలందించాలని యూపీ మహిళా కమిషన్ ప్రతిపాదించింది. టైలర్ షాపుల్లో, జిమ్‌లలో పురుషులు మహిళలను అసభ్యకరంగా తాకడాన్ని(బ్యాడ్ టచ్) నిరోధించేందుకు, మహిళల భద్రత కోసం ఈ ప్రతిపాదనలు చేసినట్లు తెలిపింది. జిమ్‌లలో, సెలూన్లలో, టైలర్ షాపుల్లో సీసీటీవీ కెమెరాలు అమర్చాలని, అవి ఎల్లవేళలా పని చేసేలా చూడాలని సూచించింది. అక్టోబరు 28న జరిగిన భేటీలో కమిషన్ ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. "మహిళల యోగా సెంటర్లు, జిమ్‌లలో మహిళలు మాత్రమే శిక్షణనివ్వాలి. ఆడవారికి వస్తువులు అమ్మే షాపుల్లో తప్పనిసరిగా మహిళలు పనిచేయాలి" అని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఇవి అమలైతే మహిళలకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని కమిషన్ అభిప్రాయపడింది.

### జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో ఆగని రగడ

శ్రీనగర్, నవంబరు 8 : జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో మూడో రోజు శుక్రవారమూ నిరసనలు కొనసాగాయి. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏలను పునరుద్ధరించాలన్న తీర్మానంపై ఈ వివాదం నెలకొంది. ఎమ్మెల్యే షేక్ కుర్షీద్ అహ్మద్‌ను మార్షల్స్ ద్వారా అసెంబ్లీ నుంచి బయటకు పంపారు. బీజేపీకి చెందిన సునీల్ శర్మ ప్రసంగిస్తుండగా... అవామీ ఇత్తెహాద్ పార్టీకి చెందిన షేక్ కుర్షీద్ ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏలను పునరుద్ధరించాలని రాసున్న బ్యానర్ పట్టుకుని అసెంబ్లీ వెల్‌లో నిలబడ్డారు. బీజేపీ ఎమ్మెల్యేలు వెంటనే దాన్ని లాక్కుని చించివేశారు. తమ నిరసన కొనసాగించారు. 15 మంది బీజేపీ ఎమ్మెల్యేలు వెల్‌లోకి చేరుకోవడంతో స్పీకర్ అబ్దుల్ రహీం రేదర్ ఆదేశాలతో మార్షల్స్ వారిని సభ నుంచి బయటకు తీసుకువెళ్లారు.

### మా డిమాండ్లు పట్టించుకోకుంటే మళ్లీ ఆయుధాలు పడతాం: ఎన్ఎస్‌సీఎన్-ఐఎం

కోహిమా, నవంబరు 8: సుదీర్ఘ శాంతి చర్చల ముగింపు కోసం మూడో పక్షాన్ని చేర్చుకొని కేంద్రం సంప్రదింపులు జరపకపోతే 27 ఏళ్ల కాల్పుల విరమణ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటామని ఎన్ఎస్‌సీఎన్-ఐఎం మిలిటెంట్ గ్రూప్ ప్రకటించింది. 2015 ఆగస్టు 3న సంతకం చేసిన ఒప్పంద నిబంధనలను కేంద్రం తుంగలోకి తొక్కి.. ద్రోహం చేసిందని మండిపడింది. నాగా జాతీయ జెండా, రాజ్యాంగాన్ని కేంద్రం గుర్తించట్లేదని ఆ గ్రూప్ ప్రధాన కార్యదర్శి ముయివా ఫైర్ అయ్యారు. ఈ విషయంలో కేంద్రం వైఖరి హింసాత్మక ఘర్షణలకు దారి తీయవచ్చని హెచ్చరించారు. అరుణాచల్, నాగాలాండ్, అస్సాం, మణిపూర్, మయన్మార్‌లోని నాగా నివాస ప్రాంతాల ప్రజలను కాపాడుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు.

### సైబర్ సెక్యూరిటీపై యూజీసీ హ్యాండ్‌బుక్

హైదరాబాద్, నవంబరు 8 : డిజిటల్ అరెస్టులు, డీప్ ఫేక్‌లు, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, హనీ ట్రాప్ వంటి ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకి అధికమవుతున్న వేళ యూజీసీ అప్రమత్తమైంది. విద్యార్థులు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పేందుకు ఓ పుస్తకాన్ని(ఈ-బుక్) విడుదల చేసింది. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సైబర్ మోసాలను ఎలా గుర్తించాలి, ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచార గోప్యత కోసం ఏం చెయాలి వంటి పలు అంశాలపై సైబర్ సెక్యూరిటీ నిపుణుల సూచనలతో ఈ పుస్తకాన్ని రూపొందించారు.

### దివ్యాంగులకు సౌలభ్యంగా నిర్మాణాలు ఉండాలి

న్యూఢిల్లీ, నవంబరు 8: దివ్యాంగులకు అనుకూలంగా నిర్మాణాలు ఉండేలా ప్రామాణిక నిబంధనలు రూపొందించాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నిబంధనలు కేవలం మార్గదర్శకాలుగా మిగిలిపోకుండా చట్టం ప్రకారం అమలు చేయాల్సి ఉందని తెలిపింది. వీటి రూపకల్పనలో కేంద్ర ప్రభుత్వానికి సహకరించాలని హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న సెంటర్ ఫర్ డిజేబిలిటీ స్టడీస్‌కు సూచించింది.

## 'సమోసా'పై సీఐడీ

- హిమాచల్‌లో రాజకీయ రగడ

సిమ్లా, నవంబరు 8: హిమాచల్ ప్రదేశ్ రాజకీయాల్లో 'సమోసా' రచ్చరచ్చ చేస్తోంది. ఓ కార్యక్రమంలో సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు కోసం తెచ్చిన సమోసాలు మాయం కావడం, దానిపై సీఐడీ దర్యాప్తు చేస్తోందనే వార్తలు రావడమే ఆ రగడకు కారణం. అసలు ఈ సమోసా దుమారం గత నెల 21న మొదలైంది. ఆరోజు సీఐడీ ప్రధాన కార్యాలయానికి సీఎం సుఖు వచ్చిన సందర్భంగా స్నాక్స్‌లా ఆయనకు వడ్డించడానికి సమోసాలు, కేకులు, ఇతర పదార్థాలు తీసుకువచ్చారు. అయితే ఆయనకు ఇవ్వడానికి ముందే సమోసాలు మాయం అయ్యాయి. తెచ్చిన సమోసాలు ఏమయ్యాయి అని సీఐడీ అధికారులు అంతర్గత దర్యాప్తునకు ఆదేశించారు. సీఎం సెక్యూరిటీ సిబ్బందికి ఆ సమోసాలు వడ్డించారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో సమోసాలపై సీఐడీ దర్యాప్తు అంటూ వార్తలు గుప్పుమన్నాయి. దీన్ని అందిపుచ్చుకున్న విపక్ష బీజేపీ నేతలు.. ప్రభుత్వ చర్యలు కామెడీగా ఉన్నాయని, రాష్ట్రంలో ఎన్నో ఘోరాలు జరుగుతుంటే సమోసాలు మాయం అవ్వడంపై దర్యాప్తునకు ఆదేశిస్తారా? అంటూ విమర్శలు చేశారు. సమోసాల మిస్సింగ్‌పై సీఐడీ విచారణకు ఆదేశించలేదని అని సీఎం సుఖు కూడా వివరణ ఇచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. దర్యాప్తు అంటూ మీడియానే వార్తలు ప్రచురిస్తోందన్నారు.

## కాంట్రాక్టు ప్రకారం చంపేశాను.. 'సుపారీ' సొమ్ము ఇప్పించండి!

- పోలీసులకు 'కాంట్రాక్టు కిల్లర్' ఫిర్యాదు

మేరఠ్, నవంబరు 8: పోలీసు స్టేషన్‌లో హంతకులు లొంగిపోవడం సహజమే అయినా ఈ సంఘటన మాత్రం కాస్త విచిత్రంగా ఉంది. తనకు రావాల్సిన సుపారీని ఇప్పించాలంటూ ఓ కాంట్రాక్టు కిల్లర్ పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడం ఆసక్తి కలిగించింది. ఓ మహిళ హత్యకు తనను పురమాయించిన ఆమె అత్తింటివారు.. పని పూర్తి చేసినా ఇంతవరకు ఇస్తామన్న సుపారీ చెల్లించలేదని, ఆ బకాయిలను ఇప్పించాలని కోరాడు. ఈ సంఘటనతో ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో ఏడాది క్రితం జరిగిన మహిళా న్యాయవాది అంజలి హత్య కేసు మలుపు తిరిగింది. ఆమెను హత్య చేసేందుకు భర్త, అత్తింటి వారు తనకు రూ.20 లక్షలు ఇస్తామని చెప్పారని, కానీ ఇంతవరకు వాటిని చెల్లించలేదని నీరజ్ శర్మ అనే నిందితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన జరిగిన రోజున న్యాయవాది అంజలి మిల్క్ బూత్ నుంచి వస్తుండగా ఇద్దరు హంతకులు ఆమెను కాల్చి చంపారు. దర్యాప్తు జరిపిన పోలీసులు నీరజ్ శర్మ, యశ్‌పాల్ అనే హంతకులను అరెస్టు చేశారు. వారు వినియోగించిన రెండు స్కూటర్లు, పిస్టల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. భర్త, కుటుంబ సభ్యులను కూడా అరెస్టు చేసినా వారి ప్రమేయం లేదంటూ అనంతరం వారిని విడిచిపెట్టారు. ఇటీవల బెయిల్‌పై విడుదలయిన నీరజ్ శర్మ పోలీసు స్టేషన్‌కు వెళ్లి అంజలి భర్త, మామ పవన్ గుప్త, అత్త సరళా గుప్తలపై ఫిర్యాదు చేశారు. తాము కుదుర్చుకున్న ఒప్పందం కారణంగా పోలీసులు అరెస్టు చేసిన సమయంలోనూ వారి పేర్లను వెల్లడించలేదని చెప్పాడు.

# మనసు నొప్పించి ఉంటే క్షమించండి

**కావాలని ఏమీ చేయలేదు.. సీజేఐగా చివరి రోజున జస్టిస్ చంద్రచూడ్**



సీజేఐ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన లాంఛనపూర్వక బెంచ్‌లో జస్టిస్ మనోజ్, జస్టిస్ ఖన్నా, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా

న్యూఢిల్లీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదవీ కాలం పూర్తయిన సందర్భంగా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ శుక్రవారం భావోద్వేగానికి లోనయ్యారు. విధి నిర్వహణలో నొప్పించి ఉంటే మన్నించాలని కోరారు. మరోవైపు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు తమ అనుభవాలను గుర్తు చేసుకొని ఆయన వ్యక్తిత్వాన్ని కొనియాడారు. చివరి రోజున జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు తదుపరి సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా, ఇతర న్యాయమూర్తులు జస్టిస్ హృషికేష్, జస్టిస్ నరసింహ, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌లతో కలిసి ప్రధాన న్యాయమూర్తి లాంఛనపూర్వక ధర్మాసనం ఏర్పాటయింది. ఈ వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న వందలాది మంది న్యాయవాదులను ఉద్దేశించి జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ "మనమందరం యాత్రికులుగా ఇక్కడకు వచ్చాం. ఎందరో గొప్ప న్యాయమూర్తులు తర్వాతితరం వారికి వారసత్వాన్ని అందించి వెళ్లారు. దాన్ని కొనసాగించాలి" అని అన్నారు. తెలుగువాడైన జస్టిస్ నరసింహ మాట్లాడుతూ 'నేను, జస్టిస్ చంద్ర చూడ్ ముందు న్యాయవాదిగా హాజరయ్యా. ఇప్పుడు ఆయనతో పాటు న్యాయమూర్తిగా కూర్చొన్నా. ఇది అసాధారణమైన విషయం' అని అన్నారు. తదుపరి సీజే జస్టిస్ ఖన్నా మాట్లాడుతూ.. 'చంద్రచూడ్ ఇచ్చిన కొన్ని గొప్ప తీర్పుల వల్ల నా పని సులభమైంది. ఆయనలా పనిచేయడం కష్టం' అని అన్నారు. కాగా, జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబర్ 8న సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు.

### వ్యవస్థపై చిరకాల ముద్ర

సీజేఐగా రెండేళ్ల వ్యవధిలో జస్టిస్ చంద్రచూడ్ న్యాయవ్యవస్థపై చిరకాల ముద్ర ఉండే నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, తీర్పులు వెలువరించారు. న్యాయ దేవత విగ్రహం కళ్లకు ఉన్న గంతలను, ఆమె చేతిలో కత్తిని తొలగించి రాజ్యాంగాన్ని ఉంచడం ఆయన చేసిన కీలక మార్పుల్లో ఒకటి. సుప్రీంకోర్టుకు ఇచ్చే వేసవి సెలవులను పాక్షిక పనిదినాలుగా ప్రకటించారు. కోర్టు రికార్డులను డిజిటలైజ్ చేయడం వంటి వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టారు. దాదాపు 500 తీర్పులు చెప్పిన జస్టిస్ చంద్రచూడ్ కొన్నింటి విషయంలో చరిత్రలో నిలిచిపోతారు. అయోధ్యలో రామమందిరానికి భూమి కేటాయించడం, ఆర్టికల్ 370 రద్దు, గే సెక్స్ నేరం కాదని చెప్పడం, ఎన్నికల బాండ్లు రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించడం, వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కుగా గుర్తించడం, అవివాహితకు కూడా అబార్షన్ హక్కు ఆయన వెలువరించిన తీర్పుల్లో అతి ముఖ్యమైనవి.

### విమర్శలు కూడా..

జస్టిస్ చంద్రచూడ్ కొన్ని విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా తన ఇంటికి ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆహ్వానించడం, అయోధ్య తీర్పు సమయంలో దేవుడిని ప్రార్థించానని ప్రకటించడం చర్చనీయాంశాలయ్యాయి. మొత్తం ప్రైవేటు ఆస్తిని సేకరించే అధికారం ప్రభుత్వానికి లేదని తీర్పు ఇస్తూ సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం జీవితాంతం పోరాడిన జస్టిస్ కృష్ణయ్యర్‌ను విమర్శించడంతో ఆక్షేపణకు గురయ్యారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబాకు హైకోర్టు బెయిల్ ఇస్తే రాత్రికి రాత్రే సుప్రీంకోర్టు దాన్ని రద్దు చేయడంతో జస్టిస్ చంద్రచూడ్‌కు మానవ హక్కులపై ఉన్న గౌరవాన్ని ప్రశ్నార్థకం చేసింది. ప్రత్యేక సీబీఐ కోర్టు జడ్జి లోయా సహజ మరణం చెందారని ఆయన ఇచ్చిన తీర్పు కూడా వివాదాస్పదమయింది. చంద్రచూడ్ హయాంలో కొలీజియం చేసిన అనేక సిఫార్సులను ప్రభుత్వం పక్కన పెట్టినా ప్రశ్నించకపోవడం న్యాయవ్యవస్థ విజ్ఞతను శంకించినట్లయింది. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన వారిపై ఈడీ దర్యాప్తు జరిపించాలన్న అభ్యర్థననూ ఆయన తోసిపుచ్చడంపైనా విమర్శలు వచ్చాయి. మొత్తంగా పొగడ్తలు, విమర్శలతో ఆయన పదవీ కాలం ముగిసింది.

## పుణ్య క్షేత్రాలను ప్రత్యేక రాష్ట్రాలు చేయాలా?

- కేఏ పాల్‌పై సుప్రీంకోర్టు అసహనం
- తిరుపతిని యూటీగా మార్చాలన్న పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతిని కేంద్రపాలిత ప్రాంతం(యూటీ)గా మార్చాలన్న వినతిని శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. దేశంలోని కేదార్‌నాథ్, పూరీ జగన్నాథ్ వంటి పుణ్యక్షేత్రాలను కూడా ప్రత్యేక రాష్ట్రాలుగా చేయమంటారా? అని పిటిషనర్ కేఏ పాల్‌ను ప్రశ్నించింది. తిరుమల-తిరుపతిని యూటీగా ప్రకటించాలని, టీటీడీకి స్వయం ప్రతిపత్తి హోదా కల్పించాలని కోరుతూ కేఏ పాల్ అక్టోబర్ 3న పిటిషన్ దాఖలు చేశారు. దానిపై ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కేఏ పాల్ స్వయంగా వాదనలు వినిపించారు. 746 మంది క్యాథలిక్స్ కోసం వాటికన్ సిటీ ఉన్నప్పుడు, 30 లక్షల మంది భక్తులు ఉన్న తిరుపతిని ఎందుకు యూటీగా ఏర్పాటు చేయలేమని అన్నారు. క్రైస్తవులు, ముస్లింలు తమ మత స్థలాలైన చర్చిలు, మసీదులపై స్వయం ప్రతిపత్తి కలిగి ఉన్నారని, అదే హక్కును హిందువులకు నిరాకరించడం సరికాదని చెప్పారు. ఈ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. "రాష్ట్రాలు, యూటీలపై నిర్ణయాలు పార్లమెంటులో జరుగుతాయి. అది మా పరిధి కాదు. మీ వాదనలు వింటుంటే భవిష్యత్తులో దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలు, గురుద్వారాలు, ఇతర మందిరాలను యూటీలుగా మార్చమనేలా ఉన్నారు" అంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు ప్రకటించింది.

## అలీగఢ్.. సెంట్రల్ వర్సిటీ కాదు!

**మైనారిటీ హోదాపై కొత్త ధర్మాసనం విచారించాలి**

- సుప్రీంకోర్టు 4:3 మెజారిటీ తీర్పు

న్యూఢిల్లీ, నవంబరు 8: ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి (ఏఎంయూ) మైనారిటీ హోదా లభించేందుకు మార్గం సుగమమైంది. ఈ మేరకు, ఏఎంయూను మైనారిటీ సంస్థగా కాకుండా సెంట్రల్ యూనివర్సిటీగా గుర్తించాలంటూ 1967లో సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం కొట్టివేసింది. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తన పదవీకాలం చివరిరోజైన శుక్రవారం.. సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఏఎంయూ మైనారిటీ హోదాపై తీర్పును వెలువరించారు. అయితే, ఏఎంయూ మైనారిటీ వర్సిటీ కాదన్న గత తీర్పును కొట్టివేసినప్పటికీ.. మైనారిటీ హోదా అంశంపై విచారణకు కొత్త ధర్మాసనానికి ఈ కేసును సిఫార్సు చేశారు. ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ మేరకు 4:3 మెజారిటీతో తీర్పు ఇచ్చింది. వాస్తవానికి ఈ కేసుపై విచారణ ఫిబ్రవరి 1వ తేదీనే ముగిసినప్పటికీ ధర్మాసనం తీర్పును రిజర్వులో పెట్టి ప్రస్తుతం వెలువరించింది. ప్రత్యేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకునే హక్కు మతపరమైన, భాషాపరమైన మైనారిటీలకు ఉందని ఆర్టికల్ 30(1) విస్పష్టంగా ప్రకటిస్తున్న విషయాన్ని సుప్రీంకోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. రాజ్యాంగం అమలులోకి రాకముందు ఏర్పాటైన యూనివర్సిటీలకు కూడా ఇది వర్తిస్తుందని తెలిపింది. ఏఎంయూని మైనారిటీ వర్గం ఏర్పాటు చేయలేదని, ఒక ప్రత్యేక చట్టం ద్వారా అది ఏర్పాటైనందున దానిని మైనారిటీ విద్యాసంస్థగా గుర్తించలేమని పేర్కొన్న 1967 నాటి సుప్రీంకోర్టు తీర్పును.. ఈ కారణం వల్లనే కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రత్యేకంగా ఏఎంయూకు, మొత్తంగా మైనారిటీ హక్కులకు లభించిన విజయమని ఏఎంయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఫైజన్ ముస్తఫా హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో ఆయనే సుప్రీంకోర్టులో ఈ కేసు దాఖలు చేశారు. కాగా, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మైనారిటీలకు ఉన్న చదువుకునే హక్కును సమర్థిస్తోందని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ పేర్కొన్నారు.

# సుల్తాన్ ఉల్‌ఉలూం విద్యాసంస్థకు ఎదురుదెబ్బ

» అఫిలియేషన్ జారీ చేయడానికి నిరాకరించిన హైకోర్టు

» 1.5 లక్షల జరిమానా.. శరణాలయానికి చెల్లించాలని ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఎంబీఏ, ఫార్మసీ తదితర కాలేజీలు నిర్వహిస్తున్న బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్‌ఉలూం ఎడ్యుకేషన్ సొసైటీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. దీని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాలలకు అనుబంధ గుర్తింపు(అఫిలియేషన్) ఇవ్వరాదని, కోర్సులకు అనుమతి కొనసాగించరాదని అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. ఏఐసీటీఈ నిబంధనల్లోని క్లాజ్ 6 ప్రకారం... సాంకేతిక విద్యకు సంబంధించిన కళాశాలలను ఏర్పాటు చేయబోయే సొసైటీ లేదా ట్రస్టు ప్రమోటర్‌కు చట్టబద్ధంగా యాజమాన్య హక్కులు(క్లియర్ టైటిల్) కలిగిన భూమి ఉండాలి. కాగా సుల్తాన్ ఉల్‌ఉలూం కళాశాల ఉన్న బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 3లోని 24.10 ఎకరాల భూమి (మౌంట్ ప్లజంట్ బిల్డింగ్ ) వివాదంలో ఉందని, సదరు భూమిపై సొసైటీకి యాజమాన్య హక్కులు లేకపోవడంతో అఫిలియేషన్ జారీచేయడానికి కోర్టు నిరాకరించింది. ఏఐసీటీఈ నిర్ణయంపై సొసైటీ 2017లో హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేసింది. 6వేల మంది విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బందులు వస్తాయని, గుర్తింపును కొనసాగించాలని కోరడంతో హైకోర్టు షరతులతో కూడిన అనుమతులిచ్చింది. తాజాగా అఫిలియేషన్, కోర్సులకు అనుమతి కొనసాగించే విషయంలో ఏఐసీటీఈదే తుది నిర్ణయమని జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం తీర్పు వెల్లడించింది. అయితే ప్రస్తుతం ఉన్న విద్యార్థుల అడ్మిషన్‌లపై, వారికి సర్టిఫికెట్లు జారీ చేసే అంశంపై ఈ తీర్పు ప్రభావం ఉండదని పేర్కొంది. ఎలాంటి గ్రౌండ్స్ లేకుండా పిటిషన్‌లు వేసినందుకు సొసైటీ ఆధ్వర్యంలోని మూడు కాలేజీలకు రూ. 50 వేల చొప్పున జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని సికింద్రాబాద్‌లోని ప్రత్యేక అవసరాల పిల్లల శరణాలయం శ్రీవిద్యాస్ సెంటర్‌కు చెల్లించాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది.

# ములుగులో 'ఇసుక సిండికేట్' దందా

**అధికారుల అండతో 30 రీచ్‌లు హస్తగతం.. గిరిజన సంఘాలకు దక్కాల్సినవి బినామీల ద్వారా గుప్పిట్లోకి**

» పెసా నిబంధనలకు తూట్లు

» ఇష్టారాజ్యంగా యంత్రాలతో తవ్వకాలు

» అన్నీ తెలిసినా ఉన్నతాధికారుల మౌనం


ఇసుక తవ్వకాలకు వాడుతున్న ఎక్స్‌కవేటర్లు

భూపాలపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో ఇసుక సిండికేట్ దందా నడుస్తోంది. గిరిజన సహకార సంఘాలకు దక్కాల్సిన ఇసుక రీచ్‌లను అధికారుల అండతో బినామీ కాంట్రాక్టర్ల ద్వారా సొంతం చేసుకుని రెచ్చిపోతోంది. నిబంధనలకు విరుద్ధంగా రీచ్‌లు దక్కించుకోవడమే కాక యంత్రాలతో తవ్వకాలు చేపట్టి ఇసుకను ఇష్టారాజ్యంగా తరలించేస్తోంది. అధికార కాంగ్రెస్‌తోపాటు బీజేపీకి చెందిన ముఖ్య నేతల అనుచరులు ఈ సిండికేట్‌లో కీలకంగా వ్యవహరిస్తుండడం, సిండికేట్ నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు అందుతుండడంతో చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. నిజానికి, పెసా (పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్) నిబంధనల ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లను గిరిజన సహకార సంఘాలకు మాత్రమే కేటాయించాలి. ఆయా క్వారీల్లో మానవ వనరుల సాయంతోనే తవ్వకాలు నిర్వహించాలి. కానీ, రీచ్‌ల గుర్తింపు దగ్గర నుంచి కేటాయింపు వరకు ఏ నిబంధనలు ఇక్కడ అమలు కావడం లేదు. ములుగు జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో మొత్తం 50 ఇసుక రీచ్‌లకు దరఖాస్తులు రాగా 30 ఇసుక రీచ్‌లను అక్టోబరు 25న వేర్వేరు కాంట్రాక్టర్లకు కేటాయించారు. ఇందులో వెంకటాపురం మండలంలో 27, మంగపేట మండలంలో ఏడు ఉన్నాయి. ఇవన్నీ సిండికేట్‌కు చెందిన బినామీ కాంట్రాక్టర్లకే దక్కాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో వరంగల్ జిల్లాకు చెందిన ఓ మంత్రి, మరో ఎమ్మెల్యేల అనుచరులు, ఓ రాష్ట్రస్థాయి బీజేపీ నేత అనుచరుడు, ప్రభుత్వంలో కీలక నామినేటెడ్ చైర్మన్ పదవిని నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేత కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. మైనింగ్ విభాగంలో చాలాకాలంగా ఇక్కడ తిష్ఠ వేసిన ఓ ఉద్యోగి.. తన బంధువైన సదరు చైర్మన్ అండతో సిండికేట్ వ్యవహారాలను చక్కబెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి అనుచరుడు, ఓ టీజీఎండీసీ ఉద్యోగి, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న చర్ల ప్రాంతానికి చెందిన ఓ వీఆర్వో సిండికేట్‌కు సహకరిస్తున్నారనే వాదనలు ఉన్నాయి. ఆయా రీచ్‌ల గుర్తింపులో కీలకంగా వ్యవహరించిన నలుగురు అధికారులకు సిండికేట్ నుంచి రూ.లక్షల్లో ముడుపులు అందినట్టు తెలిసింది.

## అన్నీ అక్రమాలే..

సిండికేటు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడుతున్న పలువురు అధికారులు ఇసుక కమిటీలకు చైర్మన్ అయిన కలెక్టర్‌కే మస్కా కొడుతున్నారు. ప్రతీ ఏటా గోదావరి తగ్గుముఖం పట్టిన తర్వాత ఇసుక పరిమాణం ఏ మేరకు ఉంది? ఎన్ని మీటర్ల లోతు వరకు ఇసుక తీయవచ్చు? ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలపై పడే ప్రభావం ఎంత? వంటి అంశాలపై అధ్యయనం చెయ్యాలి. రీచ్‌కు రీచ్‌కు మధ్య కనీసం అర కి.మీ. దూరం ఉండేలా క్వారీలు ఎంపిక చేసి సిఫారసు చెయ్యాలి. కానీ సిండికేట్‌కు వంత పాడుతున్న అధికారులు.. కనీసం 200 మీటర్ల దూరం కూడా వదలకుండా పక్కపక్కనే రీచ్‌లకు సిఫారసులు చేశారు. అంతేనా, నీళ్ల నిల్వ ఉన్న చోట కూడ రీచ్‌లకు అనుమతులిస్తున్నారు. ఏడాదిన్నరగా 50కిపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే ఇసుక సిండికేట్ కోరుకున్న 30 ఫైళ్లకు ఆమోదం లభించిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యవహారంలో మైనింగ్ ఏడీ పాత్రపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏ ఫైల్‌కు సంబంధించి సర్వే ఎప్పుడు చేశారన్న విషయాన్ని కూడా కలెక్టర్‌కు తెలియజేయకపోవడం... కలెక్టర్ కూడా సమాచారం సరైనదా? కాదా? అని సరిచూసుకోకుండా అనుమతులు ఇవ్వడం ఆశ్చర్యం కలిగించే అంశాలు.

# వర్రా ఎక్కడ?

» పట్టుకున్నారా... మళ్లీ పారిపోయాడా?

» అరెస్టును ధ్రువీకరించని పోలీసులు



కర్నూలు/కడప/అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలపై సోషల్ మీడియాలో కాలకూట విషం చిమ్మిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త, జగన్ సతీమణి భారతి పీఏ, ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రా రెడ్డి ఎక్కడ? పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారా? లేక... మరోసారి మస్కా కొట్టి తప్పించుకున్నాడా? దీనిపై పలు రకాలుగా ప్రచారం జరుగుతోంది. మంగళవారం అర్ధరాత్రి వర్రా కడపలో పోలీసులను ఏమార్చి తప్పించుకున్నాడు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. కడప ఎస్పీని బదిలీ చేయడంతోపాటు... సీఐపై సస్పెన్షన్ వేటు వేసింది. ఆ క్షణం నుంచే వర్రా కోసం వేట మొదలైంది. 'గ్రేట్ ఎస్కేప్' తర్వాత అతను బెంగళూరుకు చేరుకున్నటు పోలీసులు అనుమానించారు. కానీ... బెంగళూరు 'సేఫ్' కాదనే ఉద్దేశంతో శుక్రవారం వర్రా కారులో హైదరాబాద్‌కు బయలుదేరినట్లు తెలిసింది. కర్నూలు మీదుగా తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవేశించాక... పోలీసులు వర్రాను అదుపులోకి తీసుకున్నట్లు శుక్రవారం సాయంత్రం ప్రచారం జరిగింది. కానీ, పోలీసులు దీనిని ధ్రువీకరించలేదు.

### త్రుటిలో తప్పించుకున్నాడు: డీఐజీ

వర్రా రవీంద్రా రెడ్డిని అరెస్టు చేయలేదని, అతని కోసం నాలుగు బృందాలతో గాలింపు కొనసాగుతోందని కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. "వర్రా కదలికలపై నిఘా పెట్టాం. అతను కర్నూలు దాటి హైదరాబాద్ వెళ్తున్నట్లుగా సెల్‌ఫోన్ సిగ్నల్ ద్వారా గుర్తించాం. అయితే... మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వరకు సెల్‌ఫోన్ సిగ్నల్ ట్రాక్ అయ్యింది. కొన్ని నిమిషాల్లో అరెస్టు చేయడం ఖాయమని భావించాం. కానీ... ఫోన్ ఆఫ్ చేయడంతో సిగ్నల్ కట్ అయింది. వర్రా రవీంద్రా రెడ్డి కోసం గాలిస్తున్నాం. త్వరలోనే అరెస్టు చేస్తాం" అని డీఐజీ స్పష్టం చేశారు. జడ్చర్ల సమీపంలో అతని ఫోన్ సిగ్నల్ మిస్ అయ్యిందని, అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాడో గుర్తించాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు.

### బూతు, రోతల వర్రా

వర్రాపై రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల కేసులున్నాయి. శ్రుతిమించిన బూతు, రోత భాషతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటాడు. చివరికి.. జగన్ సోదరి షర్మిలను, వివేకా కుమార్తె సునీతా రెడ్డినీ నీచంగా దూషించాడు. ఇక... సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితపై వర్రా దారుణమైన పోస్టులు పెట్టాడు. ఈ నేపథ్యంలోనే పోలీసులు అతని కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వర్రాపై 2018లో విజయవాడ సిటీ, సైబర్ క్రైం పోలీసుస్టేషన్‌లో 2 కేసులు, 2022లో తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో 2, పెదనందిపాడు, పొన్నూరు, మదనపల్లె, పోరుమామిళ్ల, రాజంపేట తదితర స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

## టీటీడీ బోర్డు సభ్యులుగా మరో ఐదుగురి ప్రమాణం

తిరుమల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా మరో ఐదుగురు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, సౌరభ్ బోరా, నన్నపనేని సదాశివరావు, కృష్ణమూర్తి వైద్యనాథన్‌తో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి ఆలయంలో ప్రమాణం చేయించారు. అనంతరం శ్రీవారిని దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకున్న వారిని వేదపండితులు ఆశీర్వదించారు. ప్రమాణ స్వీకారం అనంతరం పనబాక లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ.. తనను టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియమించిన సీఎం చంద్రబాబుకు, లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. దేవదేవుడికి సేవ చేసుకునే భాగ్యం కలిగించిన ముఖ్యమంత్రికి జ్యోతుల నెహ్రూ కృతజ్ఞతలు తెలిపారు.


షాద్‌నగర్‌లో జిల్లా అదనపు, సెషన్ కోర్టు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సెకండ్ ఏడీజే రత్నపద్మావతి

## షాద్‌నగర్, ఇబ్రహీంపట్నంలలో అదనపు జిల్లా కోర్టుల ప్రారంభం

» వర్చువల్‌గా పాల్గొన్న హైకోర్టు సీజే ఆరాదే

షాద్‌నగర్ అర్బన్, ఇబ్రహీంపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్, ఇబ్రహీంపట్నంలలో ఏర్పాటు చేసిన అదనపు జిల్లా-సెషన్ జడ్జి కోర్టులను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాదే ప్రారంభించారు. హైకోర్టు నుంచి వర్చువల్‌గా జరిగిన కార్యక్రమంలో పాల్గొని వీటిని ప్రారంభించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్యాం కోషీ, జస్టిస్ టి. వినోద్‌కుమార్, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ కోర్టు సముదాయం వద్ద పెద్ద టీవీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అదనపు జిల్లా-సెషన్ జడ్జి కోర్టు శిలాఫలకాన్ని రెండో ఏడీజే సి.రత్నపద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ అలోక్ ఆరాదే మాట్లాడుతూ అదనపు కోర్టుల ప్రారంభంతో సత్వర న్యాయం జరుగుతుందని చెప్పారు. ఇబ్రహీంపట్నంలో నూతనంగా ఏర్పాటయిన 15వ అదనపు జిల్లా- సెషన్స్ జడ్జి న్యాయస్థానాన్ని కూడా జస్టిస్ ఆరాదే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రజలకు చేరువలో న్యాయస్థానాలు ఉండాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో వీటిని ప్రారంభించినట్టు చెప్పారు.

## ఇద్దరు హెచ్‌ఎంల సస్పెన్షన్

» ఖమ్మం జిల్లాలో హిందీ ఉపాధ్యాయుల నియామకంలో నిర్లక్ష్యంపై చర్యలు

ఖమ్మం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో హిందీ ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ప్రధానోపాధ్యాయులు(హెచ్‌ఎం)పై సస్పెన్షన్ వేటు పడింది. సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకుని 22 రోజులు పాటు విధులు నిర్వర్తించిన ఏడుగురు హిందీ ఉపాధ్యాయులను గురువారం విధుల నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. తగిన విద్యార్హత లేదంటూ వారిని విధుల నుంచి తప్పించిన అధికారులు వారి స్థానాలను ఇతరులతో భర్తీ కూడా చేశారు. ధ్రువపత్రాల పరిశీలనలో జరిగిన పొరపాటు వల్లే ఇదంతా జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం జీవో నెం. 25 ప్రకారం హిందీ పండిట్ పోస్టులు భర్తీచేయాలని నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం హెచ్‌పీటీ ట్రైనింగ్ సర్టిఫికెట్‌తో పాటు డిగ్రీలో ఒక సబ్జెక్టుగా హిందీ తప్పనిసరిగా ఉండాలి. కానీ, ఖమ్మం జిల్లాలో ఉద్యోగాలు పొందిన వారిలో ఓ ఏడుగురు 'దక్షిణ భారతహిందీ ప్రచారసభ మద్రాస్' నుంచి హిందీ కోర్సులను పూర్తి చేసిన సర్టిఫికెట్లను సమర్పించారు. అయితే, సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో సంబంధిత జీవోను పరిశీలించని హెచ్‌ఎంలు.. ఆ ఏడుగురు హిందీ పండిట్లను అర్హులుగా గుర్తించి ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో అర్హత ఉండి ఉద్యోగావకాశం కోల్పోయిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా మరోసారి సర్టిఫికెట్లను పరిశీలించాలని ఆదేశించారు. దీంతో ధ్రువపత్రాలను పునఃపరిశీలించిన అధికారులు జీవో నెం 25 ప్రకారం నియామకం జరగలేదని తేల్చారు. ధ్రువపత్రాల పరిశీలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొణిజర్ల మండలం గుబ్బగుర్తి పాఠశాల హెచ్‌ఎం పి.శివనారాయణ, ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రంగారెడ్డిని శుక్రవారం సస్పెండ్ చేశారు. కాగా, హెచ్‌ఎంల సస్పెన్షన్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ జిల్లా హెచ్‌ఎంల సంఘం డీఈవోకు ఓ వినతి పత్రం అందజేసింది.

## తప్పు డీఈవోలది.. శిక్ష హెచ్‌ఎంలకా!

హైదరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో దొర్లిన పొరపాట్లకు హెచ్‌ఎంలను శిక్షించడం సరైనది కాదని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి రాజగంగారెడ్డిలు చెప్పారు. ఖమ్మం జిల్లాలో జరిగిన ఘటనలో ఇద్దరు హెచ్‌ఎంలను సస్పెండ్ చేయడం పట్ల వారు తీవ్రంగా స్పందించారు. ఉపాధ్యాయ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ విషయంలో జిల్లా విద్యాధికారులు(డీఈవో), ఇతర సిబ్బంది బాధ్యత తీసుకోవాలన్నారు. అంతేగానీ వారికి సహాయం చేసిన హెచ్‌ఎంలను బాధ్యులుగా చేసి, వారిని సస్పెండ్ చేయడం మంచిది కాదన్నారు.

## బాబా బాగేశ్వర్ ఇంటర్వ్యూను తొలగించండి

న్యూఢిల్లీ, నవంబరు 8: మత సామరస్యాన్ని దెబ్బతీసి, క్షుద్రవిద్యలను ప్రోత్సహించే ప్రకటనలు, కార్యక్రమాలు, ఇంటర్వ్యూలను చానల్స్ అనుమతించరాదని నేషనల్ బ్రాండ్‌కాస్టింగ్ అండ్ డిజిటల్ స్టాండర్డ్స్ అథారిటీ స్పష్టం చేసింది. మూఢ విశ్వాసాలను ప్రేరేపించే ఇంటర్వ్యూను ప్రసారం చేసిన 'న్యూస్ 18'ను మందలించింది. ఈ కార్యక్రమం వీడియోను ప్రసారాల నుంచి తొలగించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. 'న్యూస్ 18' ఇటీవల ధీరేంద్ర కృష్ణ శాస్త్రి అనే ప్రవచనకర్త ఇంటర్వ్యూను ప్రసారం చేసింది. ఈ ఇంటర్వ్యూలో ఆయన పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'బాబా భగేశ్వర్ ప్రత్యేక ఇంటర్వ్యూ' పేరిట 'న్యూస్ 18' ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేసింది.

# కల్వకుర్తి-మాచర్ల రైల్వేలైన్ పనులు ప్రారంభించండి

» దక్షిణ మధ్య రైల్వే జీఎంను కోరిన ఎంపీ మల్లు రవి


రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న మల్లు రవి

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేసే కల్వకుర్తి-మాచర్ల నూతన రైల్వే మార్గం పనులను తక్షణమే ప్రారంభించాలని రైల్వే ఉన్నతాధికారులను నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి కోరారు. ఈ మేరకు శుక్రవారం సికింద్రాబాద్ రైలు నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రతిపాదించిన పలు రైల్వే నూతన ప్రాజెక్టులపై చర్చించారు. ప్రధానంగా డోర్నకల్ నుంచి సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి నుంచి గద్వాల్ వరకు ప్రతిపాదించిన నూతన రైల్వే లైన్ సర్వే పనులు పూర్తి చేయాలని మల్లు రవి కోరారు. అలాగే ఇప్పటికే సర్వే పనులు పూర్తి చేసిన జడ్చర్ల నుంచి నాగర్‌కర్నూల్- కల్వాపూర్ మీదుగా నంద్యాల వరకు ప్రతిపాదించిన రైల్వే పనులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. నూతన రైల్వే లైన్‌ను ఏర్పాటు చేస్తే ఉమ్మడి మహబూబ్‌నగర్ అభివృద్ధి చెందుతుందని, నాగర్‌కర్నూల్ పరిధిలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. గద్వాల్ రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ కోసం రైల్వే తరఫున స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆలంపూర్, గద్వాల్ రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్‌ల కింద అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఆన్‌లైన్‌లోనే!

» ఉద్యోగులతోపాటు విశ్రాంత ఉద్యోగులకు ఊరట



హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించాలని సర్కారు నిర్ణయించింది. ఈ దిశగా వైద్య ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటి దాకా మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను నేరుగా తీసుకుని స్క్రూటినీ చేస్తున్నారు. దాంతో ఒక్క వైద్య విద్య సంచాలకుల కార్యాలయంలోనే మెడికల్ బిల్లుల స్క్రూటినీకి కనీసం ఐదారు నెలల సమయం పడుతోంది. ఆన్‌లైన్ చేయడం వల్ల రోజుల వ్యవధిలోనే స్క్రూటినీ ప్రక్రియ పూర్తయి, వేగంగా నగదు అందే అవకాశం ఉంటుందని వైద్య వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులందరూ కలిపి 25-30 లక్షల మంది దాకా ఉన్నారు. వీరు ఏదైనా వ్యాధి బారినపడి చికిత్స పొందినా.. లేక శస్త్ర చికిత్స చేయించుకున్నా.. ఆస్పత్రి బిల్లులను ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. రూ.50వేలలోపు బిల్లులైతే జిల్లా స్థాయిలో, రూ.2లక్షల్లోపు ఉన్న బిల్లు అయితే డీఎంఈ కార్యాలయం స్క్రూటినీ చేసి.. నిధులు మంజూరు చేస్తుంది. అంతకు మించి బిల్లు ఉంటే.. ప్రభుత్వం వేసిన కమిటీ పరిశీలించి.. ఎంత ఇవ్వాలో నిర్ణయిస్తుంది. సాధారణంగా మెడికల్ బిల్లులను తాము పనిజేస్తున్న శాఖ విభాగాధిపతి ద్వారా రీయింబర్స్‌మెంట్ కోసం పంపాలి. ఆ శాఖ నుంచి వైద్యవిద్య సంచాలకుల కార్యాలయానికి సదరు బిల్లు వస్తుంది. అక్కడ వైద్యుల బృందం ఆ బిల్లులను నిశితంగా పరిశీలిస్తుంది. బిల్లు విషయంలో ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే.. కొంత మేర కోత పెడుతుంది. అయితే, ఈ బిల్లులను స్క్రూటినీ చేసే విషయంలో డీఎంఈ కార్యాలయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నెలకు సగటున 4-5 వేల బిల్లులు (ఏటా50-60 వేలు) వస్తుండగా.. రోజుకు కనీసం 150 బిల్లులను స్క్రూటినీ చేయాల్సి వస్తోంది. సెలవులు, సమయం సరిపోకపోవడం వంటి కారణాలతో స్క్రూటినీ చేయాల్సిన బిల్లుల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోంది. ప్రస్తుతమైతే.. బిల్లు అందినప్పటి నుంచి స్క్రూటినీ పూర్తి కావడానికి ఐదారు నెలలు పడుతోంది. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇక నుంచి ఉద్యోగులు... మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వారి మాతృశాఖ నుంచే ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కాగా, ప్రస్తుతం డీఎంఈ పరిధిలో 34 మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ ఆస్పత్రులు, హైదరాబాద్‌లోని స్పెషాలిటీ ఆస్పత్రుల పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల స్క్రూటినీ బాధ్యతలను డీఎంఈ నుంచి తప్పించి.. ఆరోగ్య శ్రీ ట్రస్ట్‌కు అప్పగించాలని సర్కారు భావిస్తోంది. ఇకపై ఈ బిల్లులన్నింటినీ ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లోని నిపుణులైన వైద్యుల బృందం వేగంగా స్క్రూటినీ చేయనుంది. తద్వారా మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం ఏడాది నుంచి రెండేళ్ల దాకా ఆగాల్సిన అవసరం తప్పడంతోపాటు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఊరట దక్కనుందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# బెంగళూరులో ముగిసిన 'హైడ్రా' పర్యటన

**కేటీసీడీఏ సీఈవోతో భేటీ.. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ గురించి తెలుసుకున్న హైడ్రా కమిషనర్ బృందం**


హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు చెరువు పునరుద్ధరణ గురించి వివరిస్తున్న ఆనంద్ మల్లిగవాడ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో హైడ్రా అధికారుల బృందం పర్యటన ముగిసింది. పర్యటన సందర్భంగా కర్ణాటక ట్యాంక్స్ కన్జర్వేషన్ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (కేటీసీడీఏ) సీఈవో రాఘవన్‌తో శుక్రవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బృందం సమావేశమైంది. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు కేటీసీడీఏ చేపడుతున్న చర్యలను వారు అడిగి తెలుసుకున్నారు. చెరువుల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో ఉన్న భూమిని ప్రభుత్వ భూమిగా పరిగణిస్తున్నట్టు రాఘవన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కర్ణాటక ప్రభుత్వం తెచ్చిన దిశాంక్ యాప్‌లో ప్రభుత్వ భూమి, పట్టా భూమి, హక్కుదారుడి వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. చెరువుల అభివృద్ధికి సంబంధించి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాక సాంకేతిక బృందం అధ్యయనం అనంతరం పనులు చేపడుతున్నట్టు రాఘవన్ పేర్కొన్నారు. విమోస్ టెక్నోక్రాట్స్ లిమిటెడ్ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇప్పటి వరకు చేపట్టిన చెరువుల పునరుద్ధరణ తీరును వివరించారు. అనంతరం రంగనాథ్ మాట్లాడుతూ.. ఐటీ కంపెనీల ఆర్థిక సహకారంతో బెంగళూరులోని ఎలక్ట్రానిక్ కారిడార్‌కు వెళ్లే మార్గంలోని 44 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దొడ్డతోగు చెరువును సహజసిద్ధ విధానంలో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. మురుగు నీటిని శుద్ధి చేసి చెరువు చుట్టూ ఉన్న పార్కులో వినియోగిస్తున్నారని, వరద నీటిని ప్రత్యేకంగా నిల్వ చేస్తున్నారని చెప్పారు. చేపలు, బాతులు వంటి జలచరాలతో జీవవైవిధ్య కేంద్రాలుగా చెరువులున్నాయన్నారు. ప్రభుత్వం అనుమతితో హైదరాబాద్‌లోనూ ఇదే తరహాలో చెరువుల అభివృద్ధి చేయాలనుకుంటున్నామని, ఇందుకు 'లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా' ఆనంద్ మల్లిగవాడ్ సేవలు వినియోగించుకుంటామని తెలిపారు.

### హైడ్రా ఏర్పాటు విప్లవాత్మకం: ఆనంద్ మల్లిగవాడ్

హైదరాబాద్‌లో రెండు, మూడు చెరువుల పునరుజ్జీవానికి చర్యలు తీసుకున్నాం. వచ్చే ఏడాది వరకు మరో 10 చెరువులను పునరుద్ధరించాలని భావిస్తున్నాం. హైదరాబాద్ నైసర్గిక స్వరూపంపై నాకు అవగాహన ఉంది. అక్కడి చెరువులకు పునరుజ్జీవం కల్పించే అవకాశం ఎక్కువగా ఉంది. ఆక్రమణ తొలగింపునకు హైడ్రా ఏర్పాటు విప్లవాత్మకం. దేశవ్యాప్తంగా ఈ తరహా వ్యవస్థ ఏర్పాటు చేయాలి. అప్పుడు భవిష్యత్తుతరాలకు నాణ్యమైన గాలి, నీరు, మెరుగైన పర్యావరణ పరిస్థితులు అందించగలం. దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో చెరువుల పునరుజ్జీవం జరిగింది. బెంగళూరులోనూ మొదలైంది. మూడు లేదా నాలుగో నగరంగా హైదరాబాద్ నిలవాలి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# వెనకడుగు వద్దు!

వాతావరణ మార్పుపై మానవ పోరాటానికి ఉద్దేశించిన సభ్య దేశాల మహాసదస్సు (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్–కాప్) సోమవారం నుంచి అజర్‌బైజాన్ రాజధాని బాకులో ఆరంభమవుతోంది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఏటా జరిగే ఈ సదస్సుకు ముందు ఏవో అద్భుతాలు జరిగిపోతాయన్న భ్రమ కలుగుతూనే ఉంటుంది. దేశాల నాయకులు, పారిశ్రామికవేత్తలు, పర్యావరణవేత్తలు, ఉద్యమకారులు, మరోపక్క మాడిపోతున్న, మునిగిపోతున్న దేశాల నుంచి వచ్చే నిరసనకారులతో ఓ పదిరోజులపాటు అజర్‌బైజాన్ కళకళలాడబోతోంది. వేడెక్కుతున్న ధరిత్రిని కాప్ సదస్సు కాపాడుతుందని, కాస్తంత మనసుపెట్టి, నిర్దిష్టమైన నిర్ణయాలతో మనిషి మనుగడకు మార్గం చూపుతుందన్న నమ్మకం ఏటా ఎంతోకొంత ఉండేది. కానీ, ఈ సదస్సుకు కొద్దిరోజుల ముందు అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికై, ఆ కాస్త ఆశని కూడా ఈ మారు ప్రపంచానికి మిగలనివ్వలేదు.

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పు వంటి మాటలు ట్రంప్‌కు నచ్చవు. అవన్నీ పర్యావరణవేత్తలుగా చెప్పుకుంటున్నవారు చేస్తున్న శుష్కమైన వాదనలని ఆయన నమ్మకం. ధరిత్రి వేడెక్కడం, ప్రకృతి కోపించడం వంటి మాటలు నమ్మితే తనబోటి, తోటి పారిశ్రామికవేత్తలకు ఎంత నష్టమో ఆయనకు తెలుసు. పర్యావరణ పరిరక్షణకోసం తపిస్తున్న వారికీ, భూమిని కాపాడుకోవడానికి కృషిచేస్తున్నవారికీ ఆయన ఎన్నిక ఒక ప్రమాదకర హెచ్చరిక. వాతావరణమార్పు మీద ట్రంప్ తన తొలి విడత పాలనలో ఎంతటి వ్యతిరేక వైఖరి తీసుకున్నారో తెలిసిందే. పారిస్ ఒప్పందం అమెరికా శత్రువని ఆయన ప్రకటించాడు. భారత్, చైనా వంటి దేశాలను ఇష్టారాజ్యంగా శిలాజ ఇంధనాలను వాడుకోనిచ్చి, అమెరికాకు మాత్రమే ఈ డాక్యుమెంట్ ఉరితాళ్ళు వేస్తున్నదని విమర్శించాడు. అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా, దానికి అన్యాయం చేస్తున్న ఈ ఒప్పందంనుంచి వైదొలగాలని నిర్ణయించాడు. డ్రిల్...డ్రిల్..డ్రిల్ అన్న ఒకే ఒక్క నినాదంతో ఆయన తన విధానం ఏమిటో తేల్చేశాడు. ఆ తరువాత జో బైడెన్ అధికారంలోకి రాగానే ఆ నిర్ణయాన్ని తిరగదోడిన మాట వాస్తవమే కానీ, తాను మళ్ళీ అధికారంలోకి రాగానే తిరిగి అదే పని చేస్తానని ట్రంప్ ఇప్పటికే ప్రకటించాడు. ఇరాన్‌తో పాశ్చాత్య దేశాలు చేసుకున్న అణు ఒప్పందాన్ని ఇజ్రాయెల్ కోసం కాలదన్ని ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టేసిన ట్రంప్, పారిస్ ఒప్పందాన్ని మళ్ళీ కాదనడం ఖాయం. క్లైమేట్ ఫైనాన్స్ అంటే అమెరికా కష్టపడి సంపాదించిన సొమ్మును వేరొకరి చేజేతులా ధారపోయడమని ఆయన నిర్వచనం.

అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధులు సమకూర్చడం, నష్టాలను భర్తీచేయడం, ఉద్గారాలను నియంత్రించుకోవడం వంటి పలు అంశాల్లో గత ఏడాది దుబాయ్ సదస్సులో అడుగు ముందుకుపడింది. గతాన్ని సమీక్షించుకోవడం మీద అది శ్రద్ధపెట్టినందువల్ల, భవిష్యకార్యాచరణ చర్చ విస్తృతంగా జరిగింది. మూడుదశాబ్దాల కాప్ సదస్సుల చరిత్రలో శిలాజ ఇంధనాలు అన్న పదం సంయుక్త ప్రకటనలో చేరడం అదే తొలి సారి. 2050కల్లా వాటి వినియోగాన్ని దశలవారీగా వదులుకుంటూ సున్నా చేయాలని సంకల్పం చెప్పుకుంది. పారిస్ సదస్సు తీర్మానించిన ప్రకారం భూ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయడానికి వీలుగా కర్బన ఉద్గారాలను వేగంగా తగ్గించుకోవాలని, 2050కల్లా తటస్థత సాధించాలని ఆ సదస్సు నిర్ణయించింది. తదనుగుణంగా వ్యూహాలు, విధానాలు రాసుకుంటానని అమెరికా కూడా హామీ ఇచ్చింది. ప్రధానంగా ధనికదేశాల దురాశే వాతావరణ మార్పులకు, తద్వారా పేదదేశాలకు సంభవించే నష్టాలకు కారణం కనక, వాటిని ఆదుకొనే నిధి విషయంలోనూ ఈ సదస్సు తొలిరోజునే ప్రశంసనీయమైన అడుగువేసింది. 'లాస్ అండ్ డామేజ్' నిధికి హామీపడిన మేరకు ధనికదేశాలు నిధులు సమకూర్చని మాట నిజమే కానీ, 2030కల్లా ఏటా వందబిలియన్ డాలర్లు సమకూర్చుకోవాలన్న కొత్త లక్ష్యం నెరవేరితే పేదదేశాలకు ఈ నిధి కచ్చితంగా మేలుచేస్తుంది. ధరిత్రిని రక్షించుకొనే విషయంలో అజర్‌బైజాన్ సదస్సులో మరిన్ని నిర్దిష్టమైన అడుగులుపడతాయని నమ్ముతున్న తరుణంలో, ట్రంప్ మరో రాకడ ఇప్పుడు ప్రపంచాన్ని భయపెడుతోంది. మరో నాలుగేళ్ళపాటు అమెరికా ఏ గట్టున ఉండబోతున్నదో ఎలాగూ తెలిసిపోయింది కనుక, యూరోపియన్ యూనియన్, చైనా, ఇండియా, అభివృద్ధి చెందుతున్న దేశాలు చేయీ చేయీ కలిపి లక్ష్యాల సాధన దిశగా కృషిచేయడం అవసరం.

# ట్రంప్ గెలుపు సూచిస్తున్నదేమిటి?



■ పి. చిదంబరం

'పళని' పలుకు

మరో శక్తిమంతమైన నాయకుడు ఎన్నికయ్యాడు. ప్రపంచంలో అతి పురాతన ప్రజాస్వామిక వ్యవస్థ అయిన అమెరికాలో దేశాధ్యక్ష పదవీ ఎన్నికలో డోనాల్డ్ ట్రంప్ కచ్చితమైన, చరిత్రాత్మక విజయం సాధించారు. అమెరికాలో ఎన్నికల ప్రక్రియ న్యాయబద్ధతను ఎవరూ ప్రశ్నించరు, ప్రశ్నించలేరు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి అయిన డోనాల్డ్ ట్రంప్‌కు నియోజక గణం (ఎలెక్టోరల్ కాలేజీ) ఓట్లు 295 లభించగా ఆయన ప్రత్యర్థి, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌కు 226 మాత్రమే దక్కాయి. ప్రజల ఓట్లు సైతం అత్యధికంగా ట్రంప్‌కే లభించాయి. ఆయనకు 72.5 మిలియన్ ఓట్లు లభించగా కమలా హారిస్‌కు 68.15 మిలియన్ ఓట్లు దక్కాయి. 2024 ఎన్నికల విజయాలతో రిపబ్లికన్ పార్టీ ప్రాబల్యం మరింతగా పెరిగింది. అమెరికా కాంగ్రెస్ ఎగువ సభ సెనేట్‌లో ఇప్పుడు తిరుగులేని మెజారిటీని రిపబ్లికన్ పార్టీ సాధించుకున్నది. అలాగే దిగువ సభ ప్రతినిధుల సభ కూడా రిపబ్లికన్ల నియంత్రణలోనే కొనసాగే అవకాశమున్నది. ఏ ప్రమాణం ప్రకారం చూసినా డోనాల్డ్ ట్రంప్‌కు, రిపబ్లికన్ పార్టీకి సమగ్ర, ఘనమైన విజయం లభించింది.

నవంబర్ 5కు ముందు కొన్ని నెలల నుంచి రోజువారీగా జరిగిన ఓటర్ల సర్వేలు, అధ్యక్ష ఎన్నికల అంతిమ ఫలితాన్ని అంచనా వేయడంలో ఘోరంగా విఫలమయ్యాయి. డోనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మధ్య తీవ్ర పోటీ ఉన్నదని, ఇరువురూ సమ ఉజ్జీలుగా ఉన్నారని, ఎవరు గెలుస్తారనేది కచ్చితంగా చెప్పలేమని సర్వేలు పదే పదే పేర్కొన్నాయి. అయితే అది శుద్ధ పొరపాటు అని రుజువయింది. అలాగే 'స్వింగ్ స్టేట్స్'గా సుప్రసిద్ధమైన ఏడు రాష్ట్రాలలో ఓటర్ల మొగ్గు ఒకే వైపు–ట్రంప్‌కు అనుకూలంగా ఉన్నది. ఆ ఏడు 'స్వింగ్' రాష్ట్రాలలో ట్రంప్, కమలా హారిస్‌కు లభించిన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి (రాష్ట్రం పేరు తరువాత ఉన్న అంకెల్లో మొదటిది ట్రంప్‌కు, రెండవది కమలాహారిస్‌కు లభించిన ఓట్లు) : అరిజోనా– 1,303,793, 1,167,898; జార్జియా–2,654,306, 2,538,986; మిషిగన్–2,799,713, 2,715,684; నేవడా–688,179, 647,247; నార్త్ కరోలినా–2,876,141, 2,685,451; పెన్సిల్వేనియా–3,473,325, 3,339,559; విస్కాన్సిన్–1,697,237, 1,668,757. నువ్వా నేనా అన్న రీతిలో సంభవించిన పోటీలో ఓట్ల లభ్యతలోని స్వల్ప వ్యత్యాసాలు బలమైనవి, సార్థకమైనవి.

అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా రూపొందించుకుందాం అన్న నినాదంతో డోనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచారం చేశారు. అయితే ప్రచార పర్వంలో ఆయన ప్రసంగాలు స్త్రీలను కించపరిచేవిగాను, జాత్యహంకారాన్ని రెచ్చగొట్టేవిగాను, ప్రజలలో విభేదాలు, చీలికలు సృష్టించేవిగాను, ప్రత్యర్థులను అమితంగా దూష్యపలాడినవిగా ఉన్నాయని అమెరికా అధ్యక్ష ఎన్నికల ఘటనలు, ప్రచార వైనాల స్వతంత్ర పరిశీలకులు, నిష్పాక్షిక మీడియా ప్రతినిధులు అంగీకరించారు. అయితే అమెరికా ప్రజలలో అత్యధికులు ట్రంప్ ప్రచార తీరుతెన్నులను ఏ మాత్రం పట్టించుకోనే లేదు. వలసలు (ఇమిగ్రేషన్), ద్రవ్యోల్బణం (ఇన్‌ఫ్లేషన్), పెచ్చరిల్లిన నేరాలు (క్రైమ్స్) ఇత్యాది అంశాలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చారు. ఆ సమస్యల నుంచి ఎవరు తమను బయటపడవేయగలరని మాత్రమే వారు ప్రధానంగా ఆలోచించారు.

ద్రవ్యోల్బణాన్ని మినహాయిస్తే మిగతా రెండు మనం 'బతుకుతెరువు' అంశాలుగా పరిగణించేవి కావు. వాటిని మంచి జీవితాన్ని నిర్మించుకోవడంలో సాఫల్య వైఫల్యాలకు సంబంధించినవిగా అభివర్ణించవచ్చు. అమెరికాకు వలస వస్తున్న వారు 'మనలాంటి వారు కారు' అన్నది రిపబ్లికన్ల అభిప్రాయం. ఈ పరాయివారు శ్వేత జాతీయులైన అమెరికన్ క్రైస్తవ పౌరులను ముంచెత్తుతున్నారని, ఫలితంగా అమెరికా ప్రజలు అనేక ఆర్థిక ఇక్కట్లకు లోనవుతున్నారని అంటూ వలసకారులకు వ్యతిరేకంగా రిపబ్లికన్లు ముమ్మర ప్రచారం చేశారు. దశాబ్దాల క్రితం అమెరికాకు వలస వెళ్లినవారు (ప్రధానంగా లాటినో ఓటర్లు) సైతం కొత్త వలసకారుల నుంచి తమ మనుగడకు తీవ్ర ముప్పు వాటిల్లనున్నదని గట్టిగా భావిస్తున్నారు.

సరే ద్రవ్యోల్బణం ప్రతి దేశంలోనూ ప్రతి ఒక్కరికీ సమస్యలు సృష్టిస్తోంది. అమెరికాలో ద్రవ్యోల్బణాన్ని 2.4 శాతానికి కట్టడి చేశారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన వడ్డీ రేటును తగ్గించడానికి సిద్ధంగా ఉన్నది (ద్రవ్యోల్బణం తక్కువగా ఉందనేందుకు ఇదొక సూచన). అయినప్పటికీ ద్రవ్యోల్బణంను రిపబ్లికన్ పార్టీ ఒక ప్రచార అస్త్రంగా చేసుకున్నది. అనేక దేశాలలో మాదిరిగానే అమెరికాలోను నేరాలు బాగా పెరిగిపోయాయి. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, మాదక ద్రవ్యాలే నేరాల పెరుగుదలకు ప్రధాన కారణాలు. ఏ ప్రజాస్వామ్య దేశంలో అయినా ప్రతిపక్షాలు నేరాల పెరుగుదలను ఒక రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవడం కద్దు.

వలసలు, ద్రవ్యోల్బణం, నేరాల పెరుగుదలను డోనాల్డ్ ట్రంప్ తన రాజకీయ లబ్ధికి గరిష్ఠంగా ఉపయోగించుకున్నారు. కలహశీల ధోరణిలో అడ్డూ ఆపూ లేని రీతిలో ఈ సమస్యల విషయమై డెమొక్రాట్లను ఆయన తీవ్రంగా విమర్శించారు మొరటు భాషలో దూష్యపలాడారు. అయినప్పటికీ అమెరికన్ ఓటర్లు ఆయన మొరటుతనం, ముతక విమర్శల పట్ల ఎటువంటి అభ్యంతరం, ఆక్షేపణ తెలుపకపోవడం నన్ను చాలా విస్మయానికి గురిచేసింది.

డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ఎందుకు పరాజయం పాలయ్యారో తరచి చూద్దాం. ఎన్నికల ప్రచారంలో ఆమె ప్రాధాన్యతతో ప్రస్తావించిన అంశాలు ఏవీ అత్యధిక ఓటర్ల మనసులు, హృదయాలలో ప్రతిధ్వనించనే లేదు. గర్భస్రావం, మహిళల హక్కులు, రాజ్యాంగ మాన్యత, జాతుల మధ్య సమానత్వం, మత సామరస్యం, కరుణశీలత, దయా స్వభావం మొదలైన వాటిని ఆమె ప్రస్తావించారు. ట్రంప్‌పై కమలా హారిస్ చేసిన పోరాటంలో ఈ విలువలు ఓడిపోయాయి. వాటి పట్ల రిపబ్లికన్ పార్టీ అభ్యర్థికి కనీస గౌరవం కూడా లేదు.




అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నికల ఫలితం ఇతర దేశాలలోని ఎన్నికలను ప్రభావితం చేస్తుందా? చేయగలదు. ఎన్నికల ప్రచారంలో ఆయన ఉపయోగించిన మొరటు భాష, ప్రజలలో విభేదాలు చీలికలు సృష్టించిన వ్యాఖ్యల వైనాన్ని అనుకరించేందుకు ట్రంప్ విజయం ఇతర దేశాలలోని నాయకులను పురిగొల్పవచ్చు. ట్రంప్ ప్రచార నమూనా ఒక ఒరవడి అయితే అది ప్రజాస్వామ్యానికి ఘోర పరాజయం అవుతుంది, సందేహం లేదు.

ప్రపంచ వ్యాప్తంగా అసంఖ్యాక ప్రజలను కలవరపెడుతున్న వివిధ అంశాలు అమెరికా ఎన్నికల ప్రచారంలో కనీస ప్రాధాన్యం కూడా పొందలేదు! మధ్య ప్రాచ్యంలో ఇజ్రాయెల్ దురాగతాలకు 44 వేల మంది పాలస్తీనియన్లు హతమవడం (వీరిలో మహిళలు, బాలలే అత్యధికంగా ఉన్నారు, ఐక్యరాజ్యసమితి సిబ్బంది కూడా గణనీయమైన సంఖ్యలో ఉన్నారు), ఉక్రెయిన్ భూభాగాలను రష్యా దురాక్రమించిన విషయం పెద్దగా ప్రస్తావనకే రాలేదు. తైవాన్‌ను ఆక్రమించుకునేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలను అమెరికా ప్రజలు పూర్తిగా మరచిపోయినట్టుగా కనిపిస్తోంది అమెరికా భూభాగాలపై దాడి చేసేందుకు వీలైన ఖండాంతర క్షిపణుల ప్రయోగ పరీక్షలను ఉత్తర కొరియా విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని ఇరు పార్టీల అభ్యర్థులూ మరచిపోయినట్టున్నారు. పలు దేశాలలో అంతర్యుద్ధాలు, ప్రజాస్వామిక దేశాలుగా పిలవడబడుతున్న దేశాలలో పౌర స్వేచ్ఛల అణచివేతను అభ్యర్థులు గానీ, ఓటర్లు గానీ పట్టించుకోనే లేదు. ఈ అంతర్జాతీయ ఉపద్రవాలను అలా ఉంచితే తాము ఓటు వేస్తున్న (అంతిమంగా గెలిచిన) అభ్యర్థిని ఒక దోషిగా న్యాయస్థానం నిర్ధారించిందని, శిక్ష ఖరారు కావచ్చనే వాస్తవాన్ని కూడా అమెరికన్ ఓటర్లు పూర్తిగా విస్మరించారు.

ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు అమెరికా ఓటర్లను ఎలా ప్రభావితం చేశాయి? అమెరికాను ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశంగా రూపొందించిన స్వేచ్ఛా వాణిజ్య విధానాలు, తక్కువ సుంకాలు, గుత్తాధిపత్య వ్యతిరేక చట్టాల ఉపసంహరణ గురించి వారు ఏ మాత్రం పట్టించుకోనే లేదు. డోనాల్డ్ ట్రంప్ విజయానికి అమితంగా ఆనందపడిన కార్పొరేట్ శక్తులు చమురు, ఔషధాల తయారీ, అధునాతన సాంకేతికతలకు సంబంధించిన బహుళ జాతి కంపెనీలే సుమా!

అమెరికా ఓటర్లు అంతిమంగా తాము ముందే ఏర్పరచుకున్న ఇష్టాయిష్టాల, పాక్షికాభిప్రాయాల ప్రకారమే ఓటు వేశారు. పురుష ఓటర్లు ట్రంప్‌ను ఎక్కువగా ఇష్టపడ్డారు. యువ ఓటర్లు (18–29 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు) ట్రంప్‌నే ఎంచుకున్నారు. కార్మిక శ్రేణులకు చెందిన ఓటర్లూ ట్రంప్‌నే ఇష్టపడ్డారు. పట్టభద్రులు కాని ఓటర్లు ట్రంప్‌కే ప్రాధాన్యమిచ్చారు. లాటినో ఓటర్లు (మెక్సికన్లు, ప్యూరిటోరికన్లు, క్యూబన్లు) ట్రంప్‌నే ఎంచుకున్నారు. ఒక పచ్చి నిజాన్ని నిర్మొగమాటంగా చెప్పి తీరాలి. పైన ప్రస్తావిత ఓటర్లు అందరూ కమలా హారిస్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. కారణమేమిటి? ఆమె జెండర్, కలర్ ప్రధాన కారణం. జెండర్ రీత్యా మహిళ, వర్ణం (కలర్) రీత్యా నల్ల జాతి స్త్రీ కదా కమలా హారిస్.

ప్రపంచ ఏకైక అగ్రరాజ్యం అమెరికా. మరి ఆ దేశాధ్యక్ష పదవీ ఎన్నికల ఫలితం ఇతర దేశాలలోని ఎన్నికలను ప్రభావితం చేస్తుందా? చేయగలదు. ఎన్నికల ప్రచారంలో ఆయన ఉపయోగించిన మొరటు భాష, ప్రజలలో విభేదాలు చీలికలు సృష్టించిన వ్యాఖ్యల వైనాన్ని అనుకరించేందుకు ట్రంప్ విజయం ఇతర దేశాలలోని నాయకులను పురిగొల్పవచ్చు. ట్రంప్ ప్రచార నమూనా ఒక ఒరవడి అయితే అది ప్రజాస్వామ్యానికి ఘోర పరాజయం అవుతుంది, సందేహం లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

# సాదిక్ అంటే... నిరంతర చలనం

ఒక సంఘ సేవకుడి గురించి మాట్లాడుకుందాం. ఒక మనసున్న స్నేహితుడి గురించి మాట్లాడుకుందాం. ఒక సాహిత్య ప్రేమికుడి గురించి మాట్లాడుకుందాం. సాహిత్యానికి నాలుగు చక్రాల కాళ్ళిచ్చి తోపుడుబండి పేరిట ఊరూరా చేర్చిన కార్యకర్త గురించి మాట్లాడుకుందాం. చదువుకోవడానికి ఆర్థికసాయం అవసరమైనవాళ్ళకు నేనున్నానని అండగా నిలబడ్డ ఒక చేయూత గురించి మాట్లాడుకుందాం. ఒక జర్నలిస్ట్ గురించి ఒక ఆధునిక పెళ్లిళ్ల పేరయ్య గురించి ఒక ప్రేమికుడి గురించి హిందీ పాటల పిచ్చిలో రెండు చెవులు కోసేసుసుకున్న వ్యక్తి గురించి మాట్లాడుకుందాం. అందరినీ కన్నీళ్లలో ముంచి అర్ధాంతరంగా లోకంనుంచి నిష్క్రమించిన ఒక మనీషి గురించి మాట్లాడుకుందాం. ఇంతమంది గురించి వేర్వేరుగా కాదుగానీ ఇవన్నీ ఒక్కడే అయిన సాదిక్ గురించి మాట్లాడుకుందాం.

చాలా మందికి తోపుడుబండి సాదిక్‌గా తెలిసిన ఈ మనిషి నడిచొచ్చిన దారినిండా ముళ్ళు గోతులు చీకట్లు తప్ప మరేమీ లేవు. అసలు దారంటూ లేని నేలమీద నడిచి శిఖరాగ్రానికి చేరినవాళ్ళలో అతి తక్కువ మందిలో ఉండే నమ్రత, స్నేహగుణం సాదిక్ సొంతం.



ఉదయంలో జర్నలిస్టుగా ప్రయోగవాదం పంచన నిలిచి కార్మిక నాయకుడై ఎదురు దెబ్బలు తిని దారి మార్చి మ్యారేజ్ బ్యూరోలో తేలిన చమత్కారి 'వశిష్ఠ' సాదిక్. తను పనిచేసిన పత్రిక మూత పడితే తట్టుకోలేక మళ్ళీ తెరిస్తే కోటి రూపాయలిస్తానన్న మనసున్న మనిషి సాదిక్. మతాంతర ప్రేమలో మునిగి అదే అమ్మాయిని జీవిత భాగస్వామిగా తన కలంపేరులోనూ భాగస్వామిగా చేసుకున్న విశ్వమానవుడు ఉషా సాదిక్. 'యూనివర్సల్ మ్యారేజ్ బ్యూరో' స్థాపించడం ద్వారా వేలాదిమందికి పెళ్లి సంబంధాలు కుదిర్చారు.

పుస్తకాల పండుగలకు జవజీవాలను ఇవ్వడానికి ముచ్చటైన ప్రయత్నాలు చేసి సఫలం చేసాడు సాదిక్. పుస్తకాలబండి, తోపుడుబండి సాదిక్‌గా క్రమేణా అతని పేరు స్థిరపడేంతగా కార్యాచరణ కొనసాగింది. అతని మరణాన్ని ఎవరూ జీర్ణించుకోలేనంతగా చివరి నిమిషం వరకు కృషిచేస్తూనే ఉన్నాడు. దాతలకు ఏవో విన్నపాలు చేస్తూనే ఉన్నాడు.
పిల్లలతో కలిసి వాళ్లకు ఏవో ఇస్తూనో, భోజనాలు పెడుతూనో కనపడుతూనో ఉన్నాడు. అందుకే ఎవరూ అతను ఇప్పుడు లేడు అంటే అంగీకరించడానికి ఇష్టపడటం లేదు.

సాదిక్ తండ్రిని చిన్నతనంలోనే కోల్పోయారు. ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో డిగ్రీ వరకు చదివి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలలో చురుకుగా ఉండేవారు.

'కొందరు/లోకం ఖాళీ చేస్తే/వెలితి/వెక్కిళ్ళు పడుతుంది/చరిత్ర గర్వంగా/శాశ్వతపుట లిఖిస్తుంది' అని అతని ఆచరణ, అతని సంకల్పం, అతని సేవాతత్పరతలకు ఒక కవి ఇచ్చిన కితాబు. 'సాదిక్ గారు లేకపోవడం వో పెను విషాదం. వారిదగ్గర నుండి వో పుస్తకం, ఓ బూట్ల జత, వో స్కూలు బ్యాగు, వో చలి దుప్పటి, ఓ అన్నం ముద్ద.. ఇంకేదో ఇంకేదో అందుకున్న ఏ పిల్లవాడైనా, ఏ ఆడబిడ్డ అయినా ఎలా మర్చిపోతారు ఈ ప్రేమమూర్తిని..' అని ఒక సాహిత్యకారుడు భావించడం అంటే, ఇవాళ్టి కాలంలో ఎందరో చేద్దామనుకుంటూ తాము చేయలేకపోతున్న పనుల్ని భుజానికెత్తుకొని సాదిక్ చేశాడని నిండుమనసుతో కూడిన మెచ్చుకోలు.

పేద పిల్లలకు సాయం చేసేందుకు తోపుడుబండి ఫౌండేషన్‌ను స్థాపించారు. ఫౌండేషన్ ద్వారా విరాళాలు, వేలాదిమంది పేద పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, పాఠశాలలకు ఫర్నిచర్ సమకూర్చారు. అనాథ పిల్లలకు చేయూతనిచ్చారు.

ముఖ్యంగా యువతరాన్ని దగ్గరకు తీసుకోవడం, వాళ్ళల్లో ఒకడిగా కలిసిపోవడం, ఆ తర్వాత చిన్ని పిల్లల యోగక్షేమాలవైపుకు దృష్టి మరల్చడం, అనేక కార్యక్రమాలు చేపట్టడం సాదిక్ దీర్ఘదర్శిలా కనిపిస్తాడు.

అసలు తోపుడుబండి ప్రాథమికంగా మొదలయ్యింది కవిత్వం పాఠకులకు చేరువచేద్దామని, వాళ్ళ ద్వారా కొనుగోళ్లు చేయిద్దామని, విస్తృతంగా ప్రచారం చేద్దామని. ఆ తరవాత మొత్తం సాహిత్యం వైపు, ఆ తర్వాత పాఠశాలలవైపు, పిల్లల అవసరాల వైపునకు మళ్ళి విస్తృతమై అదొక ఫౌండేషన్‌లా రూపుదిద్దుకుంది. బుక్ ఫెయిర్‌లలోకి ప్రవేశించి అక్కడికి వచ్చిన సందర్శకుల చేతిలో పుస్తకాలు ఉంచి సెల్ఫీలు దించి, సోషల్ మీడియాను పుస్తకప్రపంచంగా మార్చిన సాదిక్ సమాజాన్ని పుస్తకాలవైపునకు ఎన్ని రకాలుగా ఆకర్షించాలో ఆలోచించి ఆచరించి చూపాడు. తోపుడుబండి మీద వంద రోజుల్లో వెయ్యి కిలోమీటర్లు తిరిగి పుస్తకాలను పంచిపెట్టాడు. కొంతమంది స్నేహితులు పుస్తకాలు కొనేందుకు సహకరించాడు.

పుస్తకాల పండుగలకు జవజీవాలను ఇవ్వడానికి ముచ్చటైన ప్రయత్నాలు చేసి సఫలం చేసాడు. పుస్తకాలబండి, తోపుడుబండి సాదిక్‌గా క్రమేణా అతని పేరు స్థిరపడేంతగా కార్యాచరణ కొనసాగింది. అతని మరణాన్ని ఎవరూ జీర్ణించుకోలేనంతగా చివరి నిమిషం వరకు కృషిచేస్తూనే ఉన్నాడు. దాతలకు ఏవో విన్నపాలు చేస్తూనే ఉన్నాడు. పిల్లలతో కలిసి వాళ్లకు ఏవో ఇస్తూనో, భోజనాలు పెడుతూనో కనపడుతూనో ఉన్నాడు. అందుకే ఎవరూ అతను ఇప్పుడు లేడు అంటే అంగీకరించడానికి ఇష్టపడటం లేదు.

కల్లూరు మండలంలోని దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కావలసిన వస్తువులను దాతలనుంచి సేకరించి అందించేవాడు. ఇందుకోసం కొన్నాళ్లుగా కల్లూరులోనే స్థిరపడ్డారు. కొవిడ్ సమయంలో పేద విద్యార్థులకు సెల్‌ఫోన్లను ఉచితంగా అందించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడ్డారు. చనిపోవడానికి ముందురోజు కూడా 200 మంది బాలబాలికలకు షూస్ ఇచ్చారు, తన మానవీయ సేవలతో అందరి మన్ననలు పొందారు సాదిక్.

ఇటువంటివాళ్లను మరణంతో కలిపి ఊహించుకోలేం అన్నది ప్రతి ఒక్కరి గుండె లోతుల్లోంచి వచ్చే మాట.. అదీ అతనికి జనంతో ఉన్న మమేకత. ఆచరణలోని స్వచ్ఛత, పారదర్శకత.

సాదిక్ భార్య ఉషగారు వ్యవసాయ శాఖలో జాయింట్ డైరెక్టర్. సాదిక్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లోనూ ఆమె భాగస్వామి. ఆయన సేవలను ఆమె కొనసాగిస్తారు. నవంబర్ ఏడున అతను ఈ లోకాన్ని వీడిపోయారని, ఆయన లేరు అనేది అబద్ధం. ఆయన ఉనికి అందరి గుండెల్లో శాశ్వతం అన్నదే నిజం.

● కవి యాకూబ్

## రంగవల్లి విజ్ఞానకేంద్రం ప్రారంభోత్సవం

సమసమాజ నిర్మాణ దార్శనికురాలిగా, కమ్యూనిస్టుగా తెలుగునేలకు పరిచయమైన త్యాగధనుల్లో రంగవల్లి ఒకరు. నిజామాబాద్ జిల్లాలో 1959లో బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎల్. నరసింహారావు–గిరిజ దంపతులకు జన్మించింది ఆమె. పీడీఎస్‌యు నాయకురాలిగా, విజృంభణ పత్రిక సంపాదకత్వ బాధ్యురాలిగా, స్త్రీ విముక్తి ఉద్యమ నిర్దేశకురాలిగా, పల్నాడు రైతాంగ ఉద్యమ కార్యకర్తగా, వివిధ భూపోరాటాలకు నాయకత్వం వహించిన వీరవనితగా, గోదావరిలోయ ఉద్యమ రాజకీయ బాధ్యురాలిగా రెండు దశాబ్దాల తన విప్లవ జీవితాన్ని విలువలతో కొనసాగించింది. సీపీఐ (ఎం–ఎల్) జనశక్తి రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఉంటూ ములుగు జిల్లా జగ్గన్నగూడెం అడవుల్లో జరిగిన పోలీసు దాడిలో నవంబరు 11, 1999న నేలరాలిపోయింది. పాతిక సంవత్సరాలు గడిచినా చెరిగిపోని ఆమె స్మృతులను ఎత్తిపడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నంది కమాన్ వద్ద రంగవల్లి విజ్ఞాన కేంద్రం రూపుదిద్దుకుంది. రంగవల్లి 25వ వర్ధంతి సందర్భంగా నవంబరు 11వ తేదీ సోమవారం ఉదయం పది గంటలకు రంగవల్లి విజ్ఞానకేంద్రం ప్రారంభోత్సవం జరుగుతుంది. హక్కుల కార్యకర్త, న్యాయవాది లక్ష్మీదేవి గ్రంథాలయ ప్రారంభకులు. అమరుల స్మృతిగీతాన్ని లత ఆవిష్కరిస్తారు. ఆచార్య కట్టా భగవంతరెడ్డి, ప్రొఫెసర్ కాశీం స్మారకోపన్యాసాలు చేస్తారు. తదనంతరం అరుణోదయ విమలక్క అధ్యక్షతన జరిగే విజ్ఞానకేంద్రం ప్రారంభోత్సవ సభలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు తమ సందేశాలు అందిస్తారు.

– నిర్వాహకులు,
రంగవల్లి విజ్ఞానకేంద్రం

# 'నమామి గంగే'ను చూసి నేర్చుకోండి!



నదుల చుట్టూ నాగరికత పరిఢవిల్లిందనేది చారిత్రక సత్యం. ప్రపంచ వ్యాప్తంగా నదులు, సముద్రాలు, పెద్ద పెద్ద నీటివనరులున్నచోటే జనజీవనం కొనసాగింది. భారతదేశంలోనూ.. గంగ, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, నర్మద మొదలైన నదీతీరాల్లోనే ఎన్నో పట్టణాలు, నగరాలు, ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలు, దేవాలయాలు వెలిశాయి. నేటికీ కొనసాగుతున్నాయి. అంతటి ప్రాశస్త్యం ఉన్నటువంటి నదీతీరాలను, నీటివనరులను కాపాడుకోవడం మనందరి బాధ్యత. వెయ్యిమైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతో మొదలైనట్లు.. నదులను కాపాడుకోవటం, వాటి పునరుజ్జీవనానికి పని చేయడం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'సబర్మతీ రివర్‌ఫ్రంట్' ప్రాజెక్టు నిర్మాణంతో.. 2005లోనే తొలి అడుగు వేశారు.

2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు.. బీజేపీ నుంచి ప్రధానమంత్రి అభ్యర్థి హోదాలో నరేంద్రమోదీ గంగానది తీరంలో అనేకవేల సంవత్సరాల క్రితం వెలసిన ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన, పరమపవిత్ర వారణాసి నగరం నుంచి లోక్‌సభ సభ్యుడిగా నామినేషన్ వేస్తున్న సందర్భంగా మాట్లాడుతూ.. 'గంగమ్మతల్లి నన్ను పిలిచింది' అని పేర్కొన్నారు. ఆ తర్వాత వారి నేతృత్వంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడింది. అనంతరం గంగానదిని, దాని ఉపనదులను ప్రక్షాళన చేయడం, వాటిని పునరుజ్జీవనం లక్ష్యంగా 'నమామి గంగే' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గంగానది పరిరక్షణ కోసం మార్చి 2021 వరకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. గంగానది పరిరక్షణ, గంగానది ప్రక్షాళన మొదట నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంతో.. మార్చి 2026 వరకు జరగాల్సిన రెండో విడత పనులకు శ్రీకారం చుట్టారు.

'నమామి గంగే' కార్యక్రమం అమలుపై మోదీ గారు ప్రత్యేకమైన దృష్టి సారించారు. దీన్ని ఓ యజ్ఞంగా ముందుకు తీసుకెళ్లారు. గంగానదికి పూర్వవైభవాన్ని కల్పించేందుకు సంపూర్ణమైన, సమగ్రమైన విధానాన్ని నిర్దేశించారు. గంగానదిలో పేరుకుపోయిన చెత్తను, మురికిని తొలగించడంతోపాటుగా.. గంగతోపాటుగా దాని ఉపనదులు ప్రవహిస్తున్న 5 రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో.. అక్కడ మురికినీటి నిర్వహణ, చెత్త నిర్వహణ, ఘాట్ల సుందరీకరణ, మొక్కలు నాటడం, అటవీకరణ, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడం వంటి వాటిపై సానుకూలమైన ప్రగతి సాధించారు. ప్రభుత్వ చిత్తశుద్ధి, పాలకుల అంకితభావం, ప్రధాని మోదీ చొరవ, ప్రజల భాగస్వామ్యం, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల సహకారంతోనే ఇది సాధ్యమైంది.


జూన్ 2024 వరకు గంగానది పరివాహక ప్రాంతంలో రూ.39,080.70 కోట్ల అంచనాతో మొత్తం 467 ప్రాజెక్టులు చేపట్టగా.. ఇందులో 292 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఈ మొత్తం ప్రాజెక్టుల్లో 200కు పైగా గంగానదిలోకి వస్తున్న వ్యర్థాల నిర్వహణకోసం ఉద్దేశించిన ప్రాజెక్టులే.

గంగానది పరివాహకంలోని 5 రాష్ట్రాల్లో మొత్తం 97 నగరాలున్నాయి. అందుకోసం వీటన్నింటికీ కలిపి, సంయుక్తంగా.. అర్బన్ రివర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ (URMP) తీసుకొచ్చారు. దీని ద్వారా ఈ నగరాల్లో పైన పేర్కొన్న ప్లానింగ్, అమలులో ఏకరూపత సాధ్యమైంది.

గంగానది పునరుజ్జీవన ప్రాజెక్టుకు స్ఫూర్తి.. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన సబర్మతి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు. 2005లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు కార్యాచరణ.. విడతల వారిగా కొనసాగుతోంది. గుజరాత్ రాజధాని మీదుగా ప్రవహించే సబర్మతి నది అభివృద్ధికి.. ప్రణాళికాబద్ధంగా కరకట్టల నిర్మాణం, సీవరేజ్ ప్లాంట్లు, కారిడార్లు, పార్కులు, క్రీడా సౌకర్యాల నిర్మాణం చేపట్టారు. సుందరీకరణ, వ్యర్థాల నిర్వహణ, వరదలనుంచి సంరక్షణ, నది నీటిని సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలన్నింటిపైనా ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఇందుకోసం మొదట్లో రూ.1400 కోట్లు ఖర్చుచేయగా.. ఆ తర్వాత 2020లో మరో రూ.850 కోట్ల విలువైన పనులకు ఆమోదం లభించింది.

ఈనాడు ప్రపంచంలోనే అతితక్కువ ఖర్చుతో అత్యంత అద్భుతంగా, అనేక దేశాలకు ఆదర్శంగా 'సబర్మతి రివర్‌ఫ్రంట్'ను చూడటానికి దేశ, విదేశీ ప్రతినిధులు ప్రతిరోజూ సందర్శనకు వస్తున్నారు. 2016 డిసెంబర్ 11న చేపట్టిన 'నర్మద సేవ్ మిషన్' కూడా నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేసే దిశగా విజయవంతంగా కొనసాగుతోంది.

మన కళ్లముందే సబర్మతి, గంగానది వంటి విజయగాథలుండగా.. వీటిని అధ్యయనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదు? గంగానది ప్రక్షాళనకు రూ.42వేల కోట్లు, సబర్మతి సుందరీకరణకు రూ.2,250 కోట్లు కేటాయించగా మూసీ ప్రక్షాళనకు ఎలాంటి ప్రణాళికల్లేకుండానే లక్షన్నరకోట్లు ఖర్చుచేస్తామని చెప్పడం ఎంతవరకు అర్థవంతమో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పగలరా?



నదుల సుందరీకరణ, పునరుజ్జీవనం విషయంలో ప్రణాళికాబద్ధంగా పనిచేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా, అవసరమైన మేరకు సద్వినియోగం చేసుకోవడం, ప్రజల సహాయ, సహకారాలతో ముందడుగేయడం చాలా కీలకం. కానీ దురదృష్టవశాత్తూ మూసీ సుందరీకరణ విషయంలో ఇవేవీ జరగడం లేదు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు, అధికారుల బృందమొకటి ఇటీవల దక్షిణ కొరియాలో పర్యటించి.. అక్కడి 'హాన్ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు' తరహాలో మూసీ అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. ముఖ్యమంత్రి లండన్‌లో పర్యటించి 'థేమ్స్' నది తరహాలో మూసీ పురోగతి ఉంటుందని ప్రకటించారు. ఎవరికి వారు తోచిన ప్రకటనలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు.

మన దేశంలోనే.. మన కళ్లముందే సబర్మతి, గంగానది వంటి విజయగాథలుండగా.. వీటిని అధ్యయనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఆలోచించడం లేదు. ఏం చేద్దాం? ఎలా చేద్దాం? ఏ విధంగా ముందుకెళ్దాం? వంటి ప్రాథమిక అంశాలపై దృష్టిపెట్టకుండా.. విదేశీ పర్యటనలు, అక్కడి నదుల ప్రాజెక్టుల స్టడీ టూర్లు చేపట్టడం.. ఏకంగా లక్షన్నరకోట్ల బడ్జెట్ అని చెప్పి.. ఏదో జరిగిపోతోందనే భ్రమలు కల్పించే ప్రయత్నం మాత్రమే జరుగుతోంది.

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు బేసిక్ ప్లానింగ్ లేకుండానే.. దశాబ్దాలుగా మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలను భయపెట్టి వారిని ఖాళీ చేయించేందుకు దుర్మార్గమైన ప్రయత్నం జరుగుతోంది. వీలైనంత త్వరగా వీరిని ఇక్కడి నుంచి పంపించాలని కుట్ర చేస్తున్నారు. వారందరిపై మూసీ ఆక్రమణదారులుగా ముద్ర వేస్తూ.. భయాందోళనలకు గురిచేస్తున్నారు. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే.. పైనున్న ఉదాహరణలను అధ్యయనం చేసి, తదనుగుణంగా నిధుల సమీకరణ చేసి, మూసీలో కలిసే డ్రైనేజీ, ఇతర వ్యర్థాల నిర్వహణపై దృష్టిపెట్టి, ప్రజల భాగస్వామ్యంతో ముందుకెళ్లాలి తప్ప.. గందరగోళమైన ప్రకటనలతో ప్రజల్లో ఆందోళనలు సృష్టించాలనుకునే ఆలోచనలు సరికాదు. గంగానది ప్రక్షాళనకు.. 42వేల కోట్లు కేటాయింపు, సబర్మతి సుందరీకరణకు రూ.2,250 కోట్లు కేటాయించిన సందర్భంలో.. మూసీ ప్రక్షాళనకు ఎలాంటి ప్రణాళికల్లేకుండానే లక్షన్నరకోట్లు.. ఖర్చుచేస్తామని చెప్పడం ఎంతవరకు అర్థవంతమో సీఎం సమాధానం చెప్పాలి.

మూసీ ఒడ్డుపై ఉన్న వేలాది పేదలు 40–50 ఏళ్ల క్రితం నిర్మించుకుని నివాసం ఉంటున్న ఇండ్లను కూల్చేయడం, హైకోర్టు, సిటీ కాలేజ్ మొదలైన ప్రతిష్ఠాత్మక సంస్థలను నగర శివార్లకు తరలించి.. ఈ చారిత్రక భవనాలను కూల్చేయాలన్న కుట్ర అత్యంత దుర్మార్గమైనది. విలువైన ఈ భూములపై కన్నేసే.. కాంగ్రెస్ ప్రభుత్వం 'మూసీ ప్రాజెక్టు' తెరపైకి తెచ్చిందనే విమర్శలు మొదలయ్యాయి. ఇదే నిజమైతే తీవ్ర ఆక్షేపణీయం. ఏ ప్రాజెక్టు అయినా, ఏ పథకమైనా, ఏ కార్యక్రమమైనా ఒక సమగ్రమైన కార్యాచరణ లేకుండా పనిచేస్తూ.. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడాన్ని బీజేపీ ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించదు.

ఇక్కడ ఓ ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేసుకోవాలి. 2021లో.. దేశవ్యాప్తంగా నదుల ఒడ్డున ఉన్న నగరాలన్నీ కలిసి రివర్ సిటీస్ అలయెన్స్ (RCA) ఏర్పాటైంది. ఇందులో మూసీ ఒడ్డున ఉన్న హైదరాబాద్ కూడా ఒకటి. ప్రారంభంలో రిషికేష్, హరిద్వార్, వారణాసి, ప్రయాగ్‌రాజ్, మథుర, అయోధ్య, చెన్నై, హైదరాబాద్, విజయవాడ వంటి దాదాపు 30 నగరాలతో ఈ కూటమి ఏర్పడింది. తర్వాత ఇతర నగరాలు కూడా ఇందులో చేరాయి. పట్టణ నదుల సుస్థిర నిర్వహణ, వివిధ పరిశోధనలు – అధ్యయనాలు – ఉత్తమ పనితీరు పద్ధతుల మార్పిడి మొదలైన అంశాలను చర్చించడం, వాటిని అమలు చేయడం ఈ కూటమి ఏర్పాటు వెనక ప్రధాన లక్ష్యం.

ఇది ఆయా రాష్ట్రాల్లో సత్ఫలితాలను సాధించడంతో.. ప్రధానమంత్రి మోదీ గారి ఆలోచనకు అనుగుణంగా.. భారత్ చొరవతో అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ రివర్ సిటీస్ అలయెన్స్ (GRCA) ఏర్పాటైంది. COP28 (Conference of Parties on Climate Change) సమావేశాల్లో ప్రధాని మోదీ కృషితో.. భారత జలవనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ GRCA రూపుదిద్దుకుంది. దీని ద్వారా అంతర్జాతీయంగా నదీతీరాన ఉన్న వివిధ నగరాలు అవలంబిస్తున్న విధానాలు అనేక నగరాల అభివృద్ధికి కూడా దోహదపడతాయి.

2019లో నేషనల్ గంగా కౌన్సిల్ మీటింగ్ సందర్భంగా.. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'నదుల ఒడ్డున ఉన్న నగరాలు నదీకేంద్రిత (river centric) ఆలోచన, కార్యాచరణతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. URMP (Urban River Management Plan)ని మరింత బలోపేతం చేస్తూ అర్బన్ ప్లానింగ్ ప్రక్రియలో నదుల శుద్ధీకరణపై దృష్టి పెట్టాలి. నదుల పునరుజ్జీవన బాధ్యత ఆయా నగరాలదే. నదుల పునరుజ్జీవన అనేకాకుండా.. ఓ అభివృద్ధి కార్యక్రమంగా చూడాలి' అని పేర్కొన్నారు.

మూసీ నదిలో వ్యర్థాలు కలవకుండా.. మురుగునీటి నిర్వహణ, వ్యర్థాల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. కానీ.. ఇలాంటి ప్రయత్నాలేమీ ప్రారంభించకుండానే.. పేదల ఇండ్లను కూల్చాలనే ప్రయత్నం విమర్శలకు దారితీస్తోంది. కావున పేదల ఇళ్లను కూల్చకుండా ప్రభుత్వం పునరాలోచించి అందరికీ ఆమోదయోగ్యమైన, నిధుల దుర్వినియోగానికి అవకాశం ఇవ్వకుండా సమగ్ర విధానంతో ముందుకెళ్తే అందరి సహకారం అందుతుంది. పేదల కోసం, మరోపక్క మూసీ ప్రక్షాళన కోసం పూర్తి అంకితభావంతో అందరూ సహకరిస్తారనడంలో ఎలాంటి అనుమానం ఉండదు.

■ జి.కిషన్ రెడ్డి
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
శనివారం 9 నవంబరు 2024


# పల్లెలకు ఎన్నికల కళ!

## గ్రామ పంచాయతీల్లో మొదలైన సందడి

- మంత్రి పొంగులేటి ప్రకటనతో ఆశావహుల్లో జోష్
- సంక్రాంతికి జీపీలకు ఏర్పాటు కానున్న కొత్త పాలకవర్గం
- ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారుపై ఉత్కంఠ
- అభిప్రాయ సేకరణ చేస్తున్న బీసీ కమిషన్
- మరోవైపు కులగణనపై అధికారుల ఇంటింటి సర్వే
- ఇప్పటికే సిద్ధమైన గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా
- గత ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెలు
- ఉమ్మడి జిల్లాలో 1,705 గ్రామ పంచాయతీలు.. 15,046 వార్డులు




పల్లెల్లో సర్పంచ్ ఎన్నికల సందడి షురువైంది. సంక్రాంతి పండుగకు గ్రామ పంచాయతీలకు కొత్త సర్పంచులు వస్తారని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటన ఆశావహుల్లో జోష్ నింపింది. ఇన్నాళ్లూ సర్పంచ్‌గా చేసిన వాళ్లు, కొత్తగా బరిలో దిగాలనుకున్న వాళ్లు స్థానిక సమరానికి సమాయత్తమవుతున్నారు. ఇప్పటి నుంచే 'అన్న.. అక్క.. తమ్మీ.. చెల్లీ.. అవ్వ..' అంటూ పలకరింపులు ప్రారంభించారు. కులాల వారీగా, వర్గాల వారిగా సమీకరణాలు చేస్తున్నారు. ఆర్థిక, అంగ బలాలను సిద్ధం చేసుకుంటున్నారు. అయితే రిజర్వేషన్ల అంశమే ఆశావహుల్లో గుబులు రేపుతోంది. శనివారం నుంచి ప్రారంభమయ్యే సమగ్ర కుటుంబ సర్వేలో నమోదయ్యే కులాలతో పాటు ఇప్పటికే నియమింపబడ్డ బీసీ కమిషన్ సేకరించిన నివేదికను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోనుంది. దీంతో పంచాయతీల్లో రిజర్వేషన్లు మారనున్నాయి. ఇదిలా వుండగా, అధికారులు మాత్రం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల్లో ఓటరు జాబితాను సిద్ధం చేశారు. ఎన్నికలకు నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా, కాంగ్రెస్‌లో టికెట్ కోసం ఆశావహుల పోటీ ఎక్కువగానే ఉంటోంది. పదేళ్ల తర్వాత అధికారంలోకి రావడంతో సర్పంచ్‌గిరీపై ఎక్కువమంది కన్నేశారు. అదేస్థాయిలో ప్రతిపక్షా పార్టీ నేతలు కూడా సిద్ధమవుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

6

# గల గలా 'భద్రకాళి'

## ప్రారంభమైన చెరువు నీరు తరలింపు ప్రక్రియ

- తొలిరోజు 50 క్యూసెక్కుల నీరు ఖాళీ
- మరో 20 రోజుల్లో చెరువు నీరు మొత్తం తరలింపు
- చేపలు నష్టపోతామని మత్స్యకారుల ఆందోళన
- ఆదుకుంటామని హామీ ఇచ్చిన అధికారులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువు పూడికతీత పనులకు బీజం పడింది. శుక్రవారం సాయంత్రం నీటిపారుదలశాఖ, మత్స్యశాఖ, కుడా, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో చెరువు నుంచి మత్తడి కింది ప్రాంతాలకు నీటి తరలింపు ప్రక్రియను ప్రారంభించారు. ఇరిగేషన్ డీఈఈ హర్షవర్ధన్‌రెడ్డితో పాటు సుమారు 10మంది అధికారులు సాయంత్రం 4గంటల నుంచి భద్రకాళి చెరువు నుంచి నీటిని తరలింపును పర్యవేక్షిస్తున్నారు. జేసీబీ సహాయంతో కాపువాడ ప్రాంతంలో ఉన్న భద్రకాళి చెరువు మత్తడిని మీటరు వెడల్పు, ఫీటు ఎత్తును తగ్గించారు. దీంతో నీరు కాల్వ ద్వారా ఉధృతంగా బయటకు ప్రవహిస్తోంది. తొలి రోజు శుక్రవారం భద్రకాళి చెరువు నుంచి 50 క్యూసెక్కుల నీటిని ఖాళీ చేయించినట్లు నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. 385 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో సుమారు 300 ఎకరాల్లో రెండు మీటర్ల లోతు వరకు పూడితతీత పనులు జరుగుతాయని అధికారులు చెప్పారు. శనివారం నుంచి క్రమక్రమంగా మత్తడిని తగ్గిస్తూ రోజుకు 200 నుంచి 300 క్యూసెక్కుల నీటిని ఖాళీ చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు చెరువులో 130 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీరు చెరువులో ఉన్నట్టు చెప్పారు. చెరువు నుంచి బయటకు ప్రవహించే నీరు కాపువాడ, అలంకార్ పెద్దమోరీ, కాకతీయ కాలనీ, పెద్దమ్మగడ్డ, అక్షరకాలనీ మీదుగా హసన్‌పర్తి మండలం నాగారం పెద్దచెరువులోకి పంపిస్తామన్నారు. అక్కడ కూడా నీరు ఎక్కువ మోస్తారులో నిలువ ఉంటే రెడ్డిపురం, వంగపహాడ్, సిద్ధాపురం, అర్వపెల్లి, భైరాన్‌పల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాలతో పాటు భద్రకాళి చెరువు కింద ఉన్న చిన్న చిన్న కుంటలలో నీటిని నింపుతామని వెల్లడించారు. అయితే మత్స్యకారుల సమస్యలను స్వీకరించి శుక్రవారం తొలిరోజు తక్కువ విస్తీర్ణంతో చెరువు కట్టను తొలగించామని, తర్వాత మత్తడి తొలగింపు విస్తరించి పనులు త్వరితగతిన జరిగే విధంగా చేస్తామని అధికారులు తెలిపారు.



భద్రకాళి చెరువు మత్తడికి గండిపెట్టి నీటిని తరలిస్తున్న ఇరిగేషన్ అధికారులు



భద్రకాళి చెరువులో నీటిని వదలవద్దని నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

### మత్స్యకారుల ఆందోళన

తమకు సమాచారం ఇవ్వకుండా భద్రకాళి చెరువు నుంచి నీటిని తరలించడం ఏమిటని మచిలీబజార్, గుడిబండల్, పాపయ్యపేట, రామన్నపేట ప్రాంతాలకు చెందిన మత్స్యకార సొసైటీ మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. భద్రకాళి చెరువు వద్దకు చేరుకుని తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నీటిని తరలించడం ఎంత వరకు న్యాయం అని అధికారులను నిలదీశారు. మత్తడి వద్ద పనులు చేసేందుకు తీసుకువచ్చిన జేసీబీని అడ్డుకుని అక్కడి నుంచి వెనక్కి పంపించారు. వందల ఏళ్లుగా భద్రకాళి చెరువు ద్వారా తమ కులవృత్తిని నమ్ముకుని చేపలు పెంచుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని, చెరువు నుంచి చేపలు తరలిపోతే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని సంఘం అధ్యక్షుడు తత్తరి సారంగపాణి, ప్రధాన కార్యదర్శి బయ్య శోభన్‌బాబు, నాయకులు రాజు, చుక్కయ్య, రవీందర్, పులి రజినీకాంత్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో ఇప్పటి వరకు రూ.2కోట్ల విలువ చేసే చేపలు ఉన్నాయని, తమకు ప్రత్యామ్నాయ మార్గం చూపిన తర్వాత చెరువు నుంచి నీటిని తరలించాలని అధికారులను అడ్డుకున్నారు. ప్రభుత్వ అధికారుల తీరుపై నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. 450 కుటుంబాలు చెరువు మీద ఆధారపడ్డి బతుకుతున్నామని అన్నారు. దీంతో అక్కడ కొంతసేపు గందరగోళం ఏర్పడడంతో హనుమకొండ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నీటిపారుదల, మత్స్య శాఖ, బల్దియా, కుడా అధికారులు కలుగజేసుకుని మత్స్యకారులకు ఆర్థికపరమైన నష్టం జరుగకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆరు మాసాల్లో పనులు పూర్తి చేసి చెరువులోకి మురుగు నీరు రాకుండా మంచి నీరును నింపి జలకళ వచ్చే విధంగా చూస్తామన్నారు. మత్తడి ప్రాంతంలో త్వరలో ఇనుప గ్రిల్స్‌తో కూడిన జాలీ ఏర్పాటు చేస్తామన్నారు. జాలీ ఏర్పాటు చేసే వరకు నీటి ఉధృత్తి తక్కువగా ఉంటుందని, అప్పటి వరకు చేపలు తరలిపోకుండా వలలు అడ్డంగా కట్టుకోవాలని మత్స్యకారులను ఆదేశించారు.



టెక్నోజియాన్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌వీ చౌదరి

# టెక్నోజియాన్ షురూ..

## నిట్‌లో సందడిగా ప్రారంభమైన సాంకేతిక ఉత్సవం

- పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు
- నేటి నుంచి ఈవెంట్లు ప్రారంభం
- అందంగా ముస్తాబైన క్యాంపస్
- తలపించనున్న మినీ భారతం



విద్యార్థుల సరికొత్త ఆవిష్కరణలకు వేదికైన టెక్నోజియాన్‌కు వరంగల్ నిట్ కళాశాల ముస్తాబైంది. ఈ మేరకు శుక్రవారం టెక్నోజియాన్‌కు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-ఐఐసిటి విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌వీ చౌదరి హాజరయ్యారు. ఈ సాంకేతిక పండుగలో 50 ఈవెంట్లను నిర్వహించనున్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందచేస్తారు. అయితే ఈ సారి వేడుకలను రెండు రోజులే జరుపుతారు. అలాగే సాయంత్రం వేళ ఏర్పాటు చేసే సాంస్కృతిక ప్రదర్శనలను రద్దు చేశారు.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

8 లో..

# ప్యాచ్‌వర్క్ పనులను వెంటనే పూర్తి చేయండి

- కుడా వైస్‌చైర్మన్ అశ్విని తానాజీ వాకడే
- కాళోజీ కళాక్షేత్రంలో పనుల పరిశీలన



కాళోజీ కళాక్షేత్రంలో పనులను పరిశీలిస్తున్న అశ్విని

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాళోజీ కళా క్షేత్రంలో మిగిలిపోయిన ప్యాచ్‌వర్క్ పనులను వెంటనే పూర్తి చేయాలని కుడా వైస్ చైర్‌పర్సన్, బల్దియా కమిషనర్ అశ్విని తా నాజీ వాకడే అధికారులకు సూచించారు. శుక్రవారం బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం పనులను కుడా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెండింగ్ పనుల పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. కళాక్షేత్రంలో గ్రినరీ ఎక్కువగా పెంచేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. పనులు పూర్తయిన తర్వాత మిగిలి పోయిన మట్టిని, చెత్తను వెంటనే అక్కడి నుంచి బయటకు తరలించాలని చెప్పారు. కళాక్షేత్రంలోని అన్ని ఫ్లోర్లను శుభ్రంగా ఉంచాలన్నారు. వైస్‌చైర్‌పర్సన్ వెంట కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ భీంరావు, ఏఈలు శ్రీకాంత్, సతీష్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

# కలెక్టరేట్ ప్రజావాణి రద్దు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 8: హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం పాల్గొంటున్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

# భూమి కోల్పోతున్న రైతులు అధైర్యపడొద్దు..

- ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సహకరించాలి..
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులు అధైర్యపడవద్దని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో బాధిత రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మామునూరులో ఏర్పాటు కానున్న ఎయిర్‌పోర్టుకు రైతులు సహకరించాలన్నారు. సంబంధిత రైతుల అభిప్రాయాలు తీసుకున్నాకే చర్యలు చేపడతామన్నారు. గుంటూరుపల్లి, గాడిపల్లి, నక్కలపల్లి గ్రామాల రైతులు భూమి కోల్పోతున్నారని, వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు సేకరించి నివేదిక సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో విజయలక్ష్మి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ మధుసూదన్‌రెడ్డి, ఏడీ సర్వే ల్యాండ్ అధికారి దేవరాజ్, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

## రైతులకు నష్టం జరగొద్దు

వరి కోతల సమయంలో రైతులకు నష్టం జరగకుండా వరికోత యంత్రాల యజమానులు, డ్రైవర్లు జాగ్రత్త వహించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వరికోత యంత్రాల యజమానుల తో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మడులు ఎండిపోయాకే వరికోతలు చేపట్టాలని సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ అధికారులు మండలాల వారీ గా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి వరి పంటలు కోతకు ఎప్పుడు వస్తాయన్న విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రవీందర్, డీఆర్‌వో విజయలక్ష్మి, ఆర్డీవో జి.లక్ష్మి, సివిల్ సప్లయీస్ డీఎం సంధ్యారాణి, డీసీఎస్‌వో కిష్టయ్య, డీఎం వో సురేఖ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

## వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జీలు రమేష్‌బాబు, నిర్మలా గీతాంబ




సమావేశంలో మాట్లాడుతున్న జడ్జీలు రమేష్ బాబు, నిర్మలా గీతాంబ

వరంగల్ లీగల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): న్యాయసేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జీలు రమేష్‌బాబు, నిర్మలా గీతాంబ కోరారు. శుక్రవారం న్యాయసేవా సదన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. శనివారం న్యాయసేవాధికార సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా హైకోర్టు జడ్జీలు జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ మౌషమీ భట్టాచార్య, న్యాయసేవా సంస్థ మెంబర్ సెక్రటరీ పంచాక్షరి హాజరవుతున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, న్యాయవాదులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా లబ్ధిదారులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఈసదస్సులో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా జడ్జీలు కోరారు.



గంజాయి రవాణాదారుల వివరాలు తెలుపుతున్న జీఆర్‌పీ సీఐ సురేందర్

## 48 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

గిర్మాజీపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒడిషా నుంచి గుజరాత్‌కు ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలను శుక్రవారం వరంగల్ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 12 లక్షల రుపాయల విలువైన 48 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపిన ప్రకారం.. ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన బాబిత కుమారి పాణిగ్రాహి(35), సంజుక్త బెహరా (36) అనే ఇద్దరు మహిళలు బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇచ్ఛాపురంలో గంజాయి కొనుగోలు చేసి ప్లాస్టిక్ బుట్టలు, ప్లాస్టిక్ సంచులలో పెట్టుకుని నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో గురువారం సాయంత్రం వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం గుజరాత్ వెళ్లేందుకు రైలు కోసం ఎదురుచూస్తుండగా జీఆర్‌పీ పోలీసులు వారిని అనుమానించి బుట్టలు తనిఖీచేయగా ఎండు గంజాయి దొరికింది. వెంటనే వారిని అరెస్ట్ చేసి కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపరిచారు. తనిఖీ చేసినవారిలో ఎస్సై మోహినుద్దీన్, సిబ్బంది పి.రాజు, ఎం.నాగరాజు, కె.ప్రశాంతి, సి.హెచ్.సుమలత, ఆర్‌పీఎఫ్ ఎస్సై జి.వెంకటేశ్వర్లు, సిబ్బంది ఎస్.సారయ్య, ఎం.గురువయ్య, ఎస్.రాజు ఉన్నారు.

## నేడు రెండో శనివారం సెలవు లేదు..

కేయూ క్యాంపస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు ఇతర అనుబంధ కళాశాలలకు నవంబరు 9న రెండో శనివారం పనిదినంగా పాటించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత అక్టోబరు 10న బతుకమ్మ ఫెస్టివల్ సందర్భంగా వర్సిటీకి సెలవు ప్రకటించిన నేపథ్యంలో రెండో శనివారాన్ని పనిదినంగా పాటిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని కళాశాలన్ని యాథవిధిగా పనిచేస్తాయని విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని పేర్కొన్నారు.

## 11న బాలగోపాల్ స్మారక ఉపన్యాసం

కేయూ క్యాంపస్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల నేత డాక్టర్ కె.బాలగోపాల్ 14వ స్మారక ఉపన్యాసం నవంబరు 11న ఉదయం 11 గంటలకు వర్సిటీ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నంకు చెందిన ప్రముఖ న్యాయవాది జహ ఆరా స్త్రీల హక్కులు న్యాయ వ్యవస్థ యొక్కపాత్ర అనేఅంశంపై బాల గోపాల్ స్మారక ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనలని కోరారు.

## కేయూ ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్‌గా షమిత

కేయూ క్యాంపస్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ జి.షమిత నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు కేయూ ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్‌గా కొనసాగిన కామర్స్ విభాగం ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహచారి నుంచి షమిత బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా షమిత తన నియామకపు ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా షమితను వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాజీపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కె.వెంకటరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట - కోమటిపల్లి రైల్వే ట్రాక్ మధ్య శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు, ఎత్తు 5.5, ఆకుపచ్చ రంగు షర్ట్, చెక్స్ లుంగి ధరించి ఉన్నాడు. ఎరుపు రంగు, పొడవైన ముఖం, గడ్డం ఉంది. మృతుడు మతిస్థిమితం లేకుండా రైలు పట్టాల వెంటనడుస్తూ ఉండేవారని తెలుస్తోంది. మృతుడి వద్ద గుర్తించడానికి ఎలాంటి గుర్తింపు కార్డులేవు. ముఖం గుర్తుపట్టకుండా గాయాలయ్యాయి. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసకుని ఎంజీఎంలో భద్రపరచామని ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్ ఫోన్‌నెంబరు 87125 68496లో సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.



# పల్లెలకు ఎన్నికల కళ


- గ్రామ పంచాయతీల్లో మొదలైన ఎన్నికల సందడి
- మంత్రి పొంగులేటి ప్రకటనతో ఆశావహుల్లో జోష్
- ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారుపై ఉత్కంఠ
- ఇప్పటికే సిద్ధమైన గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పల్లెల్లో స్థానిక సందడి మొదలైంది. ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా పోటీలో ఉండేందుకు ఆశావహులు సన్నద్ధమవుతున్నారు. 'సంక్రాంతికి కొత్త సర్పంచుల పాలన' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ చేసిన ప్రకటనతో పల్లె పోరుపై నజర్ వేస్తున్నారు. అయితే రిజర్వేషన్లే ఉత్కంఠ రేపుతున్నాయి. రిజర్వేషన్ల లెక్కలు తేల్చేందుకే ప్రభుత్వం బీసీ కమిషన్ నియమించగా, వారు వివిధ వర్గాల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఈలోగా ప్రభుత్వం తాజాగా మొదలు పెట్టిన కులగణన కూడా రిజర్వేషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి సంక్రాంతి ప్రకటన, రిజర్వేషన్ల లెక్కలు ఆశావాహులను సంకటంలో పడేస్తున్నాయి. అయితే ఇప్పటికే అధికారులు గ్రామపంచాయతీల వారిగా ఓటరు జాబితాను సిద్ధం చేయటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్కసారిగా పల్లె రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

### సంక్రాంతి నాటికి..

ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తికావటంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ఎనమిదిన్నర నెలలుగా జీపీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంక్రాంతికి కొత్త సర్పంచుల ప్రకటన ఆశావాహులను పల్లెల్లో వాలేలా చేసింది. సాధ్యమైనంత త్వరగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. సంక్రాంతి లోగా సర్పంచ్ ఎన్నికలు పూర్తి చేసి, ఆ తరువాత ఫిబ్రవరి మొదటి వారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కూడా నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉందనే వార్తలు వినబడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఓటరు జాబితాను సిద్ధం చేసిందనే చర్చ జరుగుతోంది.



### కాంగ్రెస్‌లో జోష్

పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. మొన్నటి వరకు మెజారిటీ గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు జడ్పీటీసీలు కూడా బీఆర్‌ఎస్‌కు చెందిన వారే కొనసాగారు. అక్కడక్కడా గెలిచిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం రాజకీయ వాతావరణం మారటంతో పాటు అధికారంలో ఉండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సర్పంచ్ గిరిపై కన్నుపడింది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పోటీకి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. జనగామ నియోజకవర్గంలో మినహా ఉమ్మడి వరంగల్ జిల్లాలో అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండటంతో గెలుపు సులువు అనే ధీమాతో కాంగ్రెస్ కేడర్ ఉంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హమీలు అనేకం అమలు కావటం లేదని, వాటిని తమకు అనుకూలంగా మలుచుకుని పల్లెల్లో పాగా వేయాలనే వ్యూహంతో ప్రతిపక్ష పార్టీలు కూడా బలమైన లీడర్లను బరిలో దించేందుకు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు.

### రిజర్వేషన్ల టెన్షన్

సర్పంచ్ ఎన్నికలను గత ప్రభుత్వం ఖరారు చేసిన పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తారా? లేక కొత్త రిజర్వేషన్లను ప్రకటిస్తారా? అనే ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తే.. ఇన్నాళ్లు ఎన్నికలు నిర్వహించకుండా ఎందుకు తాత్సారం చేసినట్లు అనే వ్యాఖ్యలు వినబడతాయి. పాత రిజర్వేషన్లు కులాల జనాభా ప్రకారం లేవని, తమ రిజర్వేషన్ల వాటా పెంచాలని వివిధ వర్గాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. పాత రిజర్వేషన్లే అయితే బీసీ కమిషన్ నియమించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఎందుకు అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు అనే ప్రశ్నలు కూడా తెరపైకి వస్తున్నాయి. అంతేకాకుండా పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తే కులగణన ఎందుకు చేపట్టినట్లు అనే చర్చ జరుగుతోంది. ఒకవేళ కొత్త రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లితే సంక్రాంతి లోపు బీసీ కమిషన్‌తో పాటు కుల గణన లెక్కలు తేలేనా? అనేది ఉత్కంఠగా మారింది. అయితే డిసెంబరు చివరిలోగా కొత్త రిజర్వేషన్ల ఖరారు చేసి, పంచాయతీలకు ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే ఇప్పటికే గ్రామాల ఓటరు జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసిందనే చర్చ జరుగుతోంది. ఈ విషయమై అధికారులకు కూడా ప్రభుత్వం నుంచి సమాచారం అందటం వల్లనే ఓటరు జాబితాను తయారుచేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### రెండు విడతల్లోనే..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించగా, ఈసారి రెండు విడతల్లో పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుందనే ప్రచారం ఉంది. కాగా, కొత్త రిజర్వేషన్ల వస్తే ప్రస్తుతం ఉన్న జనరల్ సీట్లు లేదా రిజర్వేషన్లు సీట్లు కూడా మారే అవకాశం ఉంది. దీంతో ఆశావహుల్లో రిజర్వేషన్ల టెన్షన్ పట్టుకుంది. సర్పంచ్‌గిరిపై పదేళ్లకు పైగా గురి పెట్టిన గ్రామ స్థాయి నేతలకు కంటిమీద కునుకులేకుండా చేయనుంది. కొత్త రిజర్వేషన్లతో తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందో అనే ఆందోళనతో పాటు కొత్త రిజర్వేషన్లతో తమకు కలిసి వస్తుందనే ఆశగా ఎదురు చూసే వారు కూడా లేకపోలేదు. మొత్తానికి సంక్రాంతికి కొత్త సర్పంచులంటూ ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటన పల్లె రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి.

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామాలు, వార్డులు ఓటర్లు**

| జిల్లా | మండలాలు | జీపీలు | వార్డులు | ఓటర్లు |
|---|---|---|---|---|
| వరంగల్ | 11 | 325 | 2,828 | 3,89,052 |
| హనుమకొండ | 12 | 210 | 1,986 | 3,65,832 |
| జనగామ | 12 | 283 | 2,576 | 4,09,797 |
| మహబూబాబాద్ | 16 | 473 | 4,056 | 5,52,192 |
| భూపాలపల్లి | 11 | 240 | 2,044 | 2,90,663 |
| ములుగు | 09 | 174 | 1,556 | 2,37,858 |
| మొత్తం | 71 | 1,705 | 15,046 | 22,45,394 |

## కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఆర్‌ఎం బీవోఎస్‌గా శ్రీనివాసరావు



కేయూ క్యాంపస్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఆర్‌ఎం విభాగం నూతన బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు బీవోఎస్‌గా పనిచేసిన ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు తెలంగాణ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా నియమితులు కావడంతో ఆ స్థానంలో ప్రొఫెసర్ శ్రీనివాసరావును నియమించారు.

## ఇంగ్లీష్‌లో శిరీషకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ నుంచి ఇంగ్లీష్ విభాగంలో సిరాపురం శిరీష డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శుక్రవారం వర్సిటీ అధికారులు శిరీషకు డాక్టరేట్ ప్రకటించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ అరబిందోస్ కంట్రిబ్యూషన్ టూ ఇండియన్ ఇంగ్లీష్ ఫిలాసఫికల్ ప్రోస్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను డాక్టరేట్ పొందారు. వీసీ ప్రొఫెసర్ జి.దామోదర్ పర్యవేక్షణలో శిరీష పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన శిరీషను పలువురు అభినందించారు.

## 10న జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ చెస్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 10న హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-13 బాలబాలికల చెస్ టోర్నీని నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. 2011జనవరి 1తరువాత జన్మించిన వారు చెస్ పోటీల్లో పాల్గొన వచ్చాన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను డిసెంబర్ నెలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి ఎంపిక చేస్తామన్నారు. అదే విధంగా ఇక్కడ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, చెస్ బోర్డు వెంట తీసుకొని రావాలని ఆయన సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఈ నెల 9న సాయంత్రం 7గంటల వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కన్నా వెల్లడించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9059522986లో సంప్రదించాలని తెలిపారు.

# పుట్టిన రోజే మృత్యు ఒడిలోకి..

**ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య ● కాలేజీ మార్చడం లేదని మనస్తాపం ● జనగామ జిల్లా చాగల్‌లో విషాదం**



సాయికిరణ్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాలేజీ మార్చాలని తల్లిదండ్రులను కోరగా, వారు ససేమిరా అనడంతో మనస్తాపం చెందిన విద్యార్థి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఛాగల్‌కు చెందిన పసునూరి వేణుగోపాల్-సుకన్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పసునూరి సాయికిరణ్ (17) హనుమకొండలోని ఓ ప్రైవేట్ కాలేజీ లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. దీపావళి పండుగ పురస్కరించుకొని హాస్టల్ నుంచి ఇంటికి వచ్చాడు. తిరిగివెళ్లేందుకు సాయికిరణ్ విముఖత వ్యక్తం చేశాడు. తాను చదువుతున్న కాలేజీకి వెళ్లలేనని, మరో కాలేజీలో చేర్పించాలని తండ్రిని కోరాడు. దానికి తండ్రి నిరాకరించాడు. మరో ఐదు నెలల్లో కాలేజీ పూర్తి అవుతుందని, కొన్ని రోజులే కదా సర్దుబాటు కావాలని సూచించాడు. దాంతో మనస్తాపం చెందిన ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

### జన్మదిన వేడుకలు ఏర్పాట్లు

సాయికిరణ్ శనివారం బర్త్‌డే జరుపుకోనున్నాడు. కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా పాలకుర్తి మండలంలోని వల్మిడి రామాలయానికి కుటుంబంతో వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని సాయికి కూడా వెల్లడించారు. బర్త్‌డే తర్వాత మళ్లీ అదే కాలేజీకి వెళ్లాల్సి వస్తుందని మనస్తాపం చెందిన సాయికిరణ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో శుక్రవారం ఉరివేసుకున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన పేరెంట్స్.. కుమారుడు ఆత్మహత్య చేసుకొని మృతి చెందడాన్ని చూసి బోరున విలపించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

# వరంగల్ ఐఎంఏ ఎన్నికల నగారా

**● అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా డాక్టర్ నాగార్జున రెడ్డి ఎంపిక ● మిగతా కార్యవర్గం కోసం షెడ్యూల్ విడుదల**



డాక్టర్ నాగార్జున రెడ్డి

వరంగల్ మెడికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐఎంఏ వరంగల్ జిల్లా నూతన శాఖ కార్యవర్గ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 13 నుంచి 16 వరకు దరఖాస్తులను విక్రయించనున్నట్లు ఎన్నికల అధికారులు డాక్టర్ వద్దిరాజు రాకేశ్, డాక్టర్ బందెల మోహన్‌రావు, డాక్టర్ ఆనంద్ బొకరే తెలిపారు. ఈనెల 17న సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్లు సమర్పించాలని, 19న స్ర్కూటిని ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన 5 గంటల్లోగా నామినేషన్ల ఉపసంహరణ, బరిలో చిలిచిన అభ్యర్థుల కోసం ఈ నెల 26న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. డాక్టర్ నాగార్జున రెడ్డి ఇప్పటికే ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని, మిగతా ఉపాధ్యక్ష పదవి, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులు, ఆర్థిక కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, బిల్డింగ్ కమిటీ సభ్యుల కోసం ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులకు క్రీడా సామగ్రిని ఇస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): హనుమకొండ వృత్తివిద్యా కళాశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్-19 జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో అత్యున్నత ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైనవారిలో హనుమకొండ వృత్తి విద్యా కళాశాలలో ఆఫీస్ అసిస్టెంట్ కోర్సు మొదటి ఏడాది చదువుతున్న జమ్మిడి కార్తీక్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరిని హనుమకొండ డీఐఈఓ గోపాల్, జిల్లా క్రీడాధికారి బి.అశోక్, అధ్యాపకురాలు కె.రేణుక కార్తీక్‌ను అభినందించి ట్రాక్ షూట్, షూస్‌ను బహూకరించారు. కాగా, కార్తీక్ నవంబరు 9 నుంచి 12 వరకు ఆసిఫాబాద్ జిల్లా బెల్లంపల్లిలో జరిగే రాష్ట్రస్థాయిపోటీల్లో పాల్గొంటారని క్రీడాధికారులు ప్రకటించారు. కార్తీక్‌ను హనుమకొండ వృత్తి విద్యా కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఎం.రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు వి.రాజశేఖర్‌రెడ్డి, ఎం.విష్ణుకాంత్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సన్యాసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిధుల గోల్‌మాల్‌పై విచారణ

వరంగల్ మెడికల్, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): కిందటేడు హనుమకొండ డీఎంహెచ్‌లో జరిగిన జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల గోల్ మాల్‌పై హనుమకొండ జిల్లా కలెక్టర్ విచారణ చేస్తున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఆస్పత్రుల్లో వైద్య పరికరాల కొనుగోలు, ఆరోగ్య ప్రచారానికి నిధులు రాగా ఆ నిధులను డీఎం హెచ్‌ఓ కార్యాలయ బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి ఖాతాలో జమ చేసుకొని ఖర్చు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టారు. అలాగే ఎన్‌ఆర్ హెచ్‌ఎంలో కొన్నేళ్లుగా చేపట్టిన వివిధ క్యాడర్ల నియామకాలపై జిల్లా కలెక్టర్ విచారణ చేస్తు న్నట్లు తెలిసింది. ఈ విషయంపై హనుమ కొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్యను వివ రణ కోరగా నిధులు, నియామకాలపై వచ్చిన ఆరోపణలపై కలెక్టర్ విచారణ చేస్తున్నది నిజమేనని తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

హనుమకొండ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 26 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి విద్యాసాగర్ ఇద్దరికి కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష, 24 మందికి రూ.33,500 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. అదే విధంగా 15 మంది మైనర్లు పట్టుబడగా ఇద్దరికి రూ.1200 జరిమానా విధించగా 13 మందికి సోషల్ సర్వీస్ విధించారని, అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని ముగ్గురికి రూ.1900 జరిమానా విధించామన్నారు.

● మట్టెవాడ: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 22 మందికి శుక్రవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశం రూ.22,500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరికి రూ. 1500 జరిమానా విధించినట్లు ఆయన వివరించారు.

# మానవ మేధస్సుకు మించింది లేదు..

**కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి**




కార్యశాలలో మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంటే మానవ మేధస్సు గొప్పదని కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమినార్ హాల్‌లో వన్ డే వర్క్‌షాప్ ఆన్ కేస్ మేథడ్ టీచింగ్ అనే అంశంపై జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అమరవేణి అధ్యక్షతన జరిగిన కార్యశాలలో వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి యువత రేపటి ఎంప్లాయిస్టులుగా మారాలని అన్నారు. వర్సిటీలు ప్రమాణాలను పెంచే విధంగా అడుగులు వేయాలని అన్నారు. విద్యార్థి నైపుణ్యాల పెంపులో భాగంగా ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థి కావాలని అన్నారు. కృత్రిమ మేధా విస్తృతి పెరుగుతున్న తరుణంలో ఉపాధ్యాయుల పాత్ర మరింత పెరుగుతోందని అన్నారు. మానవ మేధస్సుకు మించింది లేదన్నారు. ఆలోచన ప్రక్రియ నైపుణ్యాలు, సమస్య పరిష్కారం నైపుణ్యాలు, నిర్ణయం తీసుకోవడంలో నైపుణ్యాలను పెంచే విధంగా కార్యశాల ఉండాలని ఉద్బోధించారు. కేయూ కామర్స్ విభాగం సిలబస్‌ల తీసుకువచ్చిన మార్పులను అభినందించారు. ఈ సమావేశంలో కామర్స్ విభాగ బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, రిటైర్డు ప్రొఫెసర్ కె.ఓంప్రకాశ్, ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, ప్రొఫెసర్ కె.రాజిరెడ్డి, ప్రొఫెసర్ చింతకింది రాజేశం ప్రసంగించారు. ప్రొఫెసర్ వరలక్ష్మి, ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, డాక్టర్ కటకం ఫణీంద్ర, డాక్టర్ ప్రగతితో పాటు అనుబంధ కళాశాలల కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## వరంగల్ మార్కెట్ ధరలు

| పంట | క్వింటా గరిష్ట | క్వింటా కనిష్ట |
|---|---|---|
| మక్కలు (బిల్ట్ రకం) | 2450 | 2080 |
| పల్లికాయ (సూక) | 5010 | 4000 |
| పల్లికాయ (పచ్చిది ) | --- | --- |
| కందులు | 7712 | 6550 |
| పెసళ్లు | 6459 | 4052 |
| పత్తి | 6930 | 5500 |
| కొత్తపత్తి | --- | --- |
| పసుపు (కాడి) | --- | --- |
| పసుపు (గోల) | --- | --- |
| తేజ మిర్చి | 12000 | 9000 |
| తేజ ఏసీ | 17000 | 16500 |
| వండర్‌హాట్ ఏసీ | 14500 | 11000 |
| యూఎస్341ఏసీ | 13800 | 11000 |
| దేశీ ఏసీ | --- | --- |
| సింగిల్‌పట్టి ఏసీ | --- | --- |
| తాలు మిర్చి | 7000 | 3000 |

- వరంగల్ వ్యవసాయం



ఆంధ్రజ్యోతి
శనివారం 9 నవంబరు 2024
హనుమకొండ రూరల్
• పరకాల • నడికూడ • ఆత్మకూరు • దామెర • శాయంపేట • ఎల్కతుర్తి • భీమదేవరపల్లి • కమలాపూర్

## బాధిత కుటుంబాలను ఆదుకుంటాం..

దామెర, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వివిధ కారణాలతో అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దామెర మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన సానబోయిన కొమురమ్మ, అలాగే మండలంలోని పులుకుర్తి గ్రామంలో గోవిందు దాసు అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం విషయం తెలుసుకున్న చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రామకృష్ణ, రెడ్‌క్రాస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా

## సంక్షిప్త వార్తలు

### బాధిత కుటుంబానికి పరామర్శ

ఐనవోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని ఇటీవల మృతిచెందింది. స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. మండల నాయకులతోపాటు స్థానిక నాయకులు పరమార్శలో పాల్గొన్నారు.

### పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల టౌన్, దామెర, ఆత్మకూరు, పరకాల, నడికూడ మండలాలకు చెందిన సుమారు 107 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీచేశారు.

### గుడుంబా విక్రేతల బైండోవర్

శాయంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో గుడుంబా విక్రయిస్తున్న వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన పాలకుర్తి సారయ్య, కోగిల సమ్మక్క అనే ఇద్దరు గుడుంబా అమ్ముతుండగా దాడులు చేసి 12 లీటర్ల గుడుంబాను స్వాధీన పరుచుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిద్దరితోపాటు గతంలో ముద్దాయి అయిన గవగిరుణిగూడెంకు చెందిన మాలోతు దేవ్ సింగ్‌ను స్థానిక తహసీల్దార్ కల్వల సత్యనారాయణ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

నడికూడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : నడికూడ మండలంలోని చర్లపల్లి గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పరకాల ఎస్ఐ శివకృష్ణ శుక్రవారం పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం..చర్లపల్లి గ్రామానికి చెందిన తూర్పాటి ఐలయ్య రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు చౌటుపర్తి రోడ్డులోని చర్లపల్లి శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. మొత్తం 85 క్వింటాళ్లు దొరికాయని, వీటి విలువ సుమారు రూ. 2.21 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

దామెర, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పశువులకు విధిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ సూచించారు. శుక్రవారం దామెర మండలం వెంకటాపూర్, సింగరాజుపల్లి గ్రామాల్లో చేపట్టిన పశు వైద్య శిబిరాన్ని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ, గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమ రాష్ట్ర ప్రత్యేక అధికారి డాక్టర్ రజినిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాలికుంటు టీకాల పంపిణీ కార్యక్రమంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. పశువులకు తప్పకుండా గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలను వేయించాలని, తద్వారా పశువులను ఎలాంటి వ్యాధులను రాకుండా కాపాడుకోవ్చని తెలిపారు.

## గ్రంథాలయానికి మోక్షమేదీ?

• ఎనిమిదేళ్లు దాటినా ఏర్పాటు కాని వైనం
• పోటీ పరీక్షలకు దోహదపడుతుందంటున్న నిరుద్యోగులు

దామెర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల ఏర్పాటు వల్ల సమాజంలోని మార్పులు, మానవ మనుగడకు దోహదపడే ఎన్నో అంశాలు తెలుసుకోవచ్చు. అలాంటి గ్రంథాలయం దామెర మండల కేంద్రంలో లేదు. ప్రత్యేక మండలంగా ఏర్పడి ఎనిమిదేళ్లు దాటినప్పటికీ గ్రంథాలయం ఏర్పాటుకు నోచుకోకపోవడం విడ్డూరమే.

దామెర మండల పరిధిలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే ఆయా గ్రామాల్లోని ప్రజలు నిత్యం అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి వస్తూ.. పోతూ.. ఉంటారు. తమకు కాలక్షేపంతో పాటు విజ్ఞానం కోసం గ్రంథాలయం ఎంతగానో దుహదపుడుతుంది. కాగా, మండల కేంద్రమైన కేవలం దామెరలో ఆరు వేలకు పైగా జనాభా ఉంటారు. ఈ జనాభా కోసం మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

### పోటీ పరీక్షలకు దోహదం..

ప్రభుత్వ ఆధీనంలో ఏర్పాటు చేసే గ్రంథాలయాల్లోని పుస్తకాలు వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగులకు ఎంతగానో దోహద పడతాయి. సొంతంగా రూ.వందలు, వేలాదిగా డబ్బులు చెల్లించి పుస్తకాలు కొనుగోలు చేయలేని వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది.





ఊరుగొండలోని గ్రంథాలయం

గతంలో మండలంలోని ఊరుగొండ గ్రామంలో గొంది నర్సింహారెడ్డి(ఎన్ఆర్ఐ) సౌజన్యంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, వరంగల్ సీపీ సుధీర్‌బాబుల చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. కాగా, గ్రంథాలయ నిర్వహణలో ఏకాగ్రత లోపించడంతో అది కాస్త మూతపడింది. అయితే ఇటీవల సంబంధిత గ్రంథాలయంలోని పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలలోని ఓ గదిలో భద్రపరిచారు.

### సత్వరమే ఏర్పాటు చేయాలి



బొల్లు రాజు, ఊరుగొండ

దామెర మండల ప్రజల కోసం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోనూ సత్వరమే గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలి. వివిధ రకాలైన విలువైన పుస్తకాలను అందుబాటులో పెట్టాలి. అంతే కాకండా వార్తా పత్రికలను కూడా అందుబాటులో ఉంచాలి. ఇప్పటికైనా గ్రంథాలయం ఏర్పాటు కోసం సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపించాలి.

### దామెరలో గ్రంథాలయం నెలకొల్పాలి



మంద రమేష్, పసరుగొండ

విజ్ఞాన సర్వస్వం కోసం దామెరలో గ్రంథాలయం నెలకొల్పాలి. ప్రత్యేక మండలం ఏర్పడి ఎని మిదేళ్లు దాటినప్పటికీ మండలం కేంద్రంలో గ్రంథాలయం లేకపోవడం శోచనీయం. శాశ్వత ప్రాతి పదిన ఓ భవనం నిర్మాణంతో పాటు గ్రంథాలయంలో అన్ని రకాలైన సదుపాయాలను ఏర్పాటు చేయాలి.

## ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



శాయంపేటలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ముల్కనూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఐనవోలులో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎల్కతుర్తిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి

పరకాల, (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పరకాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షుడు అలీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా సీఎం జన్మదినం సందర్భంగా మడికొండ బ్రదర్స్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ మెరిన్, పరకాల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, పరకాల పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మచ్చ సుమన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● శాయంపేట, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా రేవం త్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే కేక్ కట్ చేసి, స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాంనర్సింహారెడ్డి, సంపత్‌రావు, చల్లా చక్రపాణి, శ్రీనివాస్ రెడ్డి, మారపెల్లి బుజ్జన్న, బాసని చంద్రప్రకాష్, కందగట్ల రవి, మారపెల్లి కట్టయ్య,చిందం రవి, దుబాసి క్రిష్ణమూర్తి, చింతల రవిపాల్, రాజేందర్, కుమారస్వామి, రమేష్, వరదరాజు పాల్గొన్నారు.

● ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్ భారీ కేక్‌ను కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డితోనే సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, మాజీ వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య, మండల అధికార ప్రతినిధి అబ్దుల్ గఫూర్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు గుండెబోయిన శ్యాం, అలువాల రవి, మత్స్యశాఖ చైర్మన్ బయ్య తిరుపతి, నాయకులు బయ్య కుమారస్వామి, రాజు గౌడ్, బరుపట్ల కిరీటి, పరకాల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మాదాసి శ్రీధర్ పాల్గొన్నారు.

● నడికూడ, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కంఠాత్మకూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ తిరుపతి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, విజేందర్, రాజమల్లు, కుమ్మరి నరేష్, కుమ్మరి అన్వేష్, బుస్స రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● భీమదేవరపల్లి, (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. టపాసులు కాల్చారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి ఐలయ్య, కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, చిట్కూరి రామచంద్రం, మాజీ సర్పంచ్ మాడ్గుల కొంరయ్య ఊసకోయిల ప్రకాష్, గజ్జెల సురేష్, సమ్మయ్య, పొన్నాల మురళీ, కొంరయ్య, బాబు, డబ్బా శంకర్, శివకుమార్ పాల్గొన్నారు.

● ఎల్కతుర్తి, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తి మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. చౌరస్తా వద్ద మండల పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనా రెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోలి రాజేశ్వర్ రావు, అంబాల స్వామి, శీలం అనిల్, యాదగిరి గౌడ్, వినయ్, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్, గొలిపెల్లి సంపత్, బత్తిని రవీందర్ పాల్గొన్నారు.

● ఐనవోలు, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఐనవోలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, జిల్లా, మండలనాయకులు కొత్తూరి సునిల్, వెంకటేశ్వర్‌రావు, యాకర సాంబయ్య, చిరంజీవి, బుచ్చిరెడ్డి, ఎలిషా, బండి సంపత్‌గౌడ్ పాల్గొన్నారు

● కమలాపూర్ (ఆంధ్రజ్యోతి) : కమలాపూర్ మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కమలాపూర్ బస్టాండ్ వద్ద పార్టీ మాజీ అధ్యక్షుడు గుండవు చరణ్ పటేల్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

## మాలలను ఇంకెంతకాలం అణచివేస్తారు

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



ఎల్కతుర్తిలో మాట్లాడుతున్న పిల్లి సుధాకర్

ఎల్కతుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దళితులకు రాజ్యాంగ అధికారం దక్కకూడదనే కుట్రతోనే ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరిస్తూ మాలలను అణచివేస్తున్నారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. శుక్రవారం ఎల్కతుర్తి మండలంలోకి మాల మహానాడు పాదయాత్ర ప్రవేశించింది. బావుపేట శివారులో స్థానిక మాల మహానాడు నాయకులు, మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పిల్లి సుధాకర్ పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ, ప్రధాని నరేంద్ర మోదీ కౌగిలిలో ఇరుక్కుని మనువాదుల ఏజెంట్‌గా మారారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా జరగలేదని న్యాయస్థానాలు మనువాదుల జేబు సంస్థలుగా మారాయని ఆయన విమర్శించారు. న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చిన వెంటనే రాష్ట్రంలో అమలు సాధ్యమా, కాదా అనే విషయాన్ని పరిశీలించకుండా వర్గీకరణను వెంటనే అమలు చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడాన్ని ఆయన తప్పుపట్టారు. ఏ రీతిన వర్గీకరణ చేపడతారో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో మాలలు, మాదిగలు జనాభా పరంగా సమానంగా ఉన్నారని, అయినా మాలలను తక్కువ చేసి చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని, రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను తరిమికొట్టేందుకు మాలల సిద్ధంగా ఉండాలని పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు.

38 రోజులపాటు 35 నియోజకవర్గాల మీదుగా వెయ్యి కిలో మీటర్ల పాద యాత్ర అనంతరం డిసెంబరు 1న హైదరాబాద్‌కు చేరుకుంటుందన్నారు. హైదరాబాదులో నిర్వహించే మాలల సంగ్రామ యాత్రకు లక్షల మంది మాలలు, మాల ఉపకులాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సీపీఐ కార్యదర్శి మర్రి వెంకటస్వామి, మాల మహానాడు నాయకులు మేడి అంజయ్య, దామెర సత్యం, ఇరుక్ల యాదగిరి, హన్మకొండ జిల్లా అధ్యక్షులు డబ్బ రవి, వెంకటస్వామి, ఆర్య, కిషోర్, ఎల్కతుర్తి మండలాధ్యక్షుడు పప్పుల గంగాధర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మర్రి అమరేందర్, బందెల రామచంద్రం, గూడెం నాగరాజు, గూడెం సురేందర్, కర్రె తిరుపతి, పృథ్వీరాజ్, గొల్లపల్లి సంపత్, కర్రి లక్ష్మణ్, మర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### వయనాడు ప్రచారానికి కాంగ్రెస్ నాయకులు

భీమదేవరపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేరళలోని వయనాడు ఉప ఎన్నిక ప్రచారం కోసం భీమదేవరపల్లి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. వయనాడు పార్లమెంట్ ఉప ఎన్నికల్లో ప్రియాంకగాంధీ పోటీ చేస్తున్నారు. ప్రియాంకగాంధీ గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు వయనాడు పార్లమెంట్ పరిధిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొల్గూరి రాజు, ఆదరి రవీందర్, మడిపల్లి సదానందం, మాజీ వైస్ ఎంపీపీ మాడ్గుల ఎల్లా, గజ్జెల సురేష్, తకిల్‌పాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలల్లో లబ్ధిదారులకు చెక్కులు

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ పరంగా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మూడు నెలల్లో మంజూరు చేస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవా రం ధర్మసాగర్ మండల కేంద్రంలో తహసీ ల్దార్ సదానందం ఆధ్వర్యంలో నిర్వహిం చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్,సీఎంఆ ర్ఎఫ్ చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే , ఎంపీ కడియం కావ్య కలిసి ల బ్ధి దారులకు పంపిణి చేశారు. అనం తరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మె ల్యే మాట్లాడారు. గతంలో ఉన్న ప్రభుత్వం కల్యాణ లక్ష్మీ ,షాదీ ముబారక్ చెక్కులను సంవత్సరం గడిచిన తర్వాత లబ్ధిదా రుల కు పంపిణి చేసిందన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో చెక్కుల ఆర్థిక సాయాన్ని లబ్ధిదా రుల కు అందించాలని అధికారులను ఆదేశిం చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. చెక్కుల పంపి ణీ ఆలస్యమైతే అధికారుల తప్పిదం అవుతుందన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అధికారులకు, దళారులకు ఎవరూ ఒక్క రూపాయి కూడ ఇవ్వవద్దని ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. గతంలో ఉన్న పెద్దలు చాలా తప్పులు చేశారని ప్రభుత్వ పథకాలు, దళితబంధు, పనులను, పదవులను డబ్బులకు అమ్ముకున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. అనంతరం ధర్మసాగర్ మండలంలోని 62 మందికి, కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ ,32 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే, ఎంపీ కావ్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతం ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ సంక్షేమ, అబివృద్ధి పథకాలు ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రమేష్, ఎంపీడీవో అనిల్ కుమార్, తహసీల్దార్ బావు సింగ్, ఆర్ఐ కిరణ్ పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

దామెర, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ (బాలుర)ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తమ వంతు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దామెర క్రాస్‌రోడ్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల(బాలసముద్రం) ఆవరణలో వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి.సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి సీఎం జన్మదిన కేక్ కట్ చేసి, సంబరాలు జరిపారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి వాటిని కల్పించడం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పాఠశాలలో నాణ్యతతో కూడిన విద్యా ప్రమాణాలను పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు వంటి వాటిపై ఉపాధ్యాయులు, విద్యార్థులతో కాసేపు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దురిశెట్టి భిక్షపతి, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు గుడిపాటి శ్రీధర్‌రెడ్డి, బిల్లా రమణారెడ్డి, చందుపట్ల సత్యవర్ధన్‌రెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోల్సాని అనిల్‌రెడ్డి, జక్కుల రవీందర్, దామెర శంకర్ పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాలతో నష్టపోయాం..

న్యాయం చేయాలని రైతుల నిరసన

శాయంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కల్తీ విత్తనాలతో వరి పంటలు నష్టపోయామని, విక్రయించిన వారిపై చర్యలు తీసుకుని, నష్టపరిహారం చెల్లించాలని రైతులు నిరసనకు దిగారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు మండల కేంద్రంలోని శంకర్ ఫర్టిలైజర్స్ దుకాణంలో ఓ కంపెనీకి చెందిన జైశ్రీరామ్ 20 బస్తాల వరి విత్తనాలు కొనుగోలు చేసి, 20 ఎకరాలలో సాగు చేశారు. ఈ నేపథ్యంలో విత్తనాలు కల్తీకావడంతో ఒకేసారి కాకుండా వేర్వేరుగా, తేడాగా గొలుసులు వేయడంతో వడ్లు రాలిపోయాయి. దిగుబడి తగ్గుతుందని రైతులు సంబంధిత డీలర్‌ను సంప్రదించగా కంపెనీ వారికి సమాచారం ఇచ్చానని అన్నారు. అనంతరం రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, కంపెనీ వారు వరిపంటలను పరిశీలించి, కల్తీ జరిగిందని నిర్ధారించారు. రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో కంపెనీవారు స్పందించకపోవడం, డీలర్ చేతులెత్తేయడంతో రైతులు ఆగ్రహించారు. విత్తనాలు విక్రయించిన దుకాణం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయకుంటే ధర్నా, రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారి గంగాజమునకు ఫిర్యాదు చేశారు.



మండల కేంద్రంలో ఫర్టిలైజర్స్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

ఈ కార్యక్రమంలో రైతులు వజీరు శంకర్ రావు, రాయరాకుల మొగిలి, రాజేందర్, నిరంజన్‌రావు, రాజన్న, రామయ్య, ఐలయ్య, గోపాల్ రావు, మహేందర్, భాస్కర్, మధుకర్ పాల్గొన్నారు. ఈ విషయంపై ఏవో మాట్లాడుతూ పంటలు పరిశీలించినపుడు తేడాగా ఉన్నాయని, పై అధికారులకు సమాచారం ఇచ్చి, శాస్త్రవేత్తలను తీసుకువచ్చి నిర్ధారిస్తామని వెల్లడించారు. డీలర్ శంకర్ వివరణ ఇస్తూ రైతులకు ఎక్కువ మొత్తంలో నష్టం జరగడంలేదని, సంబంధిత కంపెనీవారితో సంప్రదింపులు చేస్తున్నామని అన్నారు.

### గుట్కా అమ్ముతున్న ఇద్దరిపై కేసు

కమలాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరు కిరాణ షాపు యజమానులు ప్రభుత్వ నిషేధిత అంబర్, గుట్కా ప్యాకెట్లు అమ్ముతుండగా వారిపై శుక్రవారం కేసులు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన చేరాల రమేష్, వేముల వీరస్వామిలు తమ కిరాణ షాపులలో ప్రభుత్వ నిషేధిత అంబర్, గుట్కా ప్యాకెట్లు గత కొంతకాలంగా అమ్ముతున్నారు. అంబర్, గుట్కా లు అమ్ముతున్నారని సమాచారం మేరకు తనఖీ చేశామన్నారు. వేముల వీరస్వామి, చేరాల రమేష్‌ల వద్ద రూ.7865 విలువైన ప్రభుత్వ నిషేధిత అంబర్, గుట్కా ప్యాకెట్లు లభించాయన్నారు. అంబర్, గుట్కా ప్యాకెట్లను స్వాధీన పరుచుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

## రాములో.. రాములా..!

**ఆ ఊరిలో ఒకే పేరుతో సుమారు 200 మంది**



జీడికల్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయం

అది జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని జీడికల్ గ్రామం. త్రేతాయుగం నుంచే శ్రీరామచంద్రస్వామి కొలువుదీరిన ఆలయం ఇక్కడే ఉండటంతో అందరూ ఆ శ్రీరామచంద్రుడుని తమ ఇలవేల్పుగా కొలుస్తారు. అంతేకాదు తమ సంతానానికి ఆ రామచంద్రుడి పేరు కలిసొచ్చేలా రాములు అని పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఈ గ్రామంలో ఇప్పటి వరకు సుమారు 200మందికి పైగా రాములు అనే పేరున్నవారు అంటే ఔరా అనక తప్పదు. ఇక ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములు ఉంటే వాళ్ల పేర్లు పెద్ద రాములు.. నడిపి రాములు.. చిన్న రాములు.. అని పెట్టుకున్న వారున్నారు. ఇంకా తండ్రీకొడుకుల పేర్లు రాములు అని ఉన్నవారు కూడా ఉండగా.. వారిని తండ్రి రాములు, కొడుకు రాములుగా సంబోధిస్తారు. అంతేకాదు బండమీది రాములు, బస్టాండ్ కాడి రాములు, హోటల్ రాములు అంటూ వారు వృత్తులు, నివసించే ప్రాంతాలను జోడించి పిలుచుకుంటారు. ఇక పోస్టాఫీస్‌కు రాములు అనే పేరుతో ఏదైనా ఉత్తరం వస్తే ఎవరికి ఇవ్వాలో అర్థం కాక పోస్టమాస్టర్ పడే తిప్పలు అన్నీ ఇన్నీ కావు. అయితే ఇప్పటి ఫ్యాషన్ ప్రపంచంలో పిల్లలకు తల్లిదండ్రులు రాములు అనే పేరునే కాకుండా ర అక్షరం కలిసొచ్చేలా కొత్తకొత్త పేర్లను పెట్టుకుంటున్నారు. ఇక ఇదే మండలంలోని పటేల్‌గూడెం గ్రామంలోనూ ఇదే పరిస్థితి. కాకపోతే ఇక్కడ గోపాలస్వామి ఆలయం ఉండటంతో గ్రామస్థులు చాలామంది గోపాలస్వామిని ఇలవేల్పుగా కొలుస్తూ.. తమ సంతానం పేర్లను గోపాల్, గోపయ్య, గోపి, గోపాలస్వామిగా పెట్టుకోవడం గమనార్హం.

- లింగాలఘణపురం

# వేంకటేశుని సేవలో..

- శ్రీవారి సేవలపై ఓరుగల్లు మహిళల ఆసక్తి
- ఇటీవలి కాలంలో సుమారు 20వేల మంది తిరుమల పయనం
- ఉమ్మడి జిల్లాలో 510కి పైగా భజన మండళ్లు

హనుమకొండ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, ఏడుకొండల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలకోరుస్తారు. మూడు నెలల ముందుగా దర్శనం స్లాట్లు బుక్ చేసుకుని తిరుమలకు పయనమవుతారు. కానీ ఇటీవలి కాలంలో ఏకంగా వారం రోజుల పాటు తిరుమలలోనే ఉండి స్వామివారి సేవల్లో పాల్గొని తరిస్తున్నారు. ముఖ్యంగా ఈ సేవల్లో పాల్గొనేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. అలా నిత్యం తిరుమలలోని స్వామివారి సేవలో కనీసం 5వేల మంది సేవకులు పాల్గొంటుండగా.. వారిలో ఉమ్మడి వరంగల్ జిల్లా వారు కూడా ఉంటున్నారు. ఈ మధ్య కాలంలో ఉమ్మడి జిల్లా నుంచి సుమారు



శ్రీవారి సేవలో పాల్గొన్న హనుమకొండ మహిళల బృందం

20వేల మంది మహిళలు స్లాట్స్ బుక్ చేసుకొని సేవలో తరించి వచ్చినట్లు తెలుస్తోంది. వరంగల్, హనుమకొండ నగర ప్రాంతాలతో పాటు అనేక గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా మూడు నెలల ముందుగానే 15 నుంచి 20మంది భక్తులు శ్రీవారి సేవకు బయల్దేరి వెళ్తున్నారు. తాజాగా హనుమకొండ అడ్వొకేట్స్‌కాలనీ నుంచి బొల్లం సునిత ఆధ్వర్యంలో 15మంది మహిళలు స్వామివారి సేవలో పాల్గొని వచ్చారు. అలాగే బ్రాహ్మణవాడకు చెందిన మహిళలు, భీమారంకు చెందిన పరంకుశం శిరీషా గిరిధర్ కృష్ణ ఆధ్వర్యంలో కూడా 15మంది చొప్పున భక్తులు శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఇంకా అనేక మంది సేవలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతూ స్లాట్లను బుక్ చేసుకుంటున్నారు.

### స్వామి సేవ మహాభాగ్యం..

హనుమకొండ నుంచి ఇటీవల స్వామివారి సేవలో పాల్గొని వచ్చిన బొల్లం సునిత, జ్యోతిరాణి, చైతన్య, రాధిక, బిందురెడ్డి తదితరులు మాట్లాడుతూ వారం రోజుల పాటు స్వామివారి సేవలో తరించి రావడం మహాభాగ్యమన్నారు. తమకు అక్కడ ప్రత్యేక వసతి, భోజన సౌకర్యం కల్పించారని, ముఖ్యంగా చివరి రోజు నాలుగు గంటల పాటు స్వామివారి సన్నిధిలో ఏకాంత సేవలో, భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు తమకు అవకాశం కల్పించారన్నారు. తమ బృందంలో రెండు, మూడు సార్లు సేవలోపాల్గొని వచ్చిన భక్తులు కూడా ఉన్నారన్నారు. ఒకరోజు వకుళామాత మందిరం వద్ద , మరొక రోజు కొబ్బరికాయల విక్రయం వద్ద, మరో రోజు నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా కూరగాయలు తరగడం లాంటి అనేక సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం గొప్ప అనుభూతి కలిగించిందన్నారు. ఇలా ఇటీవలి కాలంలో అనేక మంది ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 100కు పైగా సేవా బృందాలు తిరుమలకు వెళ్లి వచ్చాయని చెబుతున్నారు.

### భజన బృందాలు కూడా..

ఉమ్మడి జిల్లాలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా నమోదైన 510కి పైగా భజనబృందాల్లో నిత్యం ఏదో ఒక బృందం చొప్పున తిరుమలకు వెళ్లి స్వామివారి సేవలో పాల్గొంటున్నాయి. ఒక్క జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచే 250కి పైగా భజన బృందాలు ఉండగా మహబూబాబాద్ నుంచి 100, హనుమకొండ , వరంగల్ నుంచి 98, జనగామ జిల్లా నుంచి 90 దాకా బృందాలు స్వామివారి సేవలో ముఖ్యంగా అఖండ హరినామ సంకీర్తన, యక్షగానాలు తదితర కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. ఇంకా టీటీడీ ద్వారా నమోదు కాని బృందాలు కూడా 400కు పైగా ఉన్నాయని ఒక అంచనా. వసతి, భోజన సౌకర్యాలతో పాటు స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని కల్పిస్తున్న క్రమంలో భజన బృందాలు ఉత్సాహంగా స్వామివారి సేవకు తరలి వెళ్తుండడం విశేషం.



శ్రీవారి భజనలో పాల్గొన్న పత్తిపాక బృందం

### ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు..

తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా ఉమ్మడి జిల్లాలో ఏటా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ముఖ్యంగా మనగుడి పేరిట ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాలోని ఒక్కో ప్రాంతంలో అన్ని పర్వదినాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గీతా జయంతి, గో పూజలు, రథ సప్తమి వేళ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహింప చేస్తున్నామన్నారు. వీటితో పాటు స్వామివారి సేవలో పాల్గొనే భజన బృందాలను సమన్వయపర్చి ప్రతీ రోజు ఉమ్మడి జిల్లా నుంచి ఒక బృందం తిరుమలలో ఉండేలా కార్యక్రమాలు రూపొందించామన్నారు. 2016 నుంచి తిరుమలలో ప్రారంభమైన శ్రీవారి సేవలో భక్తులు కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ముఖ్యంగా మహిళలు బృందంగా తయారై వెళ్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు వరంగల్ నగరంతోపాటు మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, జనగామ, తదితర ప్రాంతాల నుంచి 25వేలకు పైగా శ్రీవారి సేవకులు పేర్లు నమోదు చేసుకొని సేవకు వెళ్లి వచ్చినట్లు ఆయన వెల్లడించారు.



ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన దృశ్యం



ఆలయంలోని శివలింగం

# వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

- పంచలింగాల శివాలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- దర్శించుకున్న పలువురు ప్రముఖులు

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో పునఃనిర్మితమైన పంచలింగాల శివాలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్ వేద పండితుల చేతుల మీదుగా గణపతి హోమం, రుద్రహోమం నిర్వహించిన అనంతరం గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన, నైరుతి లింగం, వాయు లింగం, దక్షిణ ముఖ లింగం, ఆగ్నేయ లింగం, ఈశాన్య లింగ ప్రతిష్ఠాపన వేద పండితులు వేద మంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, మేళ తాళాలతో నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో ఈశాన్య లింగాన్ని రాష్ట్ర ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత పర్వతగిరి రాజు దంపతులు ప్రతిష్ఠాపన చేశారు.

పార్వతిమాత ప్రతిష్ఠాపన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నవగ్రహ ప్రతిష్ఠాపన, జంట నాగుల ప్రతిష్ఠాపనతో పాటు కుంబాభిషేకం, కలశ ఆరాధనను భక్తుల శివనామస్మరణ నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరావడంతో సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును, రోప్‌పార్టీ పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టారు. ఈ వేడుకల్లో మాజీ మేయర్ డాక్టర్ రాజేశ్వర్‌రావు, రాజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు వగాల సమ్మిరెడ్డితో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

### దర్శించుకున్న నేతలు

దక్షిణ ముఖ పంచలింగాల శివాలయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పరకాల కోర్టు జడ్జి శాలిని లింగం దర్శించుకొని విశేష పూజలను నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయచందర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ ఫెడరేషన్ చైర్మన్ కడారి నవనీతరావు, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ప్రధాన కార్యదర్శి చిదిరాల సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మైనారిటీ సెల్ నాయకులు మహ్మద్ బాబుమియాలు విశేష పూజలు నిర్వహించారు.



శివాలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

# స్కాన్ చెయ్.. సమాచారం పట్టు..

- గూగుల్ మ్యాప్ ద్వారా కాకతీయుల చరిత్ర సందర్శన
- ఆధునిక పద్ధతిలో పర్యాటకులను అలరిస్తున్న కాకతీయుల చరిత్ర

ఖిలావరంగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రసిద్ధి గాంచిన ఖిలావరంగల్ కోటను ఆధునిక పద్ధతిలో పర్యాటకులు తిలకించేందుకు భారతీయ సర్వేక్షణ, కేంద్ర పురావస్తు శాఖ సెల్‌ఫోన్‌లో స్కాన్ ద్వారా గూగుల్‌ను ఏర్పాటు చేసింది. దేశ విదేశాలలో పేరిన్నిక గల కాకతీయుల కాలం నాటి ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాల ఆవరణలోని చారిత్రక కట్టడాలను, శిల్ప సంపదను సెల్ ఫోన్‌లో ప్రత్యక్షంగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో తెలుసుకోవచ్చు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప, లక్నవరం, భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయం తదితర పర్యాటక ప్రాంతాలతో పాటు ఖిలావరంగల్‌లోని సందర్శన ప్రాంతాల వివరాలు గూగుల్ మ్యాప్ ద్వారా లోకేషన్‌కు వెళ్లే మార్గం, ఎంత దూరంలో ఉందో తెలిపే వివరాలను తెలసుకునేలా గూగుల్ మ్యాప్ సెల్‌ఫోన్‌లో పర్యాటకులకు తెలుపుతుంది. దేశ, విదేశాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు ఇబ్బంది పడకుండా కేంద్ర పురావస్తు శాఖ తీసుకున్న క్యూఆర్ కోడ్‌తో సులభంగా చరిత్రను తెలుసుకోవడంతో పాటు జిల్లాలోని చారిత్రక ప్రాంతాలను త్వరగా చేరుకోవడానికి మార్గాన్ని చూపించడంతో పర్యాటక ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కోటలో రాతి స్తంభంపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

# సందడిగా టెక్నోజియాన్

- పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు
- నేటి నుంచి ఈవెంట్లు ప్రారంభం
- నిట్ క్యాంపస్ అందంగా ముస్తాబు
- తలపించనున్న మినీ భారతం

హనుమకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థులే రూపొందించిన సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు వేదికైన టెక్నోజియాన్-2024 (సాంకేతికోత్సవం) శుక్రవారం వరంగల్ నిట్ కళాశాలలో ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో దేశంలోని వివిధ జాతీయ సాంకేతిక కళాశాలల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. వివిధ సాంకేతిక అంశాలకు, ప్రయోగాలకు, అధునాతన సాంకేతిక ప్రక్రియలకు సంబంధించిన 50 ఈవెంట్లను ఇందులో నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్లలో పాల్గొన్న విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందచేస్తారు.

వరంగల్ నిట్‌లో యేటా టెక్నోజియన్ పేరుతో ఈ సాంకేతిక పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతీ సంవత్సరం టెక్నోజియాన్‌ను నవంబర్ రెండో వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో నిర్వహిస్తారు. అయితే కిందటేడు టెక్నోజియాన్‌ను కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ యేడు జనవరి 19 నుంచి 21వ తేదీ వరకు 'ఇంజీనియస్' ఇతివృత్తంగా నిర్వహించారు. వరంగల్ నిట్‌లో నిర్వహించే టెక్నోజియాన్‌కు దేశవ్యాప్తంగా మంచి పేరుంది. ఇక్కడ నిర్వహించే ఈ సాంకేతిక వేడుకలో పాల్గొనేందుకు దేశంలోని వివిధ సాంకేతిక కళాశాలల విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపుతారు. విద్యార్థులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యేది కూడా ఇక్కడే. టెక్నోజియాన్‌లో మొత్తం 50 ఈవెంట్లను నిర్వహిస్తున్నారు.



ఈవెంట్‌ను ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

### నేటి ఈవెంట్లు

మొదటి రోజు శనివారం నిర్వహించే ఈవెంట్లలో టక్నో హంట్, డాటా సైన్స్‌సెంటర్, బ్రిడ్జి ఫ్యాబ్రికో, ఫ్రైమ్‌వేర వర్క్‌షాప్ సికాడ, కేబీసీ, ల్యాబ్రింత్ సర్క్యూట్ చేస్, లెట్ థెమ్ కుక్, కెమ్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్, పీఎం సైన్స్ క్విజ్, ఫ్యూచర్ మేనేజర్, డిబగ్గర్స్ డ్యుయేల్, బిల్డ్ ఏపీసీ, ఎల్ఎల్‌డీ, మెకానికల్ కిట్ అసెంబ్లీ, వెహికిల్ డెమోన్‌స్ట్రేషన్, డేర్ టూ ఫీల్ ద పెయిన్, ఫైండ్ ద స్కామ్, డచ్ యాక్షన్, ట్రస్ట్ ఆఫ్, ట్రెజర్ హంట్ క్యాంపస్ ఇన్స్టీవ్ 8, ఐడీయాతన్, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్, మెట్ రష్, మెటాఫోర్డ్ మిస్టరీ మేజ్‌తో పాటు రిసర్చ్ పేపర్ ప్రజంటేషన్, కెమ్ ఈ కేస్ ఉన్నాయి. నిట్ క్యాంపస్‌లోని మ్యాథమెటికల్ సొసైటీ, ఫొటోగ్రఫీ క్లబ్, సివిల్ ఇంజనీరింగ్ అసోసియేసన్, క్విజ్ క్లబ్, ఈఏ అండ్ ఎహెచ్‌ఎంఎం, సీఎస్ఈఎస్, కెమిస్ట్రీ సొసైటీ, ఫిజిక్స్ సొసైటీ, ఈసీఈ సొసైటీ, రోబోటిక్ క్లబ్, మెకానికల్ ఇంజనీరింగ్ సొసైటీ, ఈఈఈ సొసైటీ, సైన్స్ అండ్ అస్ట్రానమీ క్లబ్ వాల్యు ఎడ్యుకేషన్‌క్లబ్ తదితర సంస్థల ఆధ్వర్యంలో ఈ ఈవెంట్లు జరుగనున్నాయి.

### ముస్తాబు

టెక్నోజియాన్‌ను పురస్కరించుకొని నిట్ క్యాంపస్‌ను అందంగా తీర్చిదిద్దారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో అలకరించారు. క్యాంపస్‌లో పలుచోట్ల ఈవెంట్లను ప్రతిబింబించే, స్పాన్సర్ల పేర్లు తెలిపే ఫ్లెక్సీలను కట్టారు. వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు హాజరవుతున్నందువల్ల వారికి ఇష్టమైన ఆహారాన్ని అందించేందుకు క్యాంపస్‌లో ఫుడ్ కోర్టులు కూడా వెలిశాయి. ఈవెంట్లు క్యాంపస్‌లో ఎక్కడెక్కడ నిర్వహిస్తున్నది విద్యార్థులు సులభంగా తెలుసుకునేందుకు అన్నిచోట్ల బోర్డులను ఏర్పాటు చేశారు. టెక్నోజియాన్‌కు హాజరయ్యే విద్యార్థులందరికీ క్యాంపస్‌లోనే వసతి, భోజన ఏర్పాట్లను చేశారు. పెద్దసంఖ్యలో విద్యార్థుల రాకతో క్యాంపస్ సందడిగా మారింది. వివిధ రాష్ట్రాలు, సంస్కృతులకు చెందిన విద్యార్థుల రాకతో నిట్ క్యాంపస్ మినీ భారతాన్ని తలపింప చేయనున్నది.

## విజ్ఞానం, నెట్‌వర్క్ మార్పిడికి గొప్ప వేదిక

- టెక్నోజియాన్ ప్రతీ ఈవెంట్ ఓ పాఠం
- విద్యార్థులు అన్నిట్లో విధిగా పాల్గొనాలి..
- సీసీఐఆర్-ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌వీ చౌదరి
- వరంగల్ నిట్‌లో ప్రారంభమైన టెక్నోజియాన్-24



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్‌వీ చౌదరి

హనుమకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానాన్ని, నెట్‌వర్క్‌ను పరస్పరం మార్పిడీ చేసుకోవడానికి గొప్ప వేదిక టెక్నోజియాన్ అని, విద్యార్థులు ఇందులో పాల్గొని ఇక్కడ నిర్వహించే ప్రతీ ఈవెంట్‌లో తమ ప్రతిభను చాటాలని హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-ఐఐసిటి విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌వీ చౌదరి పిలుపునిచ్చారు. వరంగల్ నిట్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో శుక్రవారం టెక్నోజియాన్-24కు జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ చౌదరి మాట్లాడుతూ.. టెక్నోజియాన్‌లలో వివిధ సాంకేతిక అంశాలపై నిర్వహించే పోటీలు, ప్రదర్శించే ప్రయోగాలు, నూతన సాంకేతిక అవిష్కరణలు ఇందులో పాల్గొనే విద్యార్థుల సృజనాత్మకతను, ప్రతిభాపాటవాలను మరింత పెంచుతాయనీ, కొత్త విషయాలను నేర్చుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల కెరీర్ అవకాశాలను మెరుగుపరుస్తాయని అన్నారు. టెక్నోజియాన్‌ను ప్రతీ విద్యార్థి ఒక లెర్నింగ్ ఎక్సీరియన్స్‌గా తీసుకొని ప్రతీ ఈవెంట్‌లో పాల్గొనాలని అన్నారు. సాంకేతిక కళాశాలల్లో చదివే విద్యార్థులు జ్ఞానసముపార్జన ద్వారా దేశంలోని సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

కాగా, టెక్నోజియాన్ టెక్నికల్ సొసైటీ వైస్‌ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరిప్రసాద్ టెక్నోజియాన్-24 గురించి వివరించారు. ఈసాంకేతికోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు నిట్‌లోని వివిధ శాఖలు, క్లబ్‌లను ఒకదగ్గర చేర్చడానికి ఎంతో కృషి చేసారన్నారు. పాల్గొనే విద్యార్థులకు టెక్నోజియాన్ ఒక గొప్ప అభ్యాస అనుభవాన్ని ఇస్తుందన్నారు. టెక్నోజియాన్‌లో భాగంగా ఈ ఏడు 50 ఈవెంట్ల కన్నా ఎక్కువ నిర్వహించేందుకు ప్రణాళికను రూపొందించామన్నారు. సాంకేతిక ప్రదర్శనలతో పాటు అతిథి ఉపన్యాసాలు ఉంటాయని చెప్పారు. శనివారం సాయంత్రం రోబోటిక్స్ క్లబ్ నిర్వహించే ఈవెంట్ ప్రత్యేక ఆకర్శణగా ఉండగలదని, ఇందులో వంద మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య మాట్లాడుతూ.. విద్యార్థులకు సవాల్‌గా ఉన్న సమస్యల పరిష్కారానికి శుక్రవారం రాత్రి నుంచి 48 గంటల పాటు నిర్వహించే హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి సమన్వయకర్త ఇషాన్, డాక్టర్ బి.శ్రీనివాస్, డాక్టర్ మురళీధర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ప్రముఖ గణిత అధ్యాపకుడు, మ్యాథ్స్‌స్కేర్ వ్యవస్థాపకుడు డాక్టర్ గజేంద్ర పురోహిత్, తథాస్తు వ్యవస్థాపకురాలు, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ తనూ జైన్ విద్యార్థులను ఉద్దేశించి అతిథి ప్రసంగిస్తారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

## టెక్నోజియాన్ రెండు రోజులే..

- గతంలో మూడు రోజులు
- ఈసారి సాంస్కృతిక కార్యక్రమాలు లేవు
- పూర్తిగా సాంకేతిక అంశాలపై దృష్టి



టెక్నోజియాన్‌కు హాజరవుతున్న విద్యార్థినులు

హనుమకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్ క్యాంపస్‌లో నిర్వహించనున్న టెక్నోజియాన్‌ను రెండు రోజులకే పరిమితం చేశారు. గతంలో మూడు రోజుల పాటు ఈ వేడుకలు అంగరంగ వైభంగా జరిగేవి. టెక్నోజియాన్‌లో భాగంగా పెద్ద ఎత్తున సాంస్కృతికకార్యక్రమాలు కూడా నిర్వహించేవారు. జాతీయ, అంతర్జాతీయ కళాకారులు వీటిలో పాల్గొని విద్యార్థులకు వినోదాన్ని పంచేవారు. కానీ ఈసారి టెక్నోజియాన్‌ను కేవలం సాంకేతిక ఈవెంట్లకే పరిమితం చేశారు. ఈ రెండు రోజుల్లో వివిధ అంశాలకు సంబంధించి 50 ఈవెంట్లను నిర్వహిస్తున్నారు. ఈసారి కొన్ని కొత్తవాటిని కూడా చేర్చుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ఈవెంట్లు జరుగుతాయి. సాంకేతిక ఈవెంట్లతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు కూడా నిర్వహించడం వల్ల వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈవెంట్లపై, ప్రధానంగా సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేక పోతున్నారు. వినోదాత్మక కార్యక్రమాల వైపే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఒకే ప్రాంగణంలో అటు సాంకేతికతతో ఇటు సాంస్కృతికం ఏకకాలంలో నిర్వహించడం వల్ల కొంత గందరగోళం చోటు చేసుకుంటున్నది. విద్యార్థులు సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలపై, వీటిని ప్రతిబింబించే ఈవెంట్లపై దృష్టిని సారించలేకపోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సాంస్కృతిక కార్యక్రమాలను మినహాయించి పూర్తిగా సాంకేతిక ఈవెంట్లనే నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు టెక్నోజియాన్‌ను రెండు రోజులకే కుదించారు.

వరంగల్ నిట్‌లో ప్రతీ సంవత్సరం టెక్నోజియాన్‌తో పాటు స్ప్రింగ్ స్ప్రీ (వసంతోత్సవం) కూడా నిర్వహించేవారు. ఇందులో వివిధ రంగాలకు చెందిన కళాకారులతో పెద్ద ఎత్తున సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. విద్యార్థులు కూడా పాల్గొని తమ ప్రతిభను చాటుతారు. ఎలాగో ఏటా స్ప్రింగ్ స్ప్రీ నిర్వహిస్తున్నందు వల్ల టెక్నోజియాన్‌లో సాంస్కృతిక ప్రదర్శనలకు చోటు కల్పించడం లేదు.



టెక్నోజియాన్‌కు హాజరవుతున్న విద్యార్థినులు

భోజన కుతూహలం

# జొన్నకు జై

ఈ మధ్యకాలంలో జొన్నలను తినే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే జొన్నల వల్ల వచ్చే మంచి ఫలితాలను మన పూర్వీకులు ఎప్పుడో గమనించారు. అనేక గ్రంథాల్లో ప్రస్తావించారు.

జొన్నలను మన పూర్వీకులు దేవధాన్యం అనేవారు. ఇవి మానవులకు అమృతోపమానంగా పనిచేస్తాయని భావించేవారు. జొన్నలకు యావనాళం అనే మరో పేరు కూడా ఉంది. సాధారణంగా తెల్లగా కనిపించే గింజలను యవలంటారు. నాళ అనే శబ్దానికి "గొట్టంగా ఉండేవి" అనే అర్థం కూడా ఉంది. దీనితో పాటు పసుపు రంగు అనే మరో అర్థం కూడా ఉంది. వీటన్నింటిని కలిపి చూస్తే- యావనాళం అంటే పచ్చజొన్నలు అని మనం అర్థం చేసుకోవచ్చు.



- జొన్న గింజలను బాగా ఉడకబెట్టి.. దానిలో పాలు లేదా పెరుగు కలిపి తింటారు. కొందరు దీనిలోనే రకరకాల కూరగాయల ముక్కలను వేసి సూపుగా తయారుచేస్తారు.
- జొన్న రొట్టెలు ప్రతి రోజూ తింటే బరువు తగ్గుతారు. జొన్నలను బార్లీని కలిపి పిండిగా చేసి- రొట్టెలు చేసుకుంటే ఎక్కువ పోషకాలు లభిస్తాయి.
- కొన్ని ప్రాంతాల్లో జొన్నలను బీరు తయారీలో కూడా ఉపయోగిస్తారు.

**అనేక రకాలు...**

జొన్నలను మన పూర్వీకులు జాగ్రత్తగా పరిశీలించి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను గ్రంథస్థం చేశారు. జొన్నలు పచ్చగా కాకుండా తెల్లగా కూడా ఉంటాయి. పచ్చజొన్నలు వగరుగా ఉంటే- తెల్ల జొన్నలు తీపిగా ఉంటాయి. అందువల్ల ఆహార పదార్థాల తయారీలో తెల్ల జొన్నలనే ఎక్కువగా ఉపయోగిస్తారు. తెల్ల, పచ్చ జొన్నలతో పాటుగా- మహాయావనాళం అనే వేరే రకం గింజలు ఉంటాయని భోజన కుతూహలంలో పేర్కొన్నారు. ఈ మహాయావనాళాలే మొక్కజొన్నలు. ఇవి మంచి రుచిగా ఉంటాయి. తింటే సంతృప్తిని ఇస్తాయని.. వాతాన్ని తగ్గించి వేడిని పెంచుతాయని భోజన కుతూహలంలో శాస్త్రకారుడు పేర్కొన్నాడు. ఇక వాగ్భటుడు రాసిన అష్టాంగ హృదయం అనే గ్రంథంలో 'జూర్న' అనే చిన్న రకం జొన్నల ప్రస్తావన ఉంది.

**ప్రయోజనాలెన్నో...**

జొన్నల్లో తడి తక్కువగా ఉంటుంది. గరుకు గుణాన్ని కలిగి ఉంటాయి. అందువల్ల ఇవి రక్తంలో పోషకాలను త్వరగా చేరుస్తాయి. ఇక తెల్ల జొన్నలు - బలప్రదంగా ఉంటాయని.. శరీరానికి స్థిరత్వాన్నిస్తాయని..వాతాన్ని, పైత్యాన్ని ,కఫాన్ని కూడా హరిస్తాయని.. స్త్రీపురుషుల శక్తిని పెంపుచేస్తాయని..మొలలు, గాయాలు, గడ్డల్ని తగ్గిస్తాయనీ.. రాజనిఘంటువు అనే వైద్యగ్రంథం పేర్కొంది. ఈ జొన్నల్లో ఉండే ఆహార పీచు పేవుల్ని సంరక్షిస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. జొన్నల్లో కాల్షియం అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే ఎముకలు బలంగా ఉంటాయి. అంతే కాదు. జొన్నలు రక్తంలో కొవ్వును అదుపు చేస్తాయి. అందువల్ల రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోదు.

జీవనశైలి

# ఒత్తిడి వదలడం కోసం...

ఒత్తిడితో ఒళ్లు హూనమవుతుంది. రక్తపోటు పెరగడం మొదలు, నిద్రలేమి వరకూ ఒత్తిడితో ఒరిగే దుష్ప్రభావాలకు అంతంటూ ఉండదు. కాబట్టి దైనందిన ఒత్తిడిని ఎప్పటికప్పుడు వదిలించుకుంటూ ఉండాలి. అందుకోసం కొన్ని నియమాలు పాటించాలి.

- మధ్యాహ్నం నిద్రతో ఒత్తిడి వదులుతుంది. అయితే ఆ కునుకును 10 - 15 నిమిషాలకే పరిమితం చేయాలి
- కొత్త అభిరుచులను అలవరుచుకోవాలి. నచ్చిన సంగీతం వినాలి.
- గ్రీన్ టీ తాగినా ఫలితం ఉంటుంది.
- ఇంటి పనులు చేసుకోవడం వల్ల కూడా ఒత్తిడి తగ్గుతుంది.
- వ్యాయామంతో శరీరం, మనసు తేలికపడి ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయి
- అప్పుడప్పుడూ విహారయాత్రలకు వెళ్తూ ఉండాలి
- కుటుంబసభ్యులు, స్నేహితులతో సరదా సమయాన్ని గడుపుతూ ఉండాలి
- పెంపుడు జంతువుల వల్ల ఒత్తిడి మటుమాయమవుతుంది. ఆ ప్రయత్నమూ చేయొచ్చు.
- యోగా, ధ్యానం లాంటి వ్యాయామాలతో మనసు ప్రశాంతంగా మారుతుంది.



వంటిల్లు



'వీలైనంత బరువు తగ్గాలి. వీలైనంత తక్కువ నూనె వాడాలి. వీలైనంత వరకు అనారోగ్యాన్ని దగ్గరకు రానివ్వకూడదు.' ఈమధ్య కాలంలో ఎక్కువ మంది పాటిస్తున్న సూత్రాలివే. వీటికి అనుగుణంగా తయారు చేసుకోగలిగిన రుచికరమైన కూరలే ఇవి. మీరూ ప్రయత్నించండి.

# ఆరోగ్యానికి అసలైన కూరలు



## బెండకాయ చికెన్ పులుసు



**కావాల్సిన పదార్థాలు:** బెండకాయలు- అరకిలో, చికెన్ కైమా- అరకిలో, చింతపండు గుజ్జు- రెండు స్పూనులు, ఉల్లిపాయ ముక్కలు- అరకప్పు, పచ్చిమిర్చి ముక్కలు- నాలుగు స్పూనులు, నూనె- పావు కప్పు, ఆవాలు- ఒక స్పూను, జీలకర్ర- ఒక స్పూను, మెంతులు- ఒక స్పూను, బెల్లం పొడి- రెండు స్పూనులు, పసుపు- అర స్పూను, అల్లం వెల్లుల్లి పేస్ట్- రెండు స్పూన్లు, ధనియాల పొడి- ఒక స్పూను, జీలకర్ర పొడి- అర స్పూను, కొత్తిమీర (తరిగినది)- రెండు స్పూనులు, నీళ్లు- తగినన్ని

**తయారీ విధానం**

- బెండకాయలను చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. కైమాను ముక్కల్లా చేసుకోవాలి.
- మూకుడులో నూనె పోసి వేడి చేయాలి. ఈ నూనెలో ఆవాలు, జీలకర్ర, మెంతులు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, ఉప్పు వేసి వేయించాలి. ఈ మిశ్రమంలో చికెన్ ముక్కలను కలిపి పైన మూత పెట్టి పది నిమిషాలు మగ్గించాలి.
- ఇలా మగ్గిన మిశ్రమంలో బెండకాయ ముక్కలు, చింతపండు గుజ్జు వేసి తగినన్ని నీళ్లు పోసి.. ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి.
- ఆ తర్వాత ధనియాల పొడి, జీలకర్ర పొడి, కొత్తిమీర వేసి కలయబెట్టి కిందకు దింపేయాలి.

**జాగ్రత్తలు**

- లేత బెండకాయల వల్ల కూర రుచిగా ఉంటుంది.
- చింతపండు గుజ్జును ముందుగా వేస్తే కూర ఉడకదు. అందువల్ల చింతపండు గుజ్జును ఆఖర్లో వేయాలి.

## దోసకాయ డైట్ కూర

**కావాల్సిన పదార్థాలు:** దోసకాయలు- అరకిలో, ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, పచ్చిమిర్చి ముక్కలు- నాలుగు స్పూన్లు, పసుపు- పావు స్పూను, ఎండుమిర్చి- నాలుగు, ధనియాలు- ఒక టేబుల్ స్పూను, మెంతులు- ఒక టేబుల్ స్పూను, జీలకర్ర- ఒక టేబుల్ స్పూను, కారం- ఒక స్పూను, ఆవాలు- ఒక స్పూను, మినపప్పు- ఒకటిన్నర స్పూనులు, శనగపప్పు- ఒకటిన్నర స్పూనులు, ఎండుకొబ్బరి (తురుము)- రెండు స్పూన్లు, కొత్తిమీర (తరిగినది)- రెండు స్పూన్లు, చింతపండు గుజ్జు- రెండు స్పూన్లు, నీళ్లు- తగినన్ని

**తయారీ విధానం**

- దోసకాయల తొక్క తీయకుండా ముక్కలుగా తరగాలి. వాటిని ఒక కుక్కర్‌లో వేసి తగినన్ని నీళ్లు పోయాలి. వాటిలో ఉప్పు, పసుపు, కారం వేసి ఒక విజిల్ వచ్చేదాకా స్టౌ మీద ఉంచి.. ఆ తర్వాత దించేయాలి.
- ఒక మిక్సీ జార్‌లో పచ్చిమిర్చి, ఎండుమిర్చి, ధనియాలు, మెంతులు, జీలకర్ర, ఆవాలు, మినపప్పు, శనగపప్పు, ఎండుకొబ్బరి, చింతపండు గుజ్జు వేసి ముద్దగా చేయాలి.
- కుక్కర్ మూత వచ్చిన తర్వాత దానిలో ఈ ముద్దను, ఉల్లిపాయల ముక్కలను వేసి బాగా కలపి- ఐదు నిమిషాలు స్టౌ మీద పెట్టి ఉడకనివ్వాలి. దింపే ముందు కొత్తిమీర వేయాలి.



**జాగ్రత్తలు**

- ఈ కూరలో నూనెను వాడాల్సిన అవసరం లేదు.
- దీనిలో కూర దోసకాయను మాత్రమే వాడాలి. కీరాదోసను వాడకూడదు.

## పొట్లకాయ ఫ్రై

**కావాల్సిన పదార్థాలు:** లేత పొట్లకాయ- పావు కిలో, ఆవాలు- ఒక స్పూను, జీలకర్ర- ఒక స్పూను, నూనె- రెండు స్పూనులు, కరివేపాకు- ఒక రెబ్బ, వెల్లుల్లి- రెండు పాయలు, ఉల్లిపాయముక్కలు- పావు కప్పు, పచ్చిమిర్చి ముక్కలు- నాలుగు స్పూన్లు, కొబ్బరిపాలు- పావు కప్పు, పసుపు- పావు స్పూను, మసాలా కారం- ఒకటిన్నర స్పూను, కొత్తిమీర- తగినంత, ఉప్పు- తగినంత

**తయారీ విధానం:**

- లేత పొట్లకాయను చక్రాలుగా తరిగి బాగా కడగాలి. వాటిలో ఉప్పు వేసి కుక్కర్‌లో పెట్టి పదినిమిషాలు ఉడకనివ్వాలి.
- ఒక మూకుడులో నూనె వేసి వేడి చేయాలి. దీనిలో ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లి, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు, కరివేపాకు వేసి బాగా దోరగా వేయించాలి. దీనిలో పొట్లకాయ ముక్కలు వేసి వేయించాలి.
- ఆ తర్వాత కొబ్బరిపాలు, మసాలా కారం, కొత్తిమీర వేసి దగ్గర పడనివ్వాలి.

**జాగ్రత్తలు**

- లేత పొట్లకాయలో గింజలు ఎక్కువగా ఉండవు. వీలైనంత వరకు లేత పొట్లకాయతో ఫ్రై చేసుకుంటే మంచిది. ముదురు పొట్లకాయతో కూర చేయాలనుకుంటే- గింజలను తీసేస్తే మంచిది.
- పొట్లకాయ తొక్కపై పొట్టులాంటి పదార్థం ఉంటుంది. అందువల్ల దీనిని ఎక్కువ సేపు నీళ్లలో కడగాలి.







శైలజ ఏచూరి
కైలాస్ కిచెన్

# గృహ హింసపై నిరసన ధ్వని

"గృహ హింస మహిళల సమస్య మాత్రమే కాదు. దాని ప్రభావం సమాజంలోని అనేక స్థాయిల్లో ఉంటుంది. మహిళలు ధైర్యంగా ముందుకు వస్తేనే దీన్ని నిరోధించగలం" అంటారు డాక్టర్ ప్రసన్న గెట్టు. గృహ హింస నిరోధం కోసం, బాధితుల రక్షణ కోసం 23 ఏళ్ళ కిందట ఆమె ఏర్పాటుచేసిన సంస్థ... వేలాది మంది కన్నీళ్ళు తుడుస్తోంది, వాళ్ళ భవిష్యత్తుకు భరోసా ఇస్తోంది.





"అత్తింట్లో ఆరళ్ళతో, భర్తల వేధింపులతో సతమతమయ్యే ఎందరో మహిళలను నేను బాల్యం నుంచి చాలా దగ్గరగా చూశాను. కనీసం వారి వేదన వినేవారు కూడా లేని దుస్థితి నాకు బాధ కలిగించింది. అలాంటి వారికి మేమున్నామని ధైర్యం చెప్పే ఒక వ్యవస్థ మన సమాజంలో అవసరం. నేను చేస్తున్నది అటువంటి ప్రయత్నమే" అని చెబుతారు డాక్టర్ ప్రసన్న గెట్టు. చెన్నైకి చెందిన ఆమె సారథ్యంలో ఏర్పాటైన 'ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ క్రైమ్ ప్రివెన్షన్ అండ్ విక్టిమ్ కేర్' (పిసివిసి) ఎన్నో వేలమంది గృహ హింస బాధితులకు అండగా నిలుస్తోంది. ఈ సంస్థ ఏర్పాటు వెనుక ఎంతో ఆలోచన ఉందంటారు ప్రసన్న. "అది 1998-99 మధ్య కాలం. నేను మద్రాసు విశ్వవిద్యాయంలో క్రిమినాలజీ విభాగంలో పిహెచ్‌డి చేస్తున్నాను. ఒక రోజు మా విభాగం అధిపతి నన్ను పిలిచారు. జపాన్‌లోని 'టోకివా యూనివర్సిటీ'లో... విక్టిమాలజీలో డిప్లమా చేయడానికి ఎంపిక చేసిన ముగ్గురిలో నా పేరు కూడా ఉందని చెప్పారు. నా ఆనందానికి అవధులు లేవు. వెంటనే జపాన్ ప్రయాణానికి సిద్ధమయ్యాను. అక్కడ 'వరల్డ్ సొసైటీ ఆఫ్ విక్టిమాలజీ'లో ఆ కోర్సును అప్పుడే ప్రవేశపెట్టారు. మాదే మొదటి బ్యాచ్. ఆ కోర్సు చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఎందుకంటే క్రిమినాలజీలో భాగంగా అప్పటివరకూ నేరస్తులు, వారి మనస్తత్వాల గురించి మాత్రమే మేము చదువుకున్నాం. కానీ విక్టిమాలజీలో బాధితులు, వాళ్ళ సమస్యలు, వాటికి పరిష్కారాలు లాంటి అంశాలను కూడా అధ్యయనం చేసే అవకాశం కలిగింది" అంటారు ప్రసన్న.

**ఏ సమయంలోనైనా...**

క్షేత్రస్థాయి పరిశీలన కోసం జపాన్‌లో బాధిత సహాయ కేంద్రాలను కూడా తన తోటి విద్యార్థులతో పాటు ప్రసన్న సందర్శించారు. బాధితులతో నేరుగా మాట్లాడారు. "వారు తమ గురించి చెబుతున్నప్పుడు మాకు కన్నీరు ఆగలేదు. వారి కోసం ఒక స్థిరమైన వ్యవస్థ ఉన్న దేశంలోనే ఇలా ఉంటే.. ఇక మన దేశంలో పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్న మమ్మల్ని వెంటాడింది. భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత.. చెన్నైలో బాధిత సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకున్నాం. అలా 2001లో 'పిసివిసి' ప్రారంభమయింది" అని ఆమె గుర్తు చేసుకున్నారు. మొదట్లో బాధితుల కథలను వినడం, వారికి, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, న్యాయసహాయం చెయ్యడం లాంటి కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ సమస్య లోతులకు వెళ్ళే కొద్దీ చెయ్యాల్సింది చాలా ఉందని గ్రహించారు. గృహ హింస భరించలేక ఇంటినుంచి బయటకు వచ్చిన మహిళలకు, ఆపదలో ఉన్న స్త్రీలకు ఆశ్రయాన్ని కల్పించాలని నిర్ణయించుకున్నారు. దానికోసం అమెరికా వెళ్ళి, అక్కడ షెల్టర్ హోమ్స్, కమ్యూనిటీ షెల్టర్లను పరిశీలించారు. వాటి పనితీరును తెలుసుకున్నారు. అలాగే బాధితుల కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటుకు అవసరమైన శిక్షణ కూడా తీసుకున్నారు. ఆ తరువాత 'ధ్వని' అనే హాట్‌లైన్‌ను జాతీయ స్థాయిలో ఏర్పాటు చేశారు. అది రోజంతా పని చేస్తుంది. బాధితులెవరైనా, ఏ సమయంలోనైనా కాల్ చేసి, తమ సమస్యను వివరించవచ్చు. వారికి అవసరమైన సలహాలు ఇవ్వడానికి, ఆశ్రయపరమైన, న్యాయపరమైన, ఉపాధిపరమైన సాయాన్ని సూచించడానికి సామాజిక కార్యకర్తలు, మానసికవేత్తలతో కూడిన ఒక బృందం ఉంటుంది.

**ఈ ధోరణి మారాలి**

"ఇల్లు అనేది ప్రేమను, సంరక్షణను అందించే ప్రదేశం అని మనం నమ్ముతాం. కానీ యాభై శాతానికి పైగా ఏదో రూపంలో గృహహింస జరుగుతోందని జాతీయ రికార్డులు చెబుతున్నాయి. ఇది మహిళలపైనే కాదు, ఈ హింసను చూస్తూ పెరిగే పిల్లల మనస్తత్వాల మీద కూడా ప్రభావం చూపిస్తోంది. పక్కింట్లో ఇలాంటివి జరుగుతున్నాయని తెలిసినా... 'అది వాళ్ళ గొడవ, మనకెందుకు' అని చాలామంది పట్టించుకోరు. అధికారులకు ఫిర్యాదు చేసినా సర్దుకుపోవాలని సలహాలు ఇస్తారు. ఈ ధోరణి మారాలి" అంటారు ప్రసన్న. ఆ దిశగా చైతన్యం తేవడానికి, అవగాహన పెంచడానికి 'పిసివిసి' కృషి చేస్తోంది.

**సంరక్షణ... ఉపాధి కల్పన...**

మరోవైపు గృహహింస బాధితులకు అందించే సేవలను కూడా 'పిసివిసి' విస్తృతం చేసింది. బాధితులకు అత్యవసర సాయం అందించడానికి, దీర్ఘకాలికంగా పునరావాసం కల్పించడానికి తమిళనాడులో 11 కేంద్రాలను నడుపుతోంది. ఎవరైనా హాట్‌లైన్‌కు ఫోన్ చేసిన వెంటనే వారి వివరాలను వాలంటీర్లు నమోదు చేసుకుంటారు. దగ్గరలో ఉన్న కేంద్రానికి వివరాలు పంపిస్తారు. "మాకు రోజూ వందల కాల్స్ వస్తూ ఉంటాయి. వివిధ రాష్ట్రాల్లో పలు సంస్థలు మాతో కలిసి పని చేస్తున్నాయి. ఆ రాష్ట్రాల నుంచి వచ్చే కాల్స్‌ను వాటికి ఫార్వర్డ్ చేస్తాం. మా దగ్గర ఆశ్రయం కోరేవాళ్ళు కూడా ఎక్కువే. వారి సంరక్షణకు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇక గృహ హింస బాధితుల్ని సమాజం చూసే తీరులో కూడా మార్పు రావాలి. హింసను ఏ రూపంలోనూ సహించకూడదు. అందరూ హుందాగా, గౌరవంగా బతకాలన్నదే నా ఆకాంక్ష" అంటున్నారు ప్రసన్న.

మేకప్

# చలిలో చమక్కుమనేలా...

పొడిచర్మం కలిగినవాళ్లకు చలికాలం ఇక్కట్లు తప్పవు. ఈ కాలంలో చర్మం చిట్లి, పొట్టు రేగే గుణం కలిగినవాళ్లు మేకప్ వేసుకునేటప్పుడు కొన్ని మెలకువలు పాటించాలి. అవేంటంటే..

**ఫేస్‌వాష్:** చర్మంలో మిగిలి ఉన్న తేమను వదిలించే సబ్బులకు బదులుగా విటమిన్‌సిని కలిగి ఉండే ఫేస్‌వాష్ ఎంచుకోవాలి. దీంతో చర్మంలోని మలినాలు తొలగడంతో పాటు చర్మపు తేమ భద్రంగా ఉంటుంది. ఫేస్‌వాష్‌తో ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత, అదనపు తేమ కోసం హైడ్రేటింగ్ సీరమ్‌ను పూసుకోవాలి. తర్వాత ప్రైమర్‌ను ముఖానికి అద్దుకుని, ఆ తర్వాతే మేకప్ వేసుకోవడం మొదలుపెట్టాలి.

**ఫౌండేషన్:** తేమను కలిగి ఉండే ఫౌండేషన్‌ను ఎంచుకుంటే, ముఖం మరింత పొడిబారకుండా ఉంటుంది. అలాగే దీన్ని ముఖానికి పూసుకోవడం కోసం తడిపి పిండిన స్పాంజి వాడుకోవాలి. ఫౌండేషన్‌లో కొద్దిగా ఫేసియాల్ నూనెను కలిపి ముఖం మీద సమంగా అద్దుకోవాలి.

**ఉత్పత్తులు:** ఈ కాలంలో పౌడర్ ఆధారిత ఉత్పత్తులకు బదులుగా క్రీమ్ ఆధారిత ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఇవైతే చర్మంలో చక్కగా ఇంకిపోయి, చక్కని మెరుపునూ, మృదుత్వాన్నీ ఇస్తాయి.

**ఐ మేకప్:** కళ్ల చుట్టూ ముడతలు, వలయాలను కనిపించకుండా చేయడం కోసం, వీలైనంత తక్కువ ఫౌండేషన్ అద్దుకోవాలి. దీన్లో కాస్త ముదురు రంగు బ్లష్‌ను కలిపి కనురెప్పల దిగువన అద్దుకుంటే కళ్ల కింద నలుపు చర్మంలో కలిసిపోతుంది. కనురెప్పల పైన వేసుకునే ఐషాడో కూడా లేత రంగులో క్రీమ్ ఆధారితమైనదై ఉండేలా చూసుకోవాలి.



**లిప్‌స్టిక్:** లిప్‌స్టిక్ వేసుకునే ముందు పెదవుల మీద మృత కణాలను తొలగించి, తేమ కోసం అదనపు ఉత్పత్తులు వాడుకోవాలి. ఇలా పెదవులను మృదువుగా మార్చుకున్న తర్వాత లిప్‌స్టిక్ వేసుకుంటే, పెదవులు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. పెదవుల పగుళ్ల కూడా దూరమవుతాయి.

అలంకరణ

# ఇలా అలంకరిస్తే ఆహ్లాదకరం

ఇంట్లో ముందు గది (లివింగ్ రూమ్)లోనే మనం ఎక్కువ సమయం గడుపుతూ ఉంటాం. కాబట్టి ఆ గదిని వీలైనంత సౌకర్యంగా, ఆకర్షణీయంగా, ఆహ్లాదంగా మలుచుకోవాలి. అందుకోసం ఇవిగో ఈ చిట్కాలు పాటించాలి.

టీవి చూడడానికీ, కుటుంబంతో సరదా సమయాన్ని గడపడానికీ, అతిథుతో కాలక్షేపం చేయడానికీ లివింగ్ రూమ్‌నే ఎంచుకుంటాం. వీలైనంత సౌకర్యంగా ఉండేలా మెత్తని సోఫాలూ, తివాచీలను కొంటూ ఉంటాం. అయితే దుకాణాల్లో మనకెంతో నచ్చిన అలంకరణ సామాగ్రి, కర్టెన్లు, తివాచీలు మన ఇంట్లో లివింగ్ రూమ్‌కు నప్పకపోవచ్చు. కొని తెచ్చిన తర్వాత వాటిని వెనక్కి తిరిగి పంపడం వీలు పడదు కాబట్టి అన్ని విధాలా నప్పే సామాగ్రినే ఎంచుకోవాలి. అందుకోసం ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

**కచ్చితమైన కొలతల ఆధారంగా...**

ముందు గది అలంకరణకు పూనుకునే ముందు, ఆ గది వైశాల్యాన్ని లెక్కించాలి. కచ్చితమైన కొలతలు అందుకు తగిన సోఫాలు, కుర్చీలు, కర్టెన్లు, తివాచీలను ఎంచుకోవడానికి తోడ్పడతాయి. చిన్న గదిలో పెద్ద పూల కర్టెన్లు వేలాడదీస్తే, గది మరింత చిన్నదిగా కనిపిస్తుంది. అలాగే సోఫాలు, తివాచీలు ఖరీదైనవి. కాబట్టి వాటిని కొనే ముందు గది కొలతలు తీసుకోవాలి. సోఫాను ఎక్కడ ఉంచాలో, తివాచీని ఎక్కడ పరచాలో, టివిని ఏ గోడకు, ఎంత ఎత్తులో బిగించాలో ముందుగానే అంచనా వేసుకోవాలి.

**ఆలోచనలకు తగ్గట్టు...**

కిటికీ దగ్గర కూర్చుని పుస్తకం చదువుకోవడం, సోఫాలో జారగిలబడి టివి చూడడం, తివాచీ మీద కుషన్లు వేసుకుని సేద తీరడం లాంటివి మీకిష్టమైన పనులైతే గది అలంకరణ అందుకు తగ్గట్టుగానే ఉండాలి. పిల్లలున్న ఇల్లైతే గాజు టేబుళ్ల లాంటి లేకుండా చూసుకోవాలి. గోడలోకి ఇమిడి ఉండే అల్మారాలైతే స్థలం కలిసొస్తుందనే విషయం గుర్తుపెట్టుకోవాలి. అలాగే గదిలో అమర్చే సోఫా తయారీకి ఉపయోగించే మెటీరియల్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా గది శుభ్రం చేయడానికి వీలుగా, ఇరుకు లేకుండా ఉండేలా చూసుకోవాలి.



**గోడల అలంకరణ ఇలా...**


క్యాలండర్ల కాలం చెల్లిపోయింది. అలాగే ఫొటో ఫ్రేములకు కూడా! ఇప్పుడంతా కళాత్మకతకే పెద్ద పీట. కాబట్టి ఆహ్లాదకరమైన పెయింటింగ్‌లు, మ్యూరల్స్‌కు చోటు కల్పించాలి. డూడ్లింగ్ తాజా ట్రెండ్ కాబట్టి వీలైతే ఒక గోడను అందుకే పరిమితం చేయాలి. గోడలకు వేసే రంగులు లేతగానే ఉండాలి. ఎరుపు, గోధుమ, నీలం లాంటి రంగులకు బదులుగా తెలుపు, లేత గులాబీ రంగులను ఎంచుకోవాలి. ఇలా కాస్త లోతుగా ఆలోచించి, ముందస్తు జాగ్రత్తలతో మసలుకుంటే లివింగ్ రూమ్‌లో ఆ జీవం ఉట్టిపడుతుంది.










ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

శనివారం • 9 నవంబరు 2024

cinema@andhrajyothy.com



## అరకులో వెంకీ

వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఈ సినిమా చిత్రీకరణ ముగింపు దశలో ఉంది. శుక్రవారం ఆఖరి షెడ్యూల్‌ను అరకులో యూనిట్ ప్రారంభించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన వీడియోలో విద్యార్థులు వెంకటేశ్‌కు స్వాగతం చెబుతున్న సన్నివేశం ఆకట్టుకుంది. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ కథానాయికలు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి.




## ఒకే సంస్థలో మూడు సినిమాలు



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మరో రెండు చిత్రాలకు పచ్చజెండా ఊపారు. ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ బేనర్‌లో ఆయన ఈ రెండు సినిమాలను చేయబోతున్నారు. ప్రస్తుతం ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'సలార్ 2' చిత్రం కూడా ఇదే బేనర్‌లో తెరకెక్కుతోంది. ఈ సినిమాతో కలిపితే ప్రభాస్-హోంబలే కాంబినేషన్‌లో మొత్తం మూడు చిత్రాలు రానున్నాయి. "సలార్ 2' పూర్తవ్వగానే ఈ రెండు సినిమాలు సెట్స్‌పైకి వెళ్లనున్నాయి. హోంబలే అధినేత విజయ్ కిరగందూర్ మాట్లాడుతూ 'ప్రభాస్‌తో కలసి మరపురాని చిత్రాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాం. 'సలార్ 2' షూటింగ్ మొదలైంది. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఈ సినిమాలు ఉండబోతున్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులకు వినోదం పంచే దిశగా మా నిర్మాణ సంస్థ వేస్తున్న గొప్ప ముందడుగు ఇది' అని పేర్కొన్నారు. ప్రస్తుతం హోంబలే సంస్థ 'సలార్ 2', 'కాంతార 2', 'కేజీఎఫ్ 3' చిత్రాలను నిర్మిస్తోంది. ప్రభాస్ ప్రస్తుతం 'రాజాసాబ్', 'స్పిరిట్', 'యానిమల్ పార్క్'తో పాటు హనూ రాఘవపూడి దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు.

## టెర్రిఫిక్ రోల్‌లో



క్రిష్ దర్శకత్వంలో అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'ఘాటీ'. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మాతలు. అనుష్క ఫెరోషియస్ అవతార్‌ని పరిచయం చేస్తూ మేకర్స్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఆదివాసి ప్రజలు తమ వస్తువులన్నింటినీ తీసుకుని కొండపైకి నడుస్తున్నప్పుడు గ్లింప్స్ మొదలవుతుంది. కార్లలో కొంత మంది వ్యక్తులు ఘాట్ రోడ్లపైకి వస్తారు. తన శరీరం అంతటా ట్రైబల్ టాటూస్‌తో, బస్ వైపు కొడవలితో నడుచుకుంటూ వచ్చిన అనుష్క స్టన్నింగ్ ఎంట్రీ ఆసక్తిని రేపుతోంది. అనుష్క బస్సులోకి ఎంటరై ఒక వ్యక్తి మెడను నరికి అద్దంలో తనను తాను చూసుకోవడం టెర్రిఫిక్‌గా ఉంది. అతని మెడని నరికిన తర్వాత రక్తం చిందే తలని పట్టుకొని నడుస్తూ, పొగ తాగుతున్నట్లు కనిపించిన విజువల్స్ అదిరిపోయాయి. ఈ పాన్ ఇండియా మూవీ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

## లెక్కలు మారిపోవడానికి ఒక్క శుక్రవారం చాలు

దిల్ రాజు



'ఈ సారి దీపావళి బరిలో నిలిచిన సినిమాలు గట్టి పోటీ ఇచ్చినా వాటన్నింటినీ తట్టుకొని 'క' సినిమా ఘన విజయాన్ని అందుకొంది. ఈ రోజు ఈ సినిమా సక్సెస్ మీట్‌లో పాలు పంచుకొంటున్నందుకు ఆనందంగా ఉంది' అని నిర్మాత దిల్ రాజు అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన 'క' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శుక్రవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'పెద్ద సినిమాల మధ్యన మీ సినిమా ఎందుకు అన్నారు. 'మంచి సినిమా అని మేం చెప్పినా ఎవ్వరూ నమ్మలేదు. కానీ ప్రేక్షకులు సినిమా చూసి పెద్ద విజయాన్ని అందించారు. వారందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఏ హీరోనూ అతని మార్కెట్‌ను బట్టి అంచనా వేయవద్దు. ఆ లెక్కలన్నీ మారిపోవడానికి ఒక్క శుక్రవారం చాలు' అని స్పందించారు. మంచి సినిమాను చేశామనే సంతృప్తిని 'క' మాకు విగిల్చింది అని నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి అన్నారు. 'క' సినిమా క్లైమాక్స్‌ను నేను ఊహించలేకపోయాను. ఇటీవల కాలంలో వచ్చిన బెస్ట్ స్క్రీన్‌ప్లే మూవీ ఇది' అని నిర్మాత బన్నీవాస్ అభినందించారు. నెగెటివ్ ప్రచారాన్ని తట్టుకొని 'క' లాంటి సూపర్‌హిట్‌ను ఇచ్చిన కిరణ్‌ను అభినందిస్తున్నాను అన్నారు సందీప్ కిషన్.

## నా అనారోగ్య సమస్య విని భయపడ్డా

శివ రాజ్‌కుమార్



'నా అనారోగ్య సమస్య గురించి విని మొదట భయపడ్డా. కానీ దాన్ని ధైర్యంగా ఎదుర్కొనేలా ఆత్మవిశ్వాసం పొందా. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నా. ఇప్పుడంతా బాగానే ఉంది' అని చెప్పారు కన్నడ నటుడు, 60 ఏళ్ల శివ రాజ్‌కుమార్. తను నటించిన 'భైరతి రంగల్' చిత్రం ఈ నెల 15న విడుదలవుతున్న సందర్భంగా ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తను అనారోగ్యంతో బాధపడుతున్నట్లు శివ రాజ్‌కుమార్ చెప్పారు. అయితే తన అనారోగ్య సమస్య ఏమిటో ఆయన వెల్లడించలేదు కానీ 'ఇప్పటికి నాలుగు సెషన్స్ ట్రీట్‌మెంట్ పూర్తయింది. అమెరికా వెళ్లి ఆపరేషన్ చేయించుకుంటున్నాను. ఆ తర్వాత నెల రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటా. నా అనారోగ్యం గురించి అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని ఆ ఇంటర్వ్యూలో తెలిపారు శివ రాజ్‌కుమార్.

## వాకిలి పద్మ



భీముడి మనవడు, ఘటోత్కచుడి కుమారుడు బార్బరిక్(బార్బరికుడు) పాత్ర ఆధారంగా 'త్రిబాణధారి బార్బరిక్' సినిమా మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో రాబోతోంది. విజయపాల్ రెడ్డి ఆదిదల నిర్మాత. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేయడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా ఈ మూవీ నుంచి మరో అప్డేట్ వదిలారు. ఉదయభాను పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి మరింత హైప్ పెంచారు. మూవీలో వాకిలి పద్మ అనే పాత్రను ఆమె పోషించారు. పోస్టర్‌లో ఉదయభాను యాటిట్యూడ్, కూర్చున్న తీరు కొత్తగా ఉన్నాయి.

## సూర్యతో సినిమా మిస్సయ్యా

రాజమౌళి



"రాజమౌళితో సినిమా చేసే అవకాశం వచ్చినా విస్సయ్యాను' అని ఓ సందర్భంలో సూర్య చెప్పాడు. కానీ ఆయనతో సినిమా చేసే అవకాశాన్ని నేనే మిస్సయ్యాను. ఆయన నటనంటే నాకు చాలా ఇష్టం. సూర్య కథానాయకుడిగా నటించిన 'కంగువ' చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఇలాంటి సినిమాను థియేటర్లలోనే చూడాలి. అప్పుడే ఆ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను పొందుతాం' అని దర్శకుడు రాజమౌళి అన్నారు. సూర్య కథానాయకుడిగా శివ దర్శకత్వంలో తెరకెక్కిన 'కంగువ' చిత్రం ఈనెల 14న విడుదలవుతోంది. చిత్రబృందం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజమౌళి మాట్లాడుతూ 'తెలుగు సినిమా మార్కెట్ ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే నా ఆలోచనకు స్ఫూర్తినిచ్చిన హీరో సూర్య. ఆయన 'గజిని' సినిమాను తెలుగులో ప్రమోషన్ చేసిన తీరును ఇప్పటికీ నా నిర్మాతలకు, హీరోలకు ఓ కేస్ స్టడీలా చెబుతుంటాను. అలా పాన్ ఇండియా సినిమాలు చేయాలనే ఆలోచనకు సూర్య కారణమయ్యారు' అని ప్రశంసించారు. సూర్య మాట్లాడుతూ "కంగువ' లాంటి స్పెషల్ మూవీని ఇచ్చినందుకు శివకు థాంక్స్. ఇది ఎవర్‌గ్రీన్ మూవీగా నిలవబోతోంది. నాకు మర్చిపోలేని అనుభూతిని ఇచ్చిన సినిమా. దీనికోసం రెండేళ్లు కష్టపడ్డా. ప్రతి రోజూ ఎగ్జైటింగ్‌గా వర్క్ చేశాం. సెట్‌లో మూడు వేల మందిని సమన్వయం చేసుకుంటూ శివ పని చేయించుకున్న తీరు అద్భుతం. థియేటర్లలో మరో దీపావళిని సెలబ్రేట్ చేసుకుందాం' అన్నారు. శివ మాట్లాడుతూ "కంగువ' చిత్రం దృశ్యకావ్యంలా ఉంటుంది. గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. తెలుగు ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి" అని కోరారు.

కొత్తగా..

## విడుదలకు సిద్ధం



తెలుగుతో పాటు ఐదు భాషల్లో దర్శక నిర్మాత మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన చిత్రం 'M4M '. ప్రధాన నటిగా జో శర్మ, ప్రధాన నటుడిగా సంబీత్ ఆచార్య నటించారు. విడుదలకు సిద్ధంగా ఉన్న మూవీ పోస్టర్‌ను చిత్రయూనిట్ విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో ఒకే ఒక కిల్లర్ క్యారెక్టర్ కనిపిస్తుంది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ.. 'కంటెంట్ ఈజ్ ద కింగ్ అనే ప్రిన్సిపల్‌తో మూవీని తెరకెక్కించాం' అన్నారు.

## కేసీఆర్ కథేమిటి?



గరుడవేగ అంజి దర్శకత్వంలో రాకింగ్ రాకేశ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం కేశవ చంద్ర రమావత్(కేసీఆర్). అనన్య కృష్ణన్ కథానాయిక. లంబాడీ వర్గానికి చెందిన యువకుడి నిజ జీవిత స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇటీవల రిలీజ్ అయిన ట్రైలర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రం ఈనెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మూవీ రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని 'బలగం' దర్శకుడు వేణు లాంచ్ చేశారు.

## ప్రేక్షకులను మెప్పించే పెళ్లి కథ



వివాహం నేపథ్యంలో పూర్తిగా కొత్త నటీనటులతో రూపొందుతున్న చిత్రం 'లగ్గం టైమ్'. ప్రజోత్ కె వెన్నం దర్శకత్వంలో కె. హిమబిందు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు సాగర్ కె. చంద్ర విడుదల చేశారు. ఇంటిల్లిపాదిని అలరించేలా సినిమా ఉండబోతోందని నిర్మాణ సంస్థ ట్వంటీయత్ సెంచరీ ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలిపింది. ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుందని దర్శకుడు చెప్పారు. రాజేశ్ మేరు, నవ్య చిట్యాల హీరో హీరోయిన్లు.

# సంజూ.. అంతా తానై

47 బంతుల్లో మెరుపు శతకం
భారత్ ఘన విజయం
దక్షిణాఫ్రికాతో తొలి టీ20

**డర్బన్:** టీ20 ఫార్మాట్‌లో సంజూ శాంసన్ (50 బంతుల్లో 7 ఫోర్లు, 10 సిక్సర్లతో 107) తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. దక్షిణాఫ్రికా బౌన్సీ పిచ్‌లపై సైతం ఎలాంటి బెదురు లేకుండా మెరుపు శతకంతో మెరిశాడు. అతడికి తోడు స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి (3/25), రవి బిష్ణోయ్ (3/28) సుడులు తిరిగే బంతులతో ప్రత్యర్థిని స్వల్ప స్కోరుకే కట్టడి చేశారు. దీంతో శుక్రవారం సఫారీలతో జరిగిన తొలి టీ20లో భారత్ 61 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆదివారం రెండో మ్యాచ్ జరుగుతుంది. మరోవైపు శాంసన్‌కిది వరుసగా రెండో టీ20 సెంచరీ కావడం విశేషం. తన చివరి మ్యాచ్ (బంగ్లాతో)లోనూ అతడు మూడంకెల స్కోరు సాధించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 202 పరుగులు చేసింది. తిలక్ వర్మ (18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 33), సూర్యకుమార్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 21) రాణించారు. పేసర్ కొట్జీకి మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. క్లాసెన్ (25), కొట్జీ (23), రికెల్టన్ (21) మాత్రమే రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా శాంసన్ నిలిచాడు.

**హోరెత్తించాడు..:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ సంజూ శాంసన్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. బౌలర్ ఎవరైనా హిట్టింగ్‌ను మాత్రం ఆపలేదు. భారీ షాట్లతో కింగ్స్‌మీడ్‌ను హోరెత్తిస్తూ అంతా తానై పరుగుల వరద పారించాడు. కానీ తను వెనుదిరిగాక మాత్రం భారత్ తడబడింది. చివరి ఆరు ఓవర్లలో సఫారీ బౌలర్లు 40 పరుగులే ఇచ్చి ఆరు వికెట్లు తీయగా జట్టు ఆశించిన భారీ స్కోరు సాధించలేకపోయింది. మూడో ఓవర్‌లో శాంసన్ వరుసగా 4,6తో ఎదురుదాడికి తెర లేపాడు. అటు మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (7) తన పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ నాలుగో ఓవర్‌లోనే వెనుదిరిగాడు. కెప్టెన్ సూర్య వచ్చీరాగానే 4,6తో ఆకట్టుకున్నాడు. అలాగే ఐదో ఓవర్‌లో శాంసన్ 4,6 సూర్య 4తో 15 రన్స్ వచ్చాయి. ఇక ఆరో ఓవర్‌లో సంజూ మరో సిక్సర్‌తో పవర్‌ప్లేలో జట్టు 56/1 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత కూడా పరుగుల వేగం మరింత పెరిగిందే కానీ తగ్గలేదు. లెగ్ స్పిన్నర్ పీటర్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో 27 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే తొమ్మిదో ఓవర్‌లో సూర్య అవుట్ కావడంతో రెండో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత 'బర్త్‌డే బాయ్' తిలక్ వర్మ అండతో శాంసన్ మరింతగా చెలరేగాడు. ఇద్దరూ పోటాపోటీ బౌండరీలతో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. అటు 13వ ఓవర్‌లో సంజూ 4,4,6 బాదగా, తర్వాతి ఓవర్‌లోనే తిలక్ 4,6తో చెలరేగాడు. ఇక 47 బంతుల్లోనే శాంసన్ వరుసగా రెండో సెంచరీతో సంబరాలు చేసుకున్నాడు. అయితే 15వ ఓవర్‌లో ఫోర్ బాదిన వెంటనే తిలక్‌ను కేశవ్ అవుట్ చేయగా.. 16వ ఓవర్‌లో సిక్సర్ బాదిన వెంటనే శాంసన్‌ను పీటర్ పెవిలియన్‌కు చేర్చడంతో మూడో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత పేసర్ కొట్జీ కట్టడి చేస్తూ హార్దిక్ (2), రింకూ (11) వికెట్లను తీయడంతో భారత్ పరుగుల వేగం తగ్గింది. ఆఖరి ఓవర్‌లో మరో రెండు వికెట్లు కోల్పోయిన జట్టు 200 పరుగులు దాటగలిగింది.

**దెబ్బతీసిన స్పిన్నర్లు:** భారీ ఛేదనలో ఆరంభం నుంచే దక్షిణాఫ్రికా వెనుకబడింది. తొలి ఓవర్‌లోనే కెప్టెన్ మార్‌క్రమ్ (8)ను పేసర్ అర్ష్‌దీప్ అవుట్ చేయగా, ఏ దశలోనూ లక్ష్యం వైపు సాగలేదు. స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, బిష్ణోయ్ తమ మ్యాజిక్ బంతులతో మిడిలార్డర్‌ను దెబ్బతీశారు. ఓపెనర్ రికెల్టన్, స్టబ్స్ (11) సైతం పవర్‌ప్లేలోనే వెనుదిరగడంతో కష్టాలు మరింత పెరిగాయి. అయితే క్లాసెన్, మిల్లర్ (18) క్రీజులో ఉండడంతో గట్టి పోటీ ఇస్తారనుకున్నా వారి నుంచి మెరుపులే కరువయ్యాయి. ఈ ఇద్దరినీ వరుణ్ 12వ ఓవర్‌లో అవుట్ చేయగా.. తర్వాతి ఓవర్‌లోనే బిష్ణోయ్ మరో రెండు వికెట్లు తీశాడు. దీంతో 93/7 స్కోరుతో సౌతాఫ్రికా విజయానికి అందనంత దూరంలో నిలిచింది. టెయిలెండర్లలో కొట్జీ సిక్సర్లతో చెలరేగినా 17వ ఓవర్‌లో సూర్య సూపర్ త్రోతో రనౌటయ్యాడు. అప్పటికి 18 బంతుల్లో 68 పరుగులు చేయాల్సి ఉండడంతో సఫారీలకు పరాభవం తప్పలేదు.



సంజూ శాంసన్ (50 బంతుల్లో 107)

### స్కోరుబోర్డు

**భారత్:** శాంసన్ (సి) స్టబ్స్ (బి) పీటర్ 107; అభిషేక్ (సి) మార్‌క్రమ్ (బి) కొట్జీ 7; సూర్యకుమార్ (సి) సిమెలానె (బి) క్రుగెర్ 21; తిలక్ వర్మ (సి) జాన్సెన్ (బి) కేశవ్ 33; హార్దిక్ (సి) జాన్సెన్ (బి) కొట్జీ 2; రింకూ (సి) క్లాసెన్ (బి) కొట్జీ 11; అక్షర్ (సి) స్టబ్స్ (బి) జాన్సెన్ 7; అర్ష్‌దీప్ (నాటౌట్) 5; బిష్ణోయ్ (రనౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 202/8. వికెట్ల పతనం:** 1-24, 2-90, 3-167, 4-175, 5-181, 6-194, 7-199, 8-202. **బౌలింగ్:** జాన్సెన్ 4-0-24-1; మార్‌క్రమ్ 1-0-10-0; కేశవ్ 4-0-34-1; కొట్జీ 4-0-37-3; పీటర్ 3-0-35-1; క్రుగెర్ 2-0-35-1; సిమెలానె 2-0-27-0.

**దక్షిణాఫ్రికా:** మార్‌క్రమ్ (సి) సంజూ (బి) అర్ష్‌దీప్ 8, రికెల్టన్ (సి) తిలక్ (బి) వరుణ్ 21; స్టబ్స్ (సి) సూర్య (బి) ఆవేశ్ 11; క్లాసెన్ (సి) అక్షర్ (బి) వరుణ్ 25; మిల్లర్ (సి) ఆవేశ్ (బి) వరుణ్ 18; క్రూగర్ (సి) హార్దిక్ (బి) రవి 1; జాన్సెన్ (సి) హార్దిక్ (బి) రవి 12; సిమెలానె (ఎల్బీ) రవి 6; కొట్జీ (రనౌట్) 23; కేశవ్ (బి) ఆవేశ్ 5; పీటర్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 17.5 ఓవర్లలో 141 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-8; 2-30; 3-44; 4-86; 5-87; 6-87; 7-93; 8-114; 9-135; 10-141; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-25-1; ఆవేశ్ 2.5-0-28-2; హార్దిక్ 3-0-27-0; వరుణ్ చక్రవర్తి 4-0-25-3; రవి బిష్ణోయ్ 4-0-28-3; అక్షర్ 1-0-8-0.

**1**

భారత్ తరఫున టీ20ల్లో వరుసగా రెండు శతకాలు సాధించిన బ్యాటర్‌గా సంజూ శాంసన్. ఓవరాల్‌గా గుస్తావ్ మెకాన్ (ఫ్రాన్స్), ఫిల్ సాల్ట్, రోసో కూడా ఈ ఫీట్ సాధించారు.

భారత్ తరఫున ఓ టీ20 మ్యాచ్‌లో ఎక్కువ సిక్సర్లు (10) బాదిన ప్లేయర్‌గా రోహిత్‌తో సమంగా నిలిచిన శాంసన్.

## రాహుల్.. అదే తీరు

ఓటమిదిశగా భారత్ 'ఎ'
రెండో ఇన్నింగ్స్ 73/5



రాహుల్ (10)

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా 'ఎ'తో జరుగుతున్న రెండో అనధికార టెస్టులో భారత్ 'ఎ' టాపార్డర్ వైఫల్యం కొనసాగుతోంది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (10) మరోసారి నిరాశపర్చగా.. భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో 73 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం 11 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉండగా.. క్రీజులో జురెల్ (19 బ్యాటింగ్), నితీశ్ (9 బ్యాటింగ్) ఉన్నారు. ఈ జోడీ మినహా స్పెషలిస్ట్ బ్యాటర్లు లేకపోవడంతో జట్టుకు మరో ఓటమి ఖాయంగా కనిపిస్తోంది. అంతకుముందు ఆసీస్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 223 వద్ద ఆలౌటై 62 పరుగుల ఆధిక్యాన్ని అందుకుంది. హారిస్ (74), రోకిచోలి (35), పీర్సన్ (30) రాణించారు. ప్రసిద్ధ్‌కు నాలుగు, ముకేశ్‌కు మూడు, ఖలీల్‌కు రెండు వికెట్లు దక్కాయి. భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 161 పరుగులు చేసింది.

## సెమీస్‌కు కిరణ్ జార్జ్

**ఇక్సాన్ సిటీ (కొరియా):** భారత యువ షట్లర్ కిరణ్ జార్జ్ కొరియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నాడు. 41వ ర్యాంకరైన కిరణ్ శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 21-14, 21-16తో జపాన్‌కు చెందిన టకుమా ఒబయాషిని కంగుతినిపించాడు. సెమీస్‌లో టాప్‌సీడ్, ప్రపంచ ఐదో ర్యాంకర్ కున్లావత్ (థాయ్‌లాండ్)తో కిరణ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

## శిక్షణ కోసం దక్షిణాఫ్రికాకు నీరజ్

**న్యూఢిల్లీ:** స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మెరుగైన సాధన కోసం ఈనెలాఖరులో దక్షిణాఫ్రికా వెళ్లనున్నాడు. వచ్చే ఏడాది పోటీల కోసం దక్షిణాఫ్రికాలోని పాచెఫ్‌స్ట్రూమ్‌లో నీరజ్ 31 రోజుల పాటు శిక్షణ తీసుకోనున్నాడు. దక్షిణాఫ్రికాలో ఉన్నన్ని రోజులు నీరజ్‌తో పాటు అతని ఫిజియోథెరపిస్ట్‌కయ్యే ఖర్చులన్నీ భరించనున్నట్టు క్రీడామంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీరజ్.. టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కూడా పాచెఫ్‌స్ట్రూమ్‌లో శిక్షణ తీసుకున్నాడు.

## బోథమ్ బచ్‌గయా!

చేపల వేటకు వెళ్లి.. మొసలి బారిన పడి



**సిడ్నీ:** ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండర్ ఇయాన్ బోథమ్ త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మెర్వ్ హ్యూస్ కాపాడకుంటే నదిలో మునిగి మొసళ్లకు ఆహారమయ్యేవాడట. ఈ విషయాన్ని స్వయంగా బోథమ్ వెల్లడించాడు. వివరాల్లోకెళితే.. ఇటీవల హ్యూస్‌తో కలిసి బోథమ్ పడవలో నాలుగు రోజుల ఫిషింగ్ ట్రిప్ కోసమని నార్త్ ఆస్ట్రేలియా ప్రాంతంలోని మోయ్లే నదికి వెళ్లాడు. అక్కడ ఇద్దరూ కలిసి సరదాగా చేపలు పడుతుండగా.. బోథమ్ పొరపాటున కాలు జారి పడవలో నుంచి నీళ్లలో పడిపోయాడు. భారీ షార్క్‌లు, మొసళ్లుండే ఆ నదిలో నుంచి ఓ భారీ మొసలి వచ్చి బోథమ్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించింది. వెంటనే అప్రమత్తమైన హ్యూస్ అమాంతం బోథమ్‌ను పట్టుకొని పడవలోకి లాగాడు. కానీ, అప్పటికే మొసలి దంతాలతో గాయపరచడంతో బోథమ్‌కు వీపు పక్కభాగం, మరికొన్ని చోట్ల గాయాలయ్యాయి.

## అగ్రస్థానంలో అర్జున్

**చెన్నై:** ప్రపంచ నెంబర్ 2 ఇరిగేసి అర్జున్ చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ నాలుగో రౌండ్‌లో అర్జున్ విజయం సాధించాడు. ఇరాన్ జీఎం అమీన్‌తో తలపడిన అర్జున్ 52వ ఎత్తులో ప్రత్యర్థికి చెక్ చెప్పాడు. ప్రస్తుతానికి అర్జున్ 3.5 పాయింట్లతో టాప్‌లో, అమెరికా జీఎం అరోనియన్ 2.5 పాయింట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. ఇక చెన్నై చాలెంజర్స్ టోర్నీలో ద్రోణవల్లి హారిక మూడో ఓటమిని చవి చూసింది. భారత జీఎం కార్తికేయన్ మురళీతో తలపడిన హారిక 43వ ఎత్తులో పరాజయం పాలైంది.

**హంపికి ఐదో స్థానం**

**షైంకెంట్:** ఫిడే మహిళల గ్రాండ్ ప్రీలో తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఐదో స్థానంతో నిరాశపర్చింది. ఆఖరి రౌండ్‌ను డ్రాగా ముగించిన రష్యా జీఎం అలెగ్జాండ్రా గోర్యాంచ్‌కినా 7 పాయింట్లతో విజేతగా నిలవగా, చైనా జీఎం టాన్ ఝూంగీ ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. శుక్రవారం ముగిసిన ఆఖరిదైన తొమ్మిదో రౌండ్‌ను హంపి డ్రా చేసుకుంది.

## రాజస్థాన్ 425 ఆలౌట్

హైదరాబాద్‌తో రంజీ

**జైపూర్:** రాజస్థాన్ బ్యాటర్లు మహిపాల్ లోమ్రోర్ (150 బంతుల్లో 111), శుభం గర్వాల్ (107 బంతుల్లో 108) మూడో రోజు ఆటలో శతకాల మోత మోగించారు. మూడో రోజైన శుక్రవారం ఓవర్‌నైట్ స్కోరు 117/1 తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను కొనసాగించిన రాజస్థాన్ 425 వద్ద ఆలౌటై 15 పరుగుల ఆధిక్యాన్ని అందుకుంది. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ (3/104) మూడు, మిలింద్, రోహిత్ రాయుడు చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన హైదరాబాద్ ఆట ముగిసేసరికి 7 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 36 పరుగులు చేసింది. క్రీజులో ఓపెనర్లు అభిరథ్ రెడ్డి (28), తన్మయ్ అగర్వాల్ (8) ఉన్నారు.

## చెన్నై.. సూపర్

కాన్పూర్.. చెత్త

భారత్‌లో పిచ్‌లపై ఐసీసీ రేటింగ్

**న్యూఢిల్లీ:** ఇటీవల స్వదేశంలో భారత జట్టు ఆడిన టెస్టు సిరీస్‌లకు ఆతిథ్యమిచ్చిన పిచ్‌లకు ఐసీసీ రేటింగ్‌లను ప్రకటించింది. బంగ్లాతో తొలి టెస్టు జరిగిన చెన్నైలోని చెపాక్ స్టేడియం పిచ్ చాలా బాగుందని పేర్కొన్న ఐసీసీ.. రెండో టెస్టు జరిగిన కాన్పూర్ మైదానం అవుట్‌ఫీల్డ్‌పై మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇక, కివీస్‌తో టెస్టులకు వాడిన మూడు పిచ్‌లపై ఐసీసీ సంతృప్తి వ్యక్తం చేసింది. ఇక, బంగ్లాతో జరిగిన మూడు టీ20 మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్, గ్వాలియర్, ఢిల్లీ మైదానాల పిచ్‌లు బాగున్నాయని ఐసీసీ వెల్లడించింది.

## పట్నా ఫటాఫట్

జైపూర్‌పై విజయం

**హైదరాబాద్:** ప్రొ కబడ్డీ లీగ్‌లో పట్నా పైరేట్స్ జట్టు నాలుగో విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం ఇక్కడ జరిగిన పోరులో పట్నా 43-41తో జైపూర్ పింక్‌పాంథర్స్‌ను ఓడించింది. ఆరంభంలో దూకుడుగా ఆడిన పింక్‌పాంథర్స్ ఆఖర్లో పట్నా ఆటగాళ్ల అనూహ్య విజృంభణకు చేతులెత్తేసింది. పట్నా తరఫున అయాన్ 14, దేవాంక్ 11 పాయింట్లతో సత్తాచాటారు. జైపూర్‌లో అర్జున్ దేశ్వాల్ 20 పాయింట్లతో చెలరేగినా ఫలితం లేకపోయింది. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 39-26తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది.

## ఆసీస్‌పై పాక్ ఘనవిజయం

**అడిలైడ్:** ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఫలితంగా సిరీస్ 1-1తో సమం కాగా, ఆఖరి మ్యాచ్ ఆదివారం జరుగుతుంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌ను పేసర్లు హరీస్ రౌఫ్ (5/29), షహీన్ అఫ్రీది (3/26) దెబ్బతీశారు. దీంతో ఆతిథ్య జట్టు 35 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. స్వల్ప ఛేదనలో పాక్ 26.3 ఓవర్లలో 169/1 స్కోరుతో నెగ్గింది. సయిామ్ అయూబ్ (82), అబ్దుల్లా షఫీక్ (64 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించి తొలి వికెట్‌కు 137 పరుగులు జత చేశారు. అలాగే అడిలైడ్‌లో పాక్ 28 ఏళ్ల తర్వాత ఓ వన్డే మ్యాచ్‌ను గెలవడం గమనార్హం.

# బిజినెస్

# ఎస్‌బీఐ భళా

## క్యూ2లో 23 శాతం వృద్ధితో రూ.19,782 కోట్లకు లాభం

**ముంబై:** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) బ్యాంక్ రూ.19,782 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి ఆర్జించిన రూ.16,099 కోట్ల లాభంతో పోలిస్తే 23 శాతం వృద్ధి కనబరిచింది. వడ్డీయేతర ఆదాయం పుంజుకోవడం, ట్రెజరీ కార్యకలాపాల ద్వారా లాభాలు పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. కాగా, ఈ క్యూ2లో ఎస్‌బీఐ స్టాండ్‌ఎలోన్ లాభం రూ.18,331 కోట్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో నమోదైన రూ.14,330 కోట్లు, ఈ జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో గడించిన రూ.17,035 కోట్ల స్టాండ్‌ఎలోన్ లాభం కంటే అధికమిది. బ్యాంక్ కొత్త చైర్మన్‌గా తెలంగాణకు చెందిన చల్లా శ్రీనివాసులు శెట్టి బాధ్యతలు చేపట్టిన ఈ సెప్టెంబరు త్రైమాసికంలో ఎస్‌బీఐ మొత్తం ఆదాయం రూ.1.29 లక్షల కోట్లకు ఎగబాకింది. 2023-24 క్యూ2లో రెవెన్యూ రూ.1.12 లక్షల కోట్లుగా నమోదైంది. అయితే, మొత్తం వ్యయాలు సైతం రూ.92,752 కోట్ల స్థాయి నుంచి ఈ క్యూ2లో రూ.99,847 కోట్లకు పెరిగాయి.

- ఈ జూలై-సెప్టెంబరు కాలానికి ఎస్‌బీఐ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 5.37 శాతం పెరుగుదలతో రూ.41,620 కోట్లుగా నమోదైంది. ఈ సమయంలో బ్యాంక్ రుణాల్లో 15 శాతం వృద్ధి నమోదైనప్పటికీ, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 0.15 శాతం తగ్గి 3.14 శాతానికి జారుకోవడం వడ్డీ ఆదాయ వృద్ధిని పరిమితం చేసింది.
- వడ్డీయేతర ఆదాయం 42 శాతం వృద్ధితో రూ.15,271 కోట్లకు పుంజుకుంది. ఫారెక్స్, ట్రెజరీ లాభాలు పెరగడం ఇందుకు తోడ్పడింది.
- ఆస్తుల నాణ్యత విషయానికొస్తే, ఈ క్యూ2లో కొత్తగా రూ.3,831 కోట్ల రుణాలు మొండి పద్దులుగా మారాయి. ఈ జూన్ 30 నాటికి 2.21 శాతంగా ఉన్న బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) సెప్టెంబరు 30 నాటికి 2.13 శాతానికి తగ్గాయి. అయితే, మొండి బకాయిల కోసం కేటాయింపులు మాత్రం దాదాపు రెట్టింపై రూ.3,631 కోట్లకు పెరిగాయి.
- గతంలో బ్యాంక్ పద్దుల్లోంచి కొట్టివేసిన మొండిబాకీల్లో రూ.2,300 కోట్లను ఈ క్యూ2లో తిరిగి వసూలు చేయగలిగినట్లు శ్రీనివాసులు శెట్టి తెలిపారు.
- బ్యాంక్ అనుబంధ విభాగాల విషయానికొస్తే, జీవిత బీమా వ్యాపారం లాభం ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి (ఏప్రిల్-సెప్టెంబరు) రూ.1,049 కోట్లకు పెరిగింది. క్రెడిట్ కార్డు వ్యాపార విభాగ లాభం రూ.999 కోట్లకు పరిమితం కాగా.. ఫండ్స్ మేనేజ్‌మెంట్ విభాగ లాభం రూ.1,347 కోట్లకు పెరిగింది. జనరల్ ఇన్సూరెన్స్ విభాగ లాభం రూ.414 కోట్లకు పుంజుకుంది.



బ్యాంక్ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

### వచ్చే ఫిబ్రవరి తర్వాతే రెపో తగ్గింపు

వచ్చే ఏడాది ఫిబ్రవరికి ముందు ఆర్‌బీఐ ప్రామాణిక వడ్డీ (రెపో) రేటును తగ్గించకపోవచ్చని శ్రీనివాసులు శెట్టి అన్నారు. అయితే, తమ రుణాల్లో 42 శాతం.. రెపో వంటి బహిరంగ మార్కెట్ ప్రామాణిక రేట్లతో అనుసంధానితమై లేవని.. బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మెరుగైన స్థాయిలో కొనసాగించేందుకు ఇది దోహదపడుతుందన్నారు. బ్యాంకుల ఎన్ఐఎంలు నిలకడగా సాగనున్నాయని, డిపాజిట్లపై వడ్డీ రేట్లు ఇప్పటికే పతాక స్థాయికి చేరాయన్నారు.

### వార్షిక లాభం.. రూ.లక్ష కోట్ల లక్ష్యం

ఈ ఆర్థిక సంవత్సరానికి 14-16 శాతం రుణ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. అయితే, డిపాజిట్ల వృద్ధిని మాత్రం గతంలో అంచనా వేసిన 12-13 శాతం నుంచి 10 శాతానికి తగ్గించుకున్నట్లు తెలిపారు. దేశంలోని వాణిజ్య సంస్థల్లోకెల్లా ఎస్‌బీఐదే అత్యధిక నికర లాభమన్న శెట్టి.. పూర్తి ఆర్థిక సంవత్సర నికర లాభాన్ని రూ.లక్ష కోట్ల స్థాయికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ లక్ష్యంలో భాగంగా తొలుత బ్యాంక్ నిర్వహణ లాభాన్ని రూ.లక్ష కోట్ల స్థాయికి పెంచి, ఆ తర్వాత నికర లాభాన్నీ ఆ స్థాయికి చేర్చాలనుకుంటున్నట్లు శుక్రవారం బ్యాంక్ ఆర్థిక ఫలితాలు విడుదల చేసిన అనంతరం మీడియాతో అన్నారు. అయితే, ఎప్పటిలోగా ఈ లక్ష్యాన్ని చేరుకోనున్న విషయంపైన మాత్రం ఆయన స్పష్టతనివ్వలేదు. సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్ధంలో ఎస్‌బీఐ నిర్వహణ లాభం రూ.63,895 కోట్లకు చేరుకుంది.

## విమ్టా ల్యాబ్స్ లాభంలో 110% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమ్టా ల్యాబ్స్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏకంగా 109.9 శాతం వృద్ధి చెంది రూ.17 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.8.1 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా 26.4 శాతం వృద్ధితో రూ.67.6 కోట్ల నుంచి రూ.85.4 కోట్లకు చేరుకుందని కంపెనీ వెల్లడించింది. ఈ కాలంలో ఫార్మాస్యూటికల్ సర్వీసుల వ్యాపారం మంచి పనితీరు కనబరచటం ఎంతగానో కలిసివచ్చిందని పేర్కొంది. రానున్న త్రైమాసికాల్లో కొత్త ప్లాంట్ అందుబాటులోకి రానుండటంతో పాటు ఫార్మా సేవల వ్యాపారం ఇదే జోరును కొనసాగించే వీలుండటంతో మంచి ఫలితాలను నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.

## టాటా మోటార్స్ లాభంలో క్షీణత

ముంబై: అమ్మకాలు అత్యంత నీరసంగా ఉండడంతో టాటా మోటార్స్ కన్సాలిటేడ్ లాభం సెప్టెంబరు త్రైమాసికంలో లాభం 9.9 శాతం క్షీణించి రూ.3,450 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ లాభం రూ.3,832 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.1,00,534 కోట్లుగా ఉండగా మొత్తం వ్యయాలు రూ.97,330 కోట్లుగా నమోదయ్యాయి. బ్రిటన్‌లోని కంపెనీ అనుబంధ సంస్థ జేఎల్‌ఆర్ ఆదాయాలు 5.6 శాతం క్షీణించి 650 కోట్ల పౌండ్లకు తగ్గడం, అల్యూమినియం సరఫరాలకు ఏర్పడిన తాత్కాలిక అంతరాయం లాభదాయకతను దెబ్బ తీసినట్టు కంపెనీ ప్రకటించింది.

## తగ్గిన ఓలా ఎలక్ట్రిక్ నష్టం

ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ కన్సాలిడేటెడ్ నష్టం సెప్టెంబరు త్రైమాసికంలో రూ.495 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో ఏర్పడిన నష్టం రూ.524 కోట్లుంది. కంపెనీ ఆదాయం రూ.873 కోట్ల నుంచి రూ.1,214 కోట్లకు పెరిగింది. అమ్మకాలు 74 శాతం పెరిగి 98,169కి చేరాయి.

## ఎల్ఐసీ లాభం రూ.7,621 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) సెప్టెంబరు 30వ తేదీతో ముగిసిన రెండో త్రైమాసిక నికర లాభంలో 3.8 శాతం క్షీణత నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే లాభం రూ.7,925 కోట్ల నుంచి రూ.7,621 కోట్లకు తగ్గింది. అయితే ప్రీమియంల ద్వారా సమకూరిన ఆదాయం మాత్రం రూ.1,09,397 కోట్ల నుంచి రూ.1,19,901 కోట్లకు పెరిగింది. ఇతర ఆదాయం మాత్రం రూ.248 కోట్ల నుంచి రూ.145 కోట్లకు పడిపోయింది. క్యూ2 మొత్తం ఆదాయం రూ.2,29,620 కోట్లుగా, మొత్తం వ్యయాలు రూ.2,22,366 కోట్లుగా నమోదయ్యాయి. సాల్వెన్సీ నిష్పత్తి 190 శాతం నుంచి 198 శాతానికి పెరిగింది. రెండో త్రైమాసికం ముగిసే నాటికి స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 2.43 శాతం నుంచి 1.72 శాతానికి తగ్గాయి. కొత్త ప్రీమియం ఆదాయం రూ.29,538 కోట్లుగా నమోదైంది.

### ఆరోగ్య బీమాలోకి ప్రవేశం

ఆరోగ్య బీమా అందిస్తున్న ఏదైనా ఒక కంపెనీలో వాటాలు కొనుగోలు చేసే విషయంలో నిర్ణయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకుంటామని ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సిద్ధార్థ మొహంతి తెలిపారు. ప్రస్తుతం క్షేత్రస్థాయి పని జరుగుతోందని, సరైన కంపెనీ కోసం అన్వేషణ కొనసాగుతున్నదని ఆయన చెప్పారు. ఎంత మొత్తంలో వాటా తీసుకుంటారు అన్న ప్రశ్నకు కంపెనీ విలువ సహా పలు అంశాలపై అది ఆధారపడి ఉంటుందన్నారు. క్షేత్ర స్థాయి పని పూర్తి కాగానే అనుమతి కోరుతూ బోర్డుకు ప్రతిపాదన పంపుతామని మొహంతి తెలిపారు.

## 27 నుంచి హైదరాబాద్‌లో పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ మరోసారి పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోకు వేదికవుతోంది. ఈ నెల 27 నుంచి 29 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ కాంప్లెక్స్‌లో 'పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో- 2024' జరగనుంది. హైదరాబాద్‌లో ఈ ఎగ్జిబిషన్ జరగడం వరుసగా ఇది 16వసారి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పోలో దేశ, విదేశాలకు చెందిన పౌల్ట్రీ పరిశ్రమ కంపెనీలు 400కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేయబోతున్నాయి. దీనికి తోడు 35కుపైగా దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని, ఏటా ఈ ఎక్స్‌పోను నిర్వహించే ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) జాతీయ అధ్యక్షుడు ఉదయ సింగ్ బయాస్ విలేకరులతో చెప్పారు. ఎక్స్‌పో ప్రారంభానికి ముందు రోజు 26న నాలెడ్జ్ డే పేరుతో ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కొత్తగా పౌల్ట్రీ పరిశ్రమలోకి ప్రవేశించాలనుకునే ఔత్సాహికులకు పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో చక్కటి వేదిక అన్నారు. మన దేశ జనాభా ఎదుర్కొంటున్న పోషకాహారలేమి సమస్యను అధిగమించేందుకు చౌకగా లభించే కోడి గుడ్లు చక్కటి ప్రత్యామ్నాయమని విలేకరుల సమావేశంలో పాల్గొన్న వెంకటేశ్వర హేచరీస్ ఉన్నతాధికారి కేజీ ఆనంద్ అన్నారు.

## అమెరికా ఆంక్షలపై జర జాగ్రత్త

గీత దాటితే భారత్‌కూ తిప్పలే : జీటీఆర్ఐ

న్యూఢిల్లీ: అమెరికా ఆంక్షలు ఉన్న దేశాలకు కీలక వస్తువుల ఎగుమతి విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) భారత కంపెనీలను కోరింది. లేకపోతే భారత కంపెనీలూ అమెరికా ఆంక్షల పరిధిలోకి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. గత నెల 15న 19 భారత కంపెనీలు, ఇద్దరు భారతీయులపైనా అమెరికా ఆంక్షల కొరడా ఝుళిపించిన విషయాన్ని గుర్తు చేసింది. ఈ కంపెనీలు, వ్యక్తులు రష్యా సైన్యానికి ఉపయోగపడే పరికరాలు, టెక్నాలజీ సమకూరుస్తున్నారనే ఆరోపణలతో అమెరికా ఈ చర్య తీసుకుంది. ఇందులో కొన్ని కంపెనీలు అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న కొన్ని పరికరాలు, ఉత్పత్తులను తిరిగి రష్యాకు ఎగుమతి చేస్తూ ఆ దేశ సైన్యానికి తోడ్పడుతున్నాయని అమెరికా ఆరోపించింది. ముఖ్యంగా పౌర, సైనిక ప్రయోజనాలు రెండింటికీ ఉపయోగించే అవకాశం ఉన్న వస్తువుల విషయంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతోందని జీటీఆర్ఐ తెలిపింది.

## మార్కెట్లో మళ్లీ నష్టాలే..

» సెన్సెక్స్ 55 పాయింట్లు డౌన్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 424 పాయింట్లకు పైగా క్షీణించినప్పటికీ, చివరికి 55.47 పాయింట్ల నష్టంతో 79,486.32 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 51.15 పాయింట్లు కోల్పోయి 24,148.20 వద్ద ముగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ వంటి దిగ్గజ షేర్లలో అమ్మకాలతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ ఇందుకు కారణమయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 13 నష్టపోగా.. ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్ 2 శాతానికి పైగా క్షీణించి సూచీ టాప్ లూజర్లుగా మిగిలాయి. కాగా, ఆర్ఐఎల్ 1.66 శాతం, ఎస్‌బీఐ 1.86 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.53 శాతం తగ్గాయి. చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో మాత్రం అమ్మకాల ఒత్తిడి అధికమైంది. దాంతో బీఎస్ఈలోని స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు 1.52 శాతం వరకు పతనమయ్యాయి.

### ఈనెల 20న మార్కెట్లకు సెలవు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ఈ నెల 20న (బుధవారం) సెలవు పాటించనున్నాయి. ఆ రోజు ఈక్విటీ, ఎఫ్ అండ్ ఓ, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ (ఎస్ఎల్‌బీ) విభాగాల్లో ట్రేడింగ్ జరగదు.

## సంక్షోభంలో చక్కెర పరిశ్రమ

ఎన్ఎఫ్‌సీఎస్ఎఫ్

న్యూఢిల్లీ: దేశీయ చక్కెర పరిశ్రమ మరోసారి సంక్షోభంలో పడింది. చెరకు మద్దతు ధర పెంచినంతగా.. ప్రభుత్వం చక్కెర ధర పెంచకపోవడం పెద్ద సమస్యగా మారిందని చక్కెర పరిశ్రమ తెలిపింది. ప్రస్తుత చక్కెర సీజన్‌లో టన్ను చెరకు మద్దతు ధరను 8 శాతం పెంచి రూ.3,400గా నిర్ణయించిన ప్రభుత్వం, కిలో చక్కెరకు మిల్లులకు చెల్లించే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ను 2018-19 నుంచి రూ.31 వద్దే కొనసాగించడాన్ని జాతీయ సహకార చక్కెర మిల్లుల సమాఖ్య (ఎన్ఎఫ్‌సీఎస్ఎఫ్) తప్పుపట్టింది. ప్రస్తుతం కిలో చక్కెర ఉత్పత్తి ఖర్చులే రూ.41.66 చేరినట్టు తెలిపింది. దీనికి తోడు ఎగుమతులపై నిషేధంతో ఈ సీజన్ చివరికి దేశీయ వినియోగం పోనూ 115 లక్షల టన్నుల చక్కెర నిల్వలు పేరుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితి నుంచి ప్రభుత్వమే పరిశ్రమను ఆదుకోవాలని కోరింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 79,470 ▲ | 72,850 ▲ | 1,03,000 ▲ |
| ముంబై | 77,382 ▲ | 70,882 ▲ | 91,130 ▲ |

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 9వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 555 | విజయవాడ | 565 |
| వరంగల్ | 557 | గోదావరి | 560 |
| చిత్తూరు | 593 | విశాఖపట్నం | 550 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 120 | విజయవాడ | 120 |
| వరంగల్ | 120 | గుంటూరు | 120 |
| కరీంనగర్ | 120 | ఒంగోలు | 120 |
| మహబూబ్‌నగర్ | 120 | చిత్తూరు | 107 |
| కర్నూలు | 120 | నెల్లూరు | 107 |
| విశాఖపట్నం | 111 | అనంతపురం | 107 |
| గోదావరి | 120 | | |

## జేఎల్ నియామక పత్రాలు ఇవ్వండి

» సీఎం రేవంత్‌కు ఎంపికైన అభ్యర్థుల అభ్యర్థన

తార్నాక, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ ద్వారా జూనియర్ లెక్చరర్లు(జేఎల్)గా ఎంపికైన తమకు నియామక పత్రాలను అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 1,392 జూనియర్ లెక్చరర్ పోస్టులకు 2022లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి 2023లో రాత పరీక్ష నిర్వహించి ఈ ఏడాది తుది ఫలితాలు విడుదల చేశారని వారు తెలిపారు. డీఎస్సీ నిర్వహించిన 55 రోజుల్లోనే ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం తమకు మాత్రం ఇప్పటికీ నియామకపత్రాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ దోచిన సొమ్ము మహారాష్ట్రకు..

» బీఆర్ఎస్ నేతల మండిపాటు

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ వివిధ మార్గాల్లో తెలంగాణలో డబ్బును దోచి.. మహారాష్ట్ర ఎన్నికల ఖర్చు కోసం ఇక్కడి నుంచి పంపిస్తోందని బీఆర్ఎస్ నేతలు కేపీ వివేకానంద, ఎర్రోళ్ల శ్రీనివాస్, మేడె రాజీవ్‌సాగర్ ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. బిల్డర్లు, వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు వసూలు చేస్తున్నారని, అంతేకాకుండా డబ్బులు వచ్చే ప్రాజెక్టులపైనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు రోజురోజుకు దిగజారుతోందని.. ప్రతిపక్ష హోదాలో ప్రశ్నిస్తుంటే.. మా పార్టీ నేతలపై దొంగ కేసులు పెట్టి ఇరికించాలనే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

## హైకోర్టు లైవ్ వీడియోలు వినియోగిస్తే చర్యలు

హైదరాబాద్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): హైకోర్టు లైవ్ స్ట్రీమింగ్ రూల్స్ పాటించకుండా వీడియోలను ఉపయోగిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని హైకోర్టు ఐటీ రిజిస్ట్రార్ శుక్రవారం ఒక నోటిఫికేషన్ జారీచేశారు. హైకోర్టు లైవ్ స్ట్రీమింగ్ రూల్స్ పాటించే విధంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ఛానెల్స్ తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. హైకోర్టు వీడియోలు ఉపయోగించాలంటే ముందస్తుగా లిఖితపూర్వక అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మేరకు మీడియా ఆర్గనైజేషన్‌లు ఈ అంశాలను దృష్టిలో ఉంచుకోవాలని పేర్కొన్నారు.

## గ్రామ కంఠం ప్రభుత్వ భూమా? ప్రైవేటు భూమా?

» వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): గ్రామకంఠం పరిధిలోని భూమి.. ప్రభుత్వానిదా? లేక ప్రైవేటుదా? అనే అంశంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం బాచుపల్లిలోని 6.15 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారని, సదరు భూమిని రక్షించే విషయంలో పంచాయతీ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ గ్రామస్థుడు కందుకూరి శ్రీనివాస్ సహా మరికొంతమంది హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శులు, రంగారెడ్డి కలెక్టర్, ఇతర అధికారులకు నోటీసులు జారీచేసింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

## ఓలా షోరూమ్‌కు చెప్పుల దండ

» బైక్ సర్వీసింగ్ విషయమై ఓ వ్యక్తి నిరసన

పటాన్‌చెరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓలా ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాల సర్వీసింగ్ విషయంలో వినియోగదారుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో మరో ఘటన జరిగింది. వాహనాన్ని సర్వీస్‌కు ఇచ్చిన నెల రోజులు కావొస్తున్నా పని పూర్తిచేసి వాహనాన్ని తిరిగివ్వకపోవడంతో ఓ వ్యక్తి ఓలా షోరూమ్‌కు చెప్పుల దండ వేసి నిరసన తెలిపాడు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం అశోక్‌నగర్‌లోని ఓలా బ్యాటరీ బైక్ షోరూంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. సంగారెడ్డికి చెందిన సంతోష్‌కుమార్ 2023 నవంబరులో ఓలా బైక్ బుక్ చేసుకోగా నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా వాహనం అందించారు. మరమ్మతుల నిమిత్తం దసరా ముందు వాహనాన్ని ఇస్తే ఇప్పటివరకు షోరూమ్ నిర్వాహకులు తిరిగి ఇవ్వలేదు. దీంతో విసిగిపోయిన సంతోష్ కుమార్ తొలుత షోరూమ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం షోరూమ్ తలుపునకు చెప్పుల దండ వేసి తన నిరసన తెలియజేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.

## బీసీ రిజర్వేషన్లు పెంచడానికే కులగణన

» బీసీ కులగణన చైతన్యగీతం సీడీ ఆవిష్కరణలో జాజుల

రవీంద్రభారతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు పెంచడానికి సమగ్ర కులగణన ఉపయోగపడుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ సర్వేకు సంక్షేమ పథకాలతో సంబంధం లేదన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన... కే. శ్రీను రచించిన 'బీసీ కులగణన చైతన్య గీతం' సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు కులగణనపై అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలు కులగణనకు సహకరించాలని, భయపడకుండా మన కులమేదో తెలియజేయాలని సూచించారు. ప్రతిపక్షాల ఊబిలో పడొద్దని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ కులగణనపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి బండి సంజయ్, బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సహా ఆ పార్టీ నేతలు బీసీల మీద విషం కక్కుతున్నారని ఆరోపించారు. కులగణనపై కారు కూతలు కూస్తే సహించబోమని హెచ్చరించారు. కులం పేరు చెప్పొద్దంటూ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ చేసిన వ్యాఖ్యలపై జాజుల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పద్మారావు సైతం బీసీ కోటాలో ఎమ్మెల్యే టికెట్ గాని మంత్రి పదవిగానీ అడగొద్దన్నారు. కులగణనపై టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, విస్తృతంగా ప్రచారం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఢిల్లీలో కృష్ణా ట్రైబ్యునల్-2లో క్రాస్ ఎగ్జామినేషన్

» తెలంగాణ న్యాయవాది ప్రశ్నలకు ఏపీ సాక్షి జవాబులు

హైదరాబాద్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రైబ్యునల్-2లో ఢిల్లీలో ఏపీ దాఖలు చేసిన ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రోటోకాల్ అఫిడవిట్‌పై జరిగిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఏపీ తరఫున సాక్షిగా అనిల్‌కుమార్ గోయల్ పాల్గొన్నారు. తెలంగాణ తరఫు న్యాయవాది అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కేంద్రం జారీ చేసిన అదనపు విచారణ విధి విధానాల(టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్)కు అనుగుణంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి ట్రైబ్యునల్ విచారణ నిర్వహిస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి రెండు రాష్ట్రాలు నీటిని వినియోగించుకుంటున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌ను కృష్ణా పరివాహకంలో అట్టడుగు రాష్ట్రంగా పరిగణించకూడదని తెలంగాణ న్యాయవాది అభ్యంతరం చెప్పగా గోయల్ అసమ్మతి తెలియజేశారు. పులిచింతల దిగువన వైకుంఠపురం, గుంటూరు ఛానల్‌లు ఉన్నాయా...? అని ప్రశ్నించగా అవునని బదులిచ్చారు. కేసీ కెనాల్‌ను కూడా నియంత్రించాలంటారా...? అని అడగ్గా గోయల్ అవునని చెప్పారు. తదుపరి క్రాస్ ఎగ్జామినేషన్‌ను డిసెంబరు 5, 6వ తేదీకి వాయిదా వేస్తూ ట్రైబ్యునల్ నిర్ణయం తీసుకుంది. కృష్ణా జలాల పంపిణీపై వాదనలు ప్రారంభించాలని తెలంగాణ ట్రైబ్యునల్‌ను కోరింది.

## ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు రానివ్వం

» పౌర సరఫరాల ముఖ్య కార్యదర్శి డీఎస్.చౌహాన్

రామాయంపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా ధాన్యం కొనుగోళ్ల సమస్య తలెత్తకుండా చూస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ తెలిపారు. ఇప్పటికే పంట తూకం వేసి మిల్లులకు తరలిస్తున్నామని, రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా రామాయంపేట మార్కెట్ యార్డులో రెవెన్యూ, వ్యవసాయ, సివిల్ సప్లయ్ అధికారులతో చౌహాన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంట కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా మీరే బాధ్యులవుతారని అధికారులను హెచ్చరించారు. అనంతరం జిల్లా రైస్ మిల్లర్లతో డీఎస్ చౌహాన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో 3వేల మిల్లులు ఉండగా.. ఈసారి 2007 మిల్లులకు మాత్రమే క్లియరెన్స్ ఇచ్చామని చెప్పారు. దీనివల్ల ధాన్యం కొనుగోళ్ల సమస్య రాకుండా ప్రభుత్వ గోదాముల్లో నిల్వ చేస్తామన్నారు. అలాగే ట్రాన్స్‌పోర్టు సమస్య వస్తే సదరువ్యక్తి కాంట్రాక్టు రద్దు చేస్తామన్నారు.

# హ్యాపీ బర్త్‌డే రేవంత్‌రెడ్డీ.. హైదరాబాద్‌లోనే ఉన్నా!

### మీ ఏజెన్సీలు ఎప్పుడొచ్చినా స్వాగతం.. మూసీ బాధితులు ఇక్కడుంటే నల్గొండకు ఎందుకెళ్లావ్?

### పాలన తెలియని నీకు పగ్గాలు అప్పగిస్తే ప్రజల బతుకుల్లో మన్నుపోసినవ్: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'ముందుగా మీకు హ్యాపీబర్త్‌డే.. నేను హైదరాబాద్‌లోనే ఉన్నా.. రేవంత్‌రెడ్డీ.. మీ ఏసీబీలాంటి ప్రభుత్వ ఏజెన్సీలను ఎప్పుడు పంపినా స్వాగతం. మీరు పంపే వాళ్లకు చాయ్.. ఉస్మానియా బిస్కెట్‌తోపాటు, వారు కట్ చేస్తామంటే మీ బర్త్‌డే కేక్‌ను కూడా నేనే ఇప్పిస్తా' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఎక్స్ వేదికగా వ్యాఖ్యలు చేశారు. 'అరెస్టు భయంతో నేను మలేషియాకు వెళ్తున్నానని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. నేను ఎక్కడికీ వెళ్లలేదు. ఇక్కడే ఉన్నాను. మూసీ బాధితులు హైదరాబాద్‌లో ఉంటే నల్లగొండకు ఎందుకు వెళ్లావ్.. కూల్చిన ఇండ్లెక్కడ? కాలిన కడుపులెక్కడ? నువ్ తిరుగుతున్న ప్రాంతం ఎక్కడ? నీ కుట్రలకు అంబర్‌పేట్, అత్తాపూర్, గోల్నాక, దిల్‌సుఖ్‌నగర్ అతలాకుతలం అవుతుంటే.. అయ్యా సంబరాల రాంబాబు నువ్ చేస్తున్న పాదయాత్ర ఎక్కడ? మూసీ పరివాహక ప్రాంత రైతులను కలవడంలో మీ అంతర్యం ఏమిటి? మోకాలికి దెబ్బతగిలితే బోడిగుండుకు కుట్లు వేసినట్టు గుంపు మేస్త్రీ పాలన ఉంది. నల్లగొండలో కాదు ఇటు వైపురా. బాధితులు ఉన్నచోట నీ పాదాలమీద యాత్ర చెయ్యి. పాలన తెలియని నీకు పగ్గాలు అప్పగిస్తే ప్రజల బతుకుల్లో మన్ను పోసినవ్. నాయకత్వమంటే కూల్చడం కాదు. నిర్మించడం. దారి తప్పడంకాదు దారి చూపడమని తెలుసుకో..' అని కేటీఆర్ సీఎం రేవంత్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. సీఎం మూసీ పాదయాత్ర నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాపాలన అంటూనే.. ముఖ్యమంత్రి, మంత్రులు పర్యటనలు చేసిన ప్రతిసారి తమ పార్టీ నేతలను ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్టుల పేరుతో నిర్బంధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే తమ నేతల హక్కులను కాలరాస్తున్నారని, అయినా.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు.. ఆ పార్టీ నేతల అవినీతిపై నిరంతరం ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. నిర్బంధంలోకి తీసుకున్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, భూపాల్‌రెడ్డి, ఇతర నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



# యాదగిరిగుట్ట ఆలయానికి ప్రత్యేక బోర్డు

### టీటీడీ తరహాలో ఏర్పాటు చేసేందుకు చర్యలు..యాదాద్రి బదులు యాదగిరిగుట్ట.. రికార్డుల్లో మార్పు

### యాదగిరిగుట్టపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి.. పుట్టినరోజున స్వామివారిని దర్శించుకున్న సీఎం



యాదగిరిగుట్ట ఆలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొన్నం తదితరులు

యాదాద్రి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. టీటీడీ స్థాయిలో ప్రాధాన్యం ఉండేలా దీనిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా.. యాదాద్రిని ఇక నుంచి యాదగిరిగుట్టగా పిలవాలని, ఈ మేరకు అన్ని రికార్డుల్లోనూ పేరును అధికారికంగా మార్చాలని అధికారులకు సూచించారు. శుక్రవారం ముఖ్యమంత్రి తన పుట్టినరోజును పురస్కరించుకుని లక్ష్మీనృసింహుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రెసిడెన్షియల్ సూట్‌లో వైటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. ఆలయానికి సంబంధించిన పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు వారంలోగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భూసేకరణ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో మాదిరిగా భక్తులు కొండపైన నిద్రించేందుకు చర్యలు చేపట్టాలని, పాత ఆచారాల పునరుద్ధరణలో భాగంగా ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. దేవస్థానానికి సంబంధించిన గోశాలలో గోవుల సంరక్షణకు అవసరమైతే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 2025లో జరగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల నాటికి ప్రధానాలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులు పూర్తి చేయాలన్నారు.

### సీఎం పర్యటన సాగిందిలా..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయాన్ని దర్శించుకునేందుకు హెలికాప్టర్‌లో వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి.. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి, నకిరేకల్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం స్వాగతం పలికారు. అనంతరం ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్లి 20నిమిషాల తర్వాత సీఎం కాన్వాయ్ కొండపైకి బయలుదేరింది. విష్ణుపుష్కరిణిలో స్నాన సంకల్పం చేసిన సీఎం.. తూర్పు రాజగోపురం ఎదురుగా స్వామివారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి అఖండ దీపారాధన తర్వాత కొబ్బరికాయ సమర్పించారు. త్రితల గోపురం వద్దకు చేరుకోగానే ఆలయ అర్చకులు సీఎంకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలోని స్వయంభువులను దర్శించుకున్న ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ప్రెసిడెన్షియల్ సూట్‌కు చేరుకున్న సీఎం... మంత్రులు, సీఎస్, అధికారులతో కలిసి వైటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డికి స్థానిక నేతలంతా శుభాకాంక్షలు తెలిపేందుకు క్యూ కట్టడంతో పరిస్థితి అదుపుతప్పి గందరగోళం నెలకొంది. తూర్పు రాజగోపురం వెళ్లేందుకు సీఎం, మంత్రులు నేతలను తోసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది. అక్కడున్న నేతలంతా కూడా ఒకేసారి ఆలయంలోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించగా... మంత్రి కొండా సురేఖ అతి కష్టమ్మీద ప్రధానాలయంలోకి వెళ్లారు. సీఎం, మంత్రులతో పాటు కొంతమంది నేతలు ఆలయంలోకి చొచ్చుకుపోగా, మరికొంతమంది వెళ్లే ప్రయత్నాన్ని అదుపు చేయలేక కొద్దిసేపు ద్వారబంధనం చేశారు. తిరిగి ఉత్తర ద్వారం నుంచి సీఎం బయటకు వచ్చేటప్పుడు కూడా ఇదే పరిస్థితి పునరావృతమైంది.



సీఎం రేవంత్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

## భూమి ఉన్నంతకాలం ప్రజల గుండెల్లో కేసీఆర్

» కేసీఆర్ కట్టిన యాదాద్రిలోనే సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

» బీఆర్ఎస్ నేతల అరెస్టును ఖండిస్తున్నాం: హరీశ్‌రావు



సిద్దిపేట టౌన్/హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ భూమి ఉన్నంతకాలం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రజల గుండెల్లో ఉంటారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 237 మంది లబ్ధిదారులకు రూ.54.57 లక్షల విలువైన చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి.. నేడు కేసీఆర్ కట్టిన యాదాద్రిలోనే పుట్టినరోజు చేసుకున్నారన్నారు. చివరికి మూసీ సుందరీకరణలో భాగంగా మంచినీళ్లను కూడా కేసీఆర్ కట్టిన కాళేశ్వరం నుంచి తరలిస్తామని చెప్పారని తెలిపారు. అసలు కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా, తెలంగాణ రాకపోతే నువ్వు ముఖ్యమంత్రివి అయ్యేవాడివా అని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీని, తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చిన కేసీఆర్‌ను ప్రజలు మర్చిపోరని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు మోసం చేశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నార న్నారు. హాస్టళ్లలో పిల్లలకు కనీసం కడుపునిండా అన్నం పెట్టలేని పరిస్థితికి తెలంగాణ ప్రభుత్వం దిగజారిందని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడేది లేదన్నారు. మరోవైపు.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీఎం పాదయాత్ర సందర్భంగా బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని హరీశ్ రావు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.



శంషాబాద్‌లో మీడియాతో బండి సంజయ్

## కేటీఆర్.. యాక్టింగ్ సీఎం

» ఆయనదీ, రేవంత్‌దీ ఇచ్చిపుచ్చుకునే దోస్తీ

» అది బెడిసికొట్టినప్పుడే కేటీఆర్ అరెస్టు

» మీడియాతో బండి సంజయ్ చిట్‌చాట్

హైదరాబాద్/శంషాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అయితే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యాక్టింగ్ సీఎం అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. రేవంత్, కేటీఆర్ ఒక్కటేనని.. వారిద్దరి మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణి సాగుతోందని చెప్పారు. అది బెడిసికొట్టినప్పుడే కేటీఆర్ అరెస్టు జరుగుతుంది తప్ప.. ఫార్ములా రేస్, రేవ్ పార్టీ, డ్రగ్స్ కేసులు ఎన్ని వెలుగు చూసినా ఏమీ కాదని తేల్చిచెప్పారు. ఇటీవల జన్వాడ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో దొరికిన వారిని పోలీసులు వదలిపెట్టడం రాజీ రాజకీయం కాదా..? అని ప్రశ్నించారు. కూతురి పెళ్లికి కూడా అందుబాటులో లేకుండా చేసిన కేసీఆర్, కేటీఆర్‌లను అవినీతి కేసుల్లో అరెస్టు చేయకుండా రేవంత్ ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని నిలదీశారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంజయ్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. సంజయ్, రేవంత్ ఒక్కటే అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యపై స్పందించారు. రేవంత్‌ను, కాంగ్రెస్‌ను ఎక్కువ విమర్శించేది తానేనని సంజయ్ తెలిపారు. కేటీఆర్, రేవంత్ ఒక్కటే అన్నదానికి వంద ఉదాహరణలు చెబుతానని.. తాను రేవంత్ ఒక్కటే అన్నదానికి కేటీఆర్ ఒక్క ఉదాహరణయినా చెప్పాలని డిమాండ్‌చేశారు. అరెస్టు భయంతో కేటీఆర్ మలేషియా వెళ్లడం ఎంత నిజమో.. రాజ్‌భవన్ కేంద్రంగా బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటి కావడం అంతే నిజమని సంజయ్ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీని ఉద్దేశించి అంత సంస్కారహీనంగా మాట్లాడతారా? అని కేటీఆర్‌పై మండిపడ్డారు. కేటీఆర్‌తో పోలిస్తే హరీశ్ పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయత ఉందన్నారు. గవర్నర్‌కు కూడా ప్రొటోకాల్ ఇవ్వని మూర్ఖ ప్రభుత్వం బీఆర్ఎస్‌దని విమర్శించారు. రాజ్‌భవన్‌ను కూడా రాజకీయం చేస్తారా? అని మండిపడ్డారు. శంషాబాద్ మునిసిపాలిటీ పరిధి ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీలోని హనుమాన్ ఆలయంలో నవగ్రహ విగ్రహాలను ధ్వంసం చేసి మూడు రోజులైనా పోలీసులు చర్యలు తీసుకోలేదని, ఇది ప్రభుత్వ వైఫల్యమేనని సంజయ్ ధ్వజమెత్తారు.

### రాహుల్ బీసీలకు క్షమాపణ చెప్పాలి: లక్ష్మణ్

కాంగ్రెస్ చారిత్రక తప్పిదాల వల్ల దేశ వ్యాప్తంగా బీసీలు అన్యాయానికి గురయ్యారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. ఇందిర హయాంలో అసలు బీసీ కమిషనే ఏర్పాటు చేయలేదని, మండల్ కమిషన్ సిఫారసులను రాజీవ్ వ్యతిరేకించారని పేర్కొన్నారు. రాహుల్ ముందు బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలను ప్రలోభపెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణనను తెరమీదకు తెచ్చిందని విమర్శించారు.

# అమోయ్ అన్ని దందాలా!?

(మొదటిపేజీ తరువాయి)

మార్చడం వెనుక కొందరు పెద్దల పాత్ర కూడా ఉన్నట్లు ఈడీకి ఫిర్యాదు అందింది. ఈ కేసులో లోతైన విచారణ జరిగితే మరికొందరి పాత్ర బయటకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఫిర్గీపూర్‌లోని సర్వే నంబరు 17లోని సీలింగ్ భూములు అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదు అందింది.

వట్టినాగులపల్లిలోని శంకరహిల్స్ ప్లాట్స్ పర్చేజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కూడా ఇటీవల ఈడీకి ఫిర్యాదు చేసింది. వట్టినాగులపల్లిలో 1983లో 460 ఎకరాల్లో శంకరహిల్స్ పేరుతో 3333 ప్లాట్లు వేసి అప్పట్లో కొందరు విక్రయించారు. దీనిపై అనేక కోర్టు వివాదాలున్నాయి. వీటికితోడు ఈ భూములను 111 జీవో కింద తీసుకురావడంతో క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. గత రెండేళ్ల కిందట సుప్రీంకోర్టు వట్టినాగులపల్లిలోని కొన్ని భూములను 111 జీవో నుంచి తొలగించాలని ఆదేశించింది. ఇందులో శంకరహిల్స్ భూములూ ఉన్నాయి. 111 జీవో నుంచి ఈ ప్రాంతాన్ని తొలగించడంతో భూముల ధరలు అమాంతం పది రెట్లకు పైగా పెరిగాయి. దీంతో ఈ భూములపై కొందరు పెద్దల కన్ను పడింది. అధికారుల సహకారంతో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని ఇందులో ప్లాట్లు ఉన్న భూములను ఇతరుల పేరు మీద రిజిస్ట్రేషన్లు చేసేశారు. ఇదంతా అమోయ్‌కుమార్ పనిచేసిన కాలంలోనే జరిగిందంటూ ప్లాట్ల యజమానులు ఇటీవల ఈడీకి ఫిర్యాదు చేశారు.

తట్టి అన్నారం గ్రామంలోని సర్వే నంబర్లు 108, 109, 110, 111లోని 70.39 ఎకరాల్లో మద్ది సత్యానారాయణరెడ్డి 1982లో వెంచర్ వేసి మధురానగర్ పేరుతో 840 ప్లాట్లు విక్రయించారు. ధరణి వచ్చాక ఈ ప్లాట్లన్నీ మళ్లీ పట్టాభూములుగా మారాయని, ఇందులో అప్పటి కలెక్టర్ అమోయ్ కుమార్‌తోపాటు అధికారుల పాత్ర ఉందని ప్లాట్ల యజమానులు ఈడీకి ఫిర్యాదు చేశారు.

కొండాపూర్‌లోని సర్వే నంబరు 104 నుంచి 108 వరకు ఉన్న బాలసాయి బాబా ట్రస్టుకు చెందిన 42 ఎకరాల భూమి ప్రైవేటుపరం కావడం వెనుక కూడా అప్పటి ప్రభుత్వ పెద్దలతోపాటు నాటి సీఎస్ సోమేశ్‌కుమార్, కలెక్టర్‌గా ఉన్న అమోయ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారుల పాత్ర ఉందంటూ రాఘవయ్య అనే వ్యక్తి ఇటీవల ఫిర్యాదు చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని తప్పుడు పత్రాలతో ఈ భూములను ప్రైవేటు సంస్థలకు బదలాయించారని, దీనిపై విచారణ చేయాలని కోరారు.

ఘట్‌కేసర్ మండలం కొర్రెముల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని వెంకటాపూర్ సర్వే నంబరు 174లోని 12ఎకరాల ప్రభుత్వ భూమి 2023 అక్టోబరు 12న పట్టా భూమిగా మారింది. అప్పుడు అమోయ్‌కుమార్ మేడ్చ ల్ కలెక్టర్‌గా ఉన్నారు. దీనిపై కూడా ప్రభుత్వానికి ఫిర్యాదు అందింది.

ఇటీవల గుట్టబేగంపేటలోని సర్వే నంబరు 63లోని 52 ఎకరాల విలువైన భూములను 2022లో కలెక్టర్ అమోయ్‌కుమార్ డీనోటిఫై చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ప్రభుత్వ భూమిని ప్రైవేటుగా పేర్కొవడంపై కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇటీవల హైకోర్టు తీర్పు ఇచ్చింది. అమోయ్‌కుమార్ ఇచ్చిన ఉతర్వులను కొట్టివేసింది.

### అమోయ్‌కు బిగుస్తున్న ఉచ్చు

(మొదటిపేజీ తరువాయి)

భూముల వ్యవహారంలో విచారణ జరిపించాలని ఈడీ అధికారాలు డీజీపీని కోరినట్లు తెలిసింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈడీ అధికారులు డీజీపీతో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అత్యంత విలువైన భూ బదలాయింపులకు సంబంధించి.. త్వరలోనే కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలున్నట్లు కూడా కనిపిస్తోంది. ముఖ్యంగా.. అమోయ్‌కుమార్‌తో పాటు మహేశ్వరం మాజీ తహసీల్దార్ జ్యోతి, మాజీ ఆర్డీవో వెంకటాచారి ఇచ్చిన వాంగ్మూలాలు, 12 ఫిర్యాదుల్లో బాధితులు అందించిన డాక్యుమెంట్ల ఆధారంగా ఈడీ సంబంధిత అధికారులను విచారిస్తోంది. ఆ వివరాల ఆధారంగా.. పలువురు ప్రజాప్రతినిధులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారులకు సమన్లు జారీ చేయనున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఈడీ అధికారులు డీజీపీ జితేందర్‌ను కలిసినట్లు సమాచారం.

### ముఖ్యమంత్రిని కలిసిన డీజీపీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డీజీపీ జితేందర్ శుక్రవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పర్యటన ముగిసిన తర్వాత హైదరాబాద్ వచ్చిన రేవంత్‌తో భేటీ అయిన డీజీపీ.. ఆయన పుట్టినరోజు సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై వారు చర్చించినట్లు సమాచారం.

## పెండింగ్ బిల్లుల చెల్లింపు ఎప్పుడో?

» అన్ని శాఖలకు సంబంధించి 4వేల కోట్ల బకాయిలు

» గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారోనని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. తహసీల్దార్లకు అద్దె వాహనాల బకాయిలు రెండేళ్లుగా చెల్లించడంలేదని, ప్రభుత్వ ఉద్యోగుల జీపీఎస్, లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉద్యోగుల పారితోషకం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, ఉద్యోగుల సరెండర్ లీవ్స్ బిల్లులు చెల్లించడంలేదని ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్ని శాఖలకు సంబంధించి సుమారు రూ.4 వేల కోట్ల వరకు ఇలాంటి బకాయిలున్నాయని, వీటికి సంబంధించి పదేపదే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు తెలిపారు. బిల్లులు అన్ని ఎస్‌టీవో కార్యాలయాల్లో సమర్పించి నెలలు గడిచినట్టు ఉద్యోగులు చెబుతున్నారు. రెవెన్యూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఉద్యోగులు మొరపెట్టుకుంటున్నారు. నెలలుగా బిల్లులు మంజూరు కావడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లతో నిర్వహించిన సమావేశాల్లో 50% బకాయిల చెల్లింపు, ఉద్యోగుల ఎన్నికల బదిలీలను అక్టోబరులోగా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినా ఇప్పటికీ ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడలేదని ఉద్యోగులు చెబుతున్నారు. దీపావళిలోపు బిల్లులు అన్ని క్లియర్ చేస్తారని ఉద్యోగులు ఆశించినా నిరాశే మిగిలిందంటున్నారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగ సంఘం నేతలు కోరుతున్నారు.

## సర్వీస్ బుక్... ఇక డిజిటల్

» ఇంక్రిమెంట్, పెన్షన్‌లకు ధోకా లేదు

» నీటిపారుదల శాఖ కీలక నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమగ్ర రికార్డుగా భావించే సర్వీస్ బుక్ విషయంలో నీటిపారుదల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. శాఖలో ఉన్న ఆఫీస్ సబార్డినేట్ నుంచి ఇంజనీర్ ఇన్ చీఫ్ దాకా ప్రతీ ఉద్యోగికి చెందిన సర్వీస్ బుక్‌ను స్కాన్ చేసి... వెబ్‌సైట్‌లో భద్రపరిచింది. మొత్తం 7556 సర్వీస్ బుక్‌లను డిజిటైజ్ చేసింది. ఉద్యోగుల వ్యక్తిగత వివరాలు, సర్వీసు వివరాలు, ఇంక్రిమెంట్లు, సెలవుల వివరాలన్నీ ఇందులో పొందుపరిచింది. ఏటా ఇంక్రిమెంట్లు, సెలవుల వివరాలు నవీకరిస్తున్నారు. తెలంగాణలో 33 ప్రభుత్వ శాఖలు ఉండగా అందులో డైరెక్టరేట్లు/కమిషనరేట్లు కలుపుకొని 289 దాకా ఉన్నాయి. 3.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా ఏ శాఖలో లేని విధంగా ఒక్క నీటిపారుదల శాఖలోనే అందరు ఇంజనీర్ల ఎస్‌బీలు డిజిటైజ్ చేశారు. రెండేళ్ల కిందట వివిధ కారణాలతో నలుగురు ఉద్యోగులు/అధికారులు సర్వీస్ బుక్‌లు పోగొట్టుకొని పెన్షన్‌కుకూడా నోచుకోలేకపోయారని గుర్తించిన శాఖ, ఉద్యోగుల సర్వీసు బుక్‌లను డిజిటైజ్ చేసే పనిని చేపట్టింది. అత్యాధునికమైన నాలుగు స్కానర్లతో ఎస్‌బీలను స్కానింగ్ చేసి, తొలి దశలో డిజిటైజ్ చేయగా ఆ తర్వాత వీటిని ఏటా నవీకరించే బాధ్యతను డ్రాయింగ్ అండ్ డిస్బర్సల్ ఆఫీసర్(డీడీవో)లకు అప్పగించినట్లు నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(అడ్మిన్) జి.అనిల్‌కుమార్ తెలిపారు. హెచ్ఆర్ఎంఎస్‌లో సర్వీస్ బుక్ డేటాను పొందుపరిచినప్పటికీ ఉద్యోగి లేదా ఇంజనీర్, డీడీవో మాత్రమే దీన్ని చూసే అవకాశం ఉంటుంది. హెచ్ఆర్ఎంఎస్ వెబ్‌సైట్‌లో ఉద్యోగి తన లాగిన్ ఐడీని నమోదు చేస్తే ఆ తర్వాత రిజిస్టర్డ్ ఫోన్ నెంబర్‌కు ఓటీపీ(వన్ టైమ్ పాస్‌వర్డ్) వస్తుంది. ఆ ఓటీపీని నమోదు చేయగానే సమగ్ర వివరాలు ఉద్యోగి/ఇంజనీర్ ముందుంటాయి.


ఖమ్మం రూరల్ మండలం కోటనారాయణపురంలో సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

## సర్వేతో ప్రజల అవసరాలేంటో తెలుస్తాయ్

» ఖమ్మంలో సర్వేను ప్రారంభించిన మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్/ నేలకొండపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో ప్రజలకు ఏమేం అవసరాలు ఉన్నాయో ప్రభుత్వానికి తెలుస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివా్‌సరెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి పంచాయతి పరిధిలోని కోటనారాయణపురం గ్రామంలో ఆయన సర్వేకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడైనా కులగణన చేయాలంటే తెలంగాణ రాష్ట్రం మోడల్‌గా నిలుస్తుందని తెలిపారు. ప్రతీ ఎన్యూమరేటర్ 170 ఇళ్ల వరకు సర్వే చేస్తారని, 75 కాలమ్‌లతో కులగణన సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులు ఏ చిన్న పొరపాటు, తప్పిందం జరగకుండా పూర్తి పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలని సూచించారు.

## శ్రీశైలం నుంచి నీటి తరలింపు ఆపండి

» ఏపీ సర్కారు సహా ఇరు రాష్ట్రాల జెన్‌కోలకు తెలంగాణ నీటి పారుదల శాఖ లేఖ

హైదరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లోలు తగ్గినందున.. పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపును నిలిపివేయాలని ఏపీ సర్కారును తెలంగాణ నీటిపారుదల శాఖ కోరింది. అలాగే, ప్రాజెక్టుకు ఇరువైపులా ఉన్న కుడి, ఎడమ జలవిద్యుత్తు కేంద్రాల్లో ఉత్పత్తిని ఆపేయాలని విజ్ఞప్తి చేసింది. శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నిల్వలు వేగంగా తగ్గుతున్నాయి. ఈ విషయమై ఇప్పటికే కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) కూడా స్పందించింది. అవసరం లేకున్నా పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపును అడ్డుకోవాలని, శ్రీశైలం, సాగర్‌లో జలవిద్యుత్ ఉత్పాదనను నిలిపివేయాలని కోరింది. తాజాగా తెలంగాణ నీటిపారుదల శాఖ కూడా ఈ అంశంపై స్పందించింది. తాగు, సాగు నీటి అవసరాల కోసం శ్రీశైలంలో నిల్వలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందంటూ తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ శుక్రవారం తెలంగాణ జెన్‌కోతో పాటు ఏపీ జలవనరుల శాఖ, ఏపీ జెన్‌కోకు లేఖ రాశారు. తక్షణమే పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపును నిలిపివేసి, జలవిద్యుత్ ఉత్పాదనను ఆపాలని కోరారు.

## టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపునకు 18 వరకు గడువు

పదో తరగతి వార్షిక పరీక్ష రుసుం తేదీలను అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఎలాంటి ఆలస్యం రాకుండా ఈ నెల 18వ తేదీ వరకు విద్యార్థులు రుసుం చెల్లించడానికి గడువును నిర్ణయించారు. ఆ తర్వాత రూ. 50 ఆలస్య రుసుంతో డిసెంబరు 2వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. రూ. 200 ఆలస్య రుసుంతో డిసెంబరు 12 వరకు, రూ. 500 ఆలస్య రుసుంతో డిసెంబరు 21వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. ప్రతీ సబ్జెక్టుకు రూ. 125 చొప్పున రుసుం చెల్లించాలి. ఒకేషనల్ అభ్యర్థులైతే... అదనంగా మరో రూ. 60లను చెల్లించాల్సి ఉంటుంది.

## మలేషియా వెళ్లిన టీపీసీసీ చీఫ్ మహేశ్

మలేషియా తెలంగాణ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ శుక్రవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. మలేషియాలో శనివారం ప్రారంభం కానున్న వేడుకల్లో మహేశ్‌గౌడ్‌తో పాటు మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

## డిసెంబరు 29న ఎంపీహెచ్ఏ రాత పరీక్ష

ఎట్టకేలకు మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫీమేల్ (ఎంపీహెచ్ఏ) నియామక రాత పరీక్ష తేదీ ఖరారైంది. డిసెంబరు 29న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు మెడికల్ బోర్డు కార్యదర్శి గోపీకాంత్ రెడ్డి వెల్లడించారు. ఏఎన్ఎం పోస్టుల భర్తీకి గతేడాది జూలై 26న మెడికల్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది. 1,520 ఎంపీహెచ్ఏ పోస్టుల భర్తీకి గతేడాది ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 19 వరకు దరఖాస్తులు స్వీకరించింది. మొత్తం 24వేల దరఖాస్తులు వచ్చాయి. నవంబరు 10న రాత పరీక్ష నిర్వహిస్తామని బోర్డు ప్రకటించింది. అయితే రాత పరీక్ష నిర్వహించే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చింది. దీనికితోడు వైద్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో ఎంపీహెచ్ఏలు ఈ నియామక ప్రక్రియను వ్యతిరేకిస్తూ... తమను రెగ్యులరైజ్ చేయాలని పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. దాంతో సర్కారు వారికిచ్చే వెయిటేజ్‌ను 20-30 మార్కులకు పెంచింది. మరో 411 పోస్టులను పెంచింది. దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 1,931కు పెరిగింది.

## శనగ విత్తనాలకు సబ్సిడీ..క్వింటాల్‌కు రూ.300

రాష్ట్రంలో ఆరేళ్ల క్రితమే విత్తన సబ్సిడీ పథకాలు నిలిచిపోగా.. తాజాగా శనగ విత్తనాలకు సబ్సిడీ ప్రకటించి విత్తనాభివృద్ధి సంస్థ తొలి అడుగు వేసింది. క్వింటాల్‌కు రూ.300 చొప్పున సబ్సిడీ ఇస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఎండీ ఉదయ్‌కుమార్ తెలిపారు. శనివారం నుంచే ఈ సబ్సిడీ పథకం అమలులోకి వస్తుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో రాష్ట్రస్థాయి అధికారులు, ప్రాంతీయ మేనేజర్లతో చైర్మన్, ఎండీ సమావేశం నిర్వహించారు. జేజీ-11, జాకీ రకాల విత్తనాలు 20 వేల క్వింటాళ్లు అందుబాటులో ఉంచినట్లు వారు తెలిపారు. క్వింటాల్ శనగ విత్తనాల ధర రూ.9 వేలు ఉండగా.. రూ.300 సబ్సిడీ పోగా, రూ.8,700 చొప్పున రైతులకు పంపిణీ చేస్తామని వెల్లడించారు. దీంతో పాటు 50 వేల క్వింటాళ్ల నాణ్యమైన వరి విత్తనాలను కూడా విత్తనాభివృద్ధి సంస్థ పంపిణీ చేయనుందని, ఆర్ఎన్ఆర్-15048, కేఎన్ఎం-1638, జేజీఎల్-27356, ఎంటీయూ-1010, కేఎన్ఎం-118, జేజీఎల్-24423 రకాల నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచామని వివరించారు. నకిలీ విత్తనాలకు ఏమాత్రం తావివ్వొద్దని, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు.

## వైద్య సీట్ల కేసులో చలిమెడను విచారించిన ఈడీ

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెడికల్ సీట్ల కేటాయింపుల్లో అవకతవకల కేసు లో బీఆర్ఎస్ నాయకుడు, చలిమెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ చైర్మన్ చలిమెడ లక్ష్మీనరసింహారావును ఈడీ అధికారులు శుక్రవారం విచారించారు. ఆయనపై నీట్ పీజీ మెరిట్ ఆధారంగా కన్వీనర్ కోటా కింద సుమారు 45 సీట్లను ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థుల పేర్లతో బ్లాక్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాళోజీ యూనివర్సిటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత సంవత్సరం జూన్‌లో ఈడీ దాడులు చేసిన విషయం తెలిసిందే.

## నిబంధనలు పాటించని సంస్థలపై రెరా కొరడా

» ఏడేళ్లలో రూ.36.82 కోట్ల అపరాధ రుసుం విధింపు

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని రియల్ ఎస్టేట్ సంస్థలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (రెరా) కొరడా ఝుళిపిస్తోంది. ప్రాజెక్టులకు అనుమతులు పొందకపోయినా, ప్రీలాంచింగ్ పేరుతో మోసాలకు పాల్పడినా వదిలిపెట్టడంలేదు. రెరా చట్టాన్ని రాష్ట్రంలో నోటిఫై చేసిన తర్వాత ఉల్లంఘనలకు పాల్పడిన ప్రాజెక్టులకు రూ.36 కోట్లకుపైగా అపరాధ రుసుం విధించారు. ఇందులో రూ.15 కోట్లకుపైగా వసూలు చేసినట్టు అథారిటీ తెలిపింది. నిబంధనలు పాటించకున్నా, రెరా రిజిస్ట్రేషన్ లేకుండా విక్రయాలు చేసినా ప్రాజెక్టు మొత్తం విలువలో 10శాతం వరకు అపరాధ రుసుం విధించే అధికారం రెరాకు ఉంది. 2018-19 నుంచి 2024-25 వరకు ఏడేళ్లలో నిబంధనలు ఉల్లంఘించిన 1,051 ప్రాజెక్టులకు రూ.36,82,40,132 అపరాధ రుసుం విధించగా.. ఇందులో ఇప్పటివరకు రూ.15,48,10,342 వసూలు చేశారు. 2018-19లో 335 ప్రాజెక్టులకు రూ.30.65 లక్షలు, 2023-24లో 311 ప్రాజెక్టులకు రూ.26,69,02,565 కోట్లు, 2024-25లో 169 ప్రాజెక్టులకు రూ.4,02,91,670 కోట్ల అపరాధ రుసుం విధించారు. నిర్మాణాలు పూర్తయ్యాక ప్రకటనల్లో చూపినట్లు నిర్మాణాలు లేకున్నా, అనుమతులు పొందాక డిజైన్లలో మార్పులు చేసినా కొనుగోలుదారుల ఫిర్యాదుల ఆధారంగా రెరా చర్యలు తీసుకుంటోంది. సామాజిక మాధ్యమాల ద్వారా కొనుగోలుదారులను తప్పుదారి పట్టించే సంస్థలు, ఏజెంట్ల పట్ల కఠినంగానే వ్యవహరిస్తున్నామని తెలంగాణ రెరా చైర్మన్ ఎన్. సత్యనారాయణ తెలిపారు.

## స్కిల్ వర్సిటీలో భవనానికి భూమిపూజ

### మెయిల్ ప్రతినిధులు, వీసీ ఆధ్వర్యంలో కార్యక్రమం

కందుకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండం మీర్ఖాన్‌పేటలో మంజూరు చేసిన స్కిల్ యూనివర్సిటీలో భవన నిర్మాణాలకు అడుగు పడింది. మీర్ఖాన్‌పేటలోని 112 సర్వే నంబరులో 57 ఎకరాల్లో యూనివర్సిటీ నిర్మాణానికి ఆగస్టు 1న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.200 కోట్లతో యూనివర్సిటీలో భవనాలను నిర్మించడానికి మెయిల్(ఎంఈఐఎల్) సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు శుక్రవారం మెయిల్ డైరెక్టర్ రవి రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శివకుమార్ ఆధ్వర్యంలో నెట్ జీరో వ్యాలీలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మెయిల్ ప్రతినిధులు మాట్లాడారు. తెలంగాణ అవతరణ దినోత్సవం నాటికి తొలి దశ భవన నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఎయిర్ కండిషనర్లు లేకుండా ఓపెన్ ఎయిర్ వ్యవస్థ, చక్కటి వెంటిలేషన్‌తో భవనాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు. అకడమిక్, అడ్మిషన్ బ్లాక్స్. లైబ్రరీ, ఆడిటోరియం, అత్యాధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ సుబ్బారావు పాల్గొన్నారు.



భవనానికి భూమి పూజ చేసిన మెయిల్ ప్రతినిధులు

# అడ్డుకుంటే కుక్కచావే!



యాదాద్రి జిల్లా సంగెం వద్ద మూసీ పునరుజ్జీవ యాత్రలో సీఎం రేవంత్, ప్రత్యేక బోటులో మూసీని పరిశీలించేందుకు వెళుతున్న దృశ్యం

(మొదటిపేజీ తరువాయి)

గంగా, సబర్మతి నదులను రూ.40 వేల కోట్లతో సుందరీకరణ చేసుకుంటే, తాను తెలంగాణ ముఖ్యమంత్రిగా మూసీ పునరుజ్జీవం చేయొద్దా? అని ప్రశ్నించారు. ప్రధాని చేసిన పనిని మెచ్చుకుంటూ.. మూసీ ప్రక్షాళనపై నకిలీ బీజేపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. కమీషన్ల కోసమే మూసీ ప్రాజెక్టు చేపట్టానని బీఆర్ఎస్ అంటోందని, ఈ మూసీ ప్రక్షాళన చేయకపోతే తన జన్మ దండగ అని భావోద్వేగానికి లోనయ్యారు. "రూ.1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన చేపట్టి.. రూ.25 వేల కోట్లు దోచుకునే ప్రయత్నం చేస్తున్నామంటున్నారు. మీలాగా కాళేశ్వరం నిర్మించి రూ.లక్ష కోట్లు దోచుకోలేదు. డబ్బులు సంపాదించాలనుకుంటే కేసీఆర్ తెచ్చిన ధరణితో కోకాపేటలో 500 ఎకరాల్లో తప్పిదాలు చేస్తే.. రూ.50 వేల కోట్లు వస్తాయి. రంగారెడ్డి, హైదరాబాద్, ఉమ్మడి నల్లగొండ జిల్లాల ప్రజల ప్రయోజనాల కోసం మూసీ ప్రక్షాళనకు పూనుకున్నాం. బీఆర్ఎస్‌కు దోచుకోవడం తప్ప మేలు చేయడం తెలియదు. అందుకే మూసీ పునరుజ్జీవాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారు" అని సీఎం రేవంత్ ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళనకు అండగా ఉంటానని చెప్పిన కమ్యూనిస్టు సోదరులకు ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. ఒకనాడు మంచినీటిని అందించిన మూసీనది ప్రస్తుతం మురికికూపంగా మారి విషాన్ని చిమ్ముతోందని సీఎం రేవంత్ అన్నారు. పాలకులు పగబట్టారా? దేవుడు శాపం పెట్టాడా? అన్న పరిస్థితితో మూసీ పరివాహక ప్రాంత ప్రజలు బాధ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో కులవృత్తులు చేసుకునే పరిస్థితి లేదని, ఇక్కడ పండిన పంటలు తినేలా లేవని, ఇక్కడ పశువుల పాలు తాగాలన్నా ఆలోచించాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. ఎంతో సంతోషంగా బతికిన ఇక్కడి ప్రజలు.. ప్రస్తుతం భూములు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. "5నెలలపాటు మీ కుమార్తె జైలుకు పోతేనే దుఃఖం వచ్చింది. మూసీ పరివాహక ప్రాంత బిడ్డల జీవితాలు పోతుంటే మీకు పట్టదా? మా బిడ్డలు కాళ్లు, నడుము వంకర్లతో పుడితే వాళ్లను ఇంట్లోనే ఉంచి తల్లులు పనికి వెళ్తున్నారు. ఆ బిడ్డల బాధ పట్టదా? నల్లగొండ జిల్లా ప్రజలు మీకు ఓట్లు వేయలేదని మూసీ ప్రక్షాళనను అడ్డుకోవాలని చూస్తున్నావా కేసీఆర్? నల్లగొండ పౌరుషాల గడ్డ. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే మూసీలోనే పాతరేస్తారు" అని రేవంత్ అన్నారు.

### జన్మ ధన్యమైంది..

"ఇది జన్మదినం కాదు.. ఇక్కడికి రావడంతో నా జన్మ ధన్యమైంది. సంగెం శివయ్యను దర్శించుకుని సంకల్పం తీసుకున్నాను. మూసీ ప్రక్షాళన చేసి తీరతాం. నేటి పాదయాత్ర ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా 2025 జనవరిలో ఉంది. వాడపల్లి నుంచి హైదరాబాద్ చార్మినార్ వరకు లక్షలాది మందితో కదం తొక్కుతాం. బిల్లా, రంగా (కేటీఆర్, హరీశ్‌రావు)లకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే నాతోపాటు పాదయాత్ర చేపట్టాలి.. ఈ ప్రాంతానికి రావాలి. ఇక్కడి ప్రజలు మిమ్మల్ని రానిస్తారో, నడుముకు తాడుకట్టి మూసీలో ముంచేస్తారో చూద్దాం" అంటూ సీఎం ఘాటు వ్యాఖ్యలు చేశారు. రూ.2 కోట్లతో భీమలింగం శివన్న దర్శనానికి ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కోటి మంది ప్రజలకు ఇబ్బందిగా మారిన మూసీ ప్రక్షాళనకు పార్టీలు రాజకీయాలకతీతంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. మూసీ ప్రక్షాళన చేపడితే బుల్డోజర్లకు అడ్డంగా పడుకొని ఆపుతామని కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఎవరు అడ్డొచ్చినా బుల్డోజర్లతో తొక్కుకుంటూ మూసీ ప్రక్షాళనను ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు. తనను జైలులో పెడితే యోగా చేసి స్లిమ్‌గా తయారై బయటికి వస్తానంటూ కేటీఆర్ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

### సీఎం యాత్ర సాగిందిలా..

సీఎం రేవంత్‌రెడ్డి.. మూసీ పునరుజ్జీవ పాదయాత్రను యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద చేపట్టారు. సాయంత్రం 3.30 గంటలకు సంగెం వద్దకు చేరుకున్న సీఎం.. తొలుత మూసీనది ఒడ్డున ఉన్న భీమలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. శివలింగాన్ని గుండెలకు హత్తుకున్నారు. అక్కడే ప్రజాప్రతినిధులు, అధికారులతో భీమలింగం అభివృద్ధికి సంబంధించి చర్చించారు. అనంతరం ఎన్‌డీఆర్ఎఫ్ బృందానికి చెందిన బోటు ఎక్కి మూసీలో కొద్దిదూరం ప్రయాణించి నదిలోని నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడారు. మూసీ కాలుష్యం కారణంగా కులవృత్తులవారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులతో చర్చించారు. కాగా, ఈ ప్రాంతంలో పండిన పంటలను కొనుగోలు చేయడంలేదని రైతులు సీఎంతో చెప్పారు. మూసీ ప్రక్షాళనతోనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. 4.09 నిమిషాలకు సీఎం రేవంత్‌రెడ్డి భీమలింగం కత్వ నుంచి మూసీ పునరుజ్జీవ యాత్ర చేపట్టారు. యాత్ర రెండున్నర కిలోమీటర్లు కొనసాగి 4.43 గంటలకు ముగిసింది. యాత్ర ముగిసిన ప్రదేశంలోనే ప్రధాన రహదారిపై ముఖ్యమంత్రి ప్రత్యేక రథం ఎక్కి మాట్లాడారు.

### బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల అరెస్టు

నల్లగొండ: యాదాద్రి భువనగిరి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని బీఆర్ఎస్ నేతలు ప్రకటించడంతో శుక్రవారం నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని ఆయన నివాసంలో హౌస్ అరెస్టు చేశారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద అరెస్టుచేసి మునుగోడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గృహనిర్బంధం చేశారు.



ఉద్యోగుల సమస్యలపై..

## క్యాబినెట్ సబ్‌కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కారానికి సూచనలు చేయాల్సిందిగా కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జేఏసీ.. పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా కరువు భత్యా(డీఏ)ల విడుదల, రెండో వేతన సవరణ సంఘం(పీఆర్సీ) సిఫారసుల మేరకు వేతనాల పెంపు, సప్లిమెంటరీ బిల్లుల క్లియరెన్స్, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) రద్దు తదితర పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్లు వచ్చాయి. ఈ సమస్యల పరిష్కారానికి త్వరలోనే క్యాబినెట్ సబ్ కమిటీని వేస్తామంటూ అక్టోబరు 26న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి, సిఫారసులు చేయాల్సిందిగా ఆదేశించింది.

### సర్వేకు ఆటంకాలు సృష్టిస్తే కఠిన చర్యలు: దుద్దిళ్ల

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సామాజిక సమగ్ర కుటుంబ సర్వేకు ఆటంకాలు కల్పించినా, ప్రజల్లో అపోహలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే వివరాల మదింపు.. అప్పటి పాలకులు కోరుకున్న విధంగా జరిగిందన్నారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఉండగా మళ్లీ ఎన్యుమరేషన్ అవసరమా అంటూ బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపై శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన స్పందించారు. సామాజిక, ఆర్థిక, విద్య, సమగ్ర కులగణన అనగానే గులాబీ, కమలం పార్టీలు ఆందోళన చెందుతున్నాయని విమర్శించారు.

# ఘనంగా సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ, ప్రముఖులు .. గాంధీభవన్‌లో బాణసంచా కాల్చి.. మిఠాయిల పంపిణీ

» రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించిన కార్యకర్తలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌రెడ్డి చిరకాలం ఆరోగ్యంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, సినీనటుడు చిరంజీవి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అమెరికా, బ్రిటిష్ కౌన్సిల్ జనరల్స్ జెన్నిఫర్ లార్సెన్, గరెత్ విన్ తదితరులు రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మ వారిని ప్రార్థిస్తున్నానంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్.. 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గాంధీభవన్‌లో మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో రేవంత్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేశారు. పలువురు చిన్నారులు సీఎం మాస్కు ధరించి సంబరాల్లో పాల్గొన్నారు. అలాగే, పార్టీ సోషల్ మీడియా బృందం కేక్ కట్ చేసి సీఎంకు శుభాకాంక్షలు తెలిపింది. రేవంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 50 అడుగుల రేవంత్ చిత్రపటాన్ని రంగులతో తీర్చిదిద్దారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నేతృత్వంలో రంగోలి చిత్రకారుడు పురుషోత్తం సీఎం చిత్రపటాన్ని వేశారు. ఇందులో రేవంత్ ఫొటోతో పాటు 'హ్యాపీ బర్త్‌డే రేవంత్ అన్న' అని రాశారు. ఈ భారీ చిత్రాన్ని గీసేందుకు కళాకారులు 20 గంటల పాటు శ్రమించారు. అలాగే, రేవంత్ పుట్టిన రోజు సందర్భంగా పారిశుధ్య కార్మికులు, ఆశా వర్కర్లకు చీరలు పంపిణీ చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులకు నాలుగేళ్లలో సినిమా చూపిస్తామని కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. రేవంత్ ముఖచిత్రంతో నేసిన అగ్గిపెట్టెలో పట్టే బంగారు శాలువాను హస్నాబాద్‌కు చెందిన అక్కు శ్రీనివాస్ సీఎంకు బహూకరించారు.


సీఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్


మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 50 అడుగుల రేవంత్ ముఖచిత్రంతో వేసిన రంగోలి

### పునర్నిర్మాణంలో సీఎం పాత్ర కీలకం: నీలం మధు

తెలంగాణ పునర్నిర్మాణంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలకపాత్ర పోషిస్తున్నారని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. సంక్షేమ రంగానికి పెద్దపీట వేస్తూ.. ఆరు గ్యారంటీల అమలు కోసం సీఎం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పదేళ్లుగా దోపిడీకి గురైన తెలంగాణను గాడిలో పెట్టేందుకు రేవంత్ చేస్తున్న పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు నిండు మనసుతో మద్దతు పలుకుతున్నారని చెప్పారు.

## కాంగ్రెస్‌లోకి రావాలని ఎమ్మెల్యేలను దానం రెచ్చగొట్టారు

» అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకోబోరని దానంకు ముందే ఎలా తెలిసింది?

» అనర్హత పిటిషన్‌లపై ధర్మాసనం ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాదనలు

హైదరాబాద్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్‌లను పరిష్కరించి తుది నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు గరిష్ఠంగా 3 నెలల సమయం మాత్రమే ఉంటుందని, ఆలోపే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌లపై నాలుగువారాల్లో విచారణ ప్రారంభించాలనే సింగిల్ జడ్జి తీర్పుపై రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం విచారణ కొనసాగించింది. పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాలని కోరుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు కొనసాగించారు. తగిన సమయం(రీజనబుల్ టైం) అంటే గరిష్ఠంగా మూడునెలలే అని కైశం మేఘాచంద్రసింగ్' తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత కేసులో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్ మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కూడా కాంగ్రెస్‌లోకి రావాలని బహిరంగంగా రెచ్చగొట్టారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అనర్హత గురించి భయపడవద్దని, అనర్హతపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోరని దానం చెప్పారని గుర్తుచేశారు. స్పీకర్ అనర్హత పిటిషన్‌లపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోరని పార్టీ మారిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఎలా తెలిసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తరఫున వాదనల కోసం తదుపరి విచారణ సోమవారానికి వాయిదా పడింది.

## హైదరాబాద్ సీపీ డీపీతో వాట్సాప్ కాల్స్

» సైబర్ కేటుగాళ్ల నయా ఎత్తుగడ

» అలాంటి కాల్స్‌కు స్పందించకండి : సీపీ సీవీ ఆనంద్ సూచన

హైదరాబాద్ సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టుల పేరిట నయా దందాకు తెరలేపిన సైబర్ మాయగాళ్లు.. జనాన్ని భయపెట్టేందుకు కొత్త ఎత్తుగడను అమలు చేస్తున్నారు. పోలీసు అధికారుల చిత్రాలను డిస్‌ప్లే పిక్చర్(డీపీ)గా పెట్టుకుని వాట్సాప్ కాల్స్ చేస్తూ జనాన్ని బురిడీ కొట్టించాలని చూస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురికి నగర పోలీసు కమిషనర్(సీపీ) సీవీ ఆనంద్ చిత్రం డీపీగా ఉన్న వాట్సాప్ నెంబర్ నుంచి శుక్రవారం కాల్స్ వచ్చాయి. ఆ ఫోన్ నెంబర్ పాకిస్థాన్ కంట్రీ కోడ్(+92)తో ప్రారంభం కావడం గమనార్హం. భారతదేశ నెంబర్లు +91 కంట్రీ కోడ్‌తో ప్రారంభమవుతాయి. కాగా, సీపీ చిత్రం డీపీగా ఉండడం, ఫోన్ నెంబర్ అనుమానాస్పదంగా ఉండడంతో ఆ కాల్స్‌కు స్పందించని కొందరు విషయాన్ని సైబర్ క్రైమ్‌తోపాటు సీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన సీపీ సీవీ ఆనంద్.. తన ఫొటో డీపీగా ఉన్న నెంబర్ నుంచి వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని, సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన చేశారు. ఏమైనా అనుమానాలు ఉంటే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930, డయల్-100/122 నంబర్‌లకు ఫోన్ చేసి పోలీసులను సంప్రదించాలని కోరారు.



సీపీ సీవీ ఆనంద్ డీపీతో సైబర్ నేరగాళ్లు చేసిన కాల్స్

## శునకాల కళేబరాలు తొలగించారు
## బతికున్న వాటికి ఆహారం పెట్టారు

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన మంచిర్యాల యంత్రాంగం
- ఎక్స్ వేదికగా స్పందించిన మాజీ మంత్రి హరీశ్ రావు



శునకాల కళేబరాలను తొలగిస్తున్న సిబ్బంది

మంచిర్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేసేందుకు తెచ్చిన వీధి శునకాలు మృత్యువాత పడిన ఘటనపై అధికార యంత్రాంగం కదిలింది. మంచిర్యాల పశు సంరక్షణ కేంద్రంలో చనిపోయిన వీధి శునకాల కళేబరాలను సిబ్బంది శుక్రవారం తొలగించారు. అలాగే, ప్రాణాలతో ఉన్న శునకాలకు ఆహారం అందించారు. పది రోజులుగా ఆహారం లేక మంచిర్యాల పశు సంరక్షణ కేంద్రంలో వీధి కుక్కలు మృత్యువాత పడిన ఘటనపై 'ఈ పాపం ఎవరిది' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. మంచిర్యాల జిల్లా కలెక్టర్ దీపక్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం పశు సంరక్షణ కేంద్రానికి చేరుకున్న మునిసిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్.. డాగ్ క్యాచర్లతో శునకాల కళేబరాలను బయటకు తీయించి ఖననం చేయించారు. అలాగే, ఆ గదిని శుభ్రం చేయించి ప్రాణాలతో ఉన్న శునకాలకు ఆహారం పెట్టించారు. కాగా, వీధి శునకాల మృత్యువాతపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి మాజీ హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారుల అలసత్వం మూగజీవుల మౌనరోదనకు కారణమైందని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విదేశాల్లో ఉద్యోగాల పేరుతో...
## కంబోడియాలో సైబర్ నేరాలు

- కీలక నిందితుడి అరెస్ట్

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాల పేరుతో కంబోడియాకు అమాయకుల్ని తరలించి వారితో బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్న ముఠాలో కీలక సభ్యుడ్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీ సీఎస్‌బీ) పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుధాకత్ ఖాన్ మరికొందరితో కలిసి తెలంగాణతోపాటు ఇతర ప్రాంతాల నుంచి యువతను విదేశాల్లో ఉద్యోగాల పేరుతో కంబోడియా తరలించేవారు. అక్కడ వారి పాస్‌పోర్టులు తీసుకుని, నిర్బంధించి సైబర్ నేరాలు ఎలా చేయాలనేదానిపై ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించి చేయించేవారు. మాట వినని వారిపై విచక్షణారహితంగా దాడులు చేయడంతోపాటు బలవంతంగా డబ్బులు వసూలు చేసి తిరిగి పంపిస్తుంటారు. కరీంనగర్ జిల్లాకు చెందిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఎస్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గుర్ని అరెస్ట్ చేయగా తాజాగా లభించిన సమాచారం మేరకు సుధాకత్ ఖాన్‌ను అరెస్ట్ చేశారు. మాల్దీవుల నుంచి తిరిగి వస్తుండగా పక్కా సమాచారంతో ఇటీవల అతడిని ఢిల్లీలో అరెస్ట్ చేసినట్లు సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు.

## బీసీ గురుకులంలో విద్యార్థులకు అస్వస్థత

- 12 మందికి వాంతులు, విరేచనాలు
- నారాయణఖేడ్ మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలలో ఘటన

నారాయణఖేడ్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులానికి చెందిన 12 మంది విద్యార్థులు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. జ్వరం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. దీంతో విద్యార్థులను తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. స్వల్పంగా అస్వస్థతకు గురైన వారికి సిబ్బంది మందులను అందజేశారు. గురుకులంలో ఉన్న నీటిశుద్ధి ప్లాంటు పాడైపోవడంతో కొన్ని నెలలుగా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీతో నీరు కలుషితమౌతోందని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు వాపోతున్నారు. రెండు నెలల క్రితం గురుకులాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సంజీవ రెడ్డి ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని సిబ్బందిని ఆదేశించానా ఆ దిశగా చర్యలు కరువయ్యాయని స్థానికులు ఆరోపించారు.

## జపాన్‌లో లీడర్‌షిప్ శిక్షణకు ఎంపికైన
## రామవరం ఎంసీహెచ్ నర్సింగ్ అధికారి స్వప్న


నర్సింగ్ ఆఫీసర్ స్వప్న

చుంచుపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మాతా, శిశు మరణాల రేటు శాతం తగ్గించడానికి భారత దేశం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన లీడర్‌షిప్ శిక్షణకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్) పరిధిలోని రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) నర్సింగ్ అధికారి సూర్నపు స్వప్న ఎంపికయ్యారు. ప్రపంచంలోనే టెక్నాలజీకి నిలయంగా, మాతాశిశు మర ణాలు లేని దేశంగా పేరు ప్రఖ్యాతలు గడించిన జపాన్ వేదికగా ఈనెల 12 నుంచి 24వ తేదీ వరకు ఆ శిక్షణ కొనసాగనుంది. మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కోసం జపాన్ చేపట్టిన విధి, విధానాలు, కారాచరణ, నియమాలను తెలుసుకునేందుకు భారత్ నుంచి ఏడుగురు సభ్యుల బృందం అక్కడికి వెళ్లనుంది. రాష్ట్రం నుంచి నైపుణ్యం, అనుభవం కలిగిన నర్సింగ్ అధికారులను పంపించాలని అధికారులు నిర్ణయించారు. రాష్ట్ర కుటుంబ, సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్.. భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లాలో పనిచేస్తున్న స్వప్నతో పాటు వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న మరో నర్సింగ్ అధికారి పేరును ప్రతిపాదించగా, జపాన్ శిక్షణాకేంద్రం ప్రతినిధులు శుక్రవారం వారి పేర్లను ఖరారు చేశారు.

## ఏసీబీకి చిక్కిన వర్ని ఎస్సై


ఎస్సై కృష్ణకుమార్

వర్ని(కోటగిరి), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ కేసులో స్టేషన్ బెయిల్ కోసం రూ. 20వేలు లంచం తీసుకుంటూ నిజామాబాద్ జిల్లా వర్ని ఎస్సై కృష్ణకుమార్ అడ్డంగా దొరికిపోయాడు. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం దాడి చేసి ఆయన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వర్ని మండలంలోని కోటయ్య క్యాంప్‌నకు చెందిన నాగరాజుకు శ్రీకాంత్ అనే వ్యక్తితో ఐదు రోజుల క్రితం చిన్నపాటి గొడవ జరిగింది. ఈ ఘటనలో శ్రీకాంత్ తలకు గాయమైంది. దీంతో అతని ఫిర్యాదు మేరకు నాగరాజుపై ఎస్సై కృష్ణకుమార్ కేసు నమోదు చేశాడు. ఈ క్రమంలో తనకు స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిందిగా నాగరాజు ఎస్సైని కోరాడు. అయితే బెయిల్ ఇవ్వాలంటే రూ.50వేలు లంచం ఇవ్వాలని కృష్ణకుమార్ డిమాండ్ చేశాడు. తన వద్ద అంత డబ్బు లేదని రూ. 20వేలు మాత్రమే ఇస్తానని బాధితుడు చెప్పడంతో సరేనన్నాడు. అయితే నాగరాజు.. ఏసీబీని ఆశ్రయించి జరిగిన విషయాన్ని వివరించారు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు మూడు రోజులుగా ఎస్సైపై నిఘా పెట్టి శుక్రవారం పీఎస్‌కు సమీపంలో బాధితుడి వద్ద నుంచి డబ్బులు తీసుకుంటుండగా కృష్ణకుమార్‌ను పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు.

## బర్త్‌డే ముందు రోజే విద్యార్థి ఆత్మహత్య

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాలేజీ మార్చాలని తల్లిదండ్రులను కోరగా, వారు ససేమిరా అనడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చాగల్ గ్రామానికి చెందిన పసునూరి వేణుగోపాల్-సుకన్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పసునూరి సాయికిరణ్ (17) హన్మకొండలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. దీపావళి పండుగ పురస్కరించుకొని హాస్టల్ నుంచి ఇంటికి వచ్చాడు. తాను చదువుతున్న కాలేజీకి వెళ్లలేనని విముఖత వ్యక్తం చేశాడు. మరో కాలేజీలో చేర్పించాలని తండ్రిని కోరాడు. దానికి తండ్రి నిరాకరించడంతో మనస్తాపం చెందిన సాయికిరణ్ శుక్రవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం సాయికిరణ్ పుట్టిన రోజు సందర్భంగా గుడికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేశామని, కానీ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు విలపించారు.

## జలాలపై జాలీగా.. ఆకాశమే హద్దుగా..

- నీటిపై నుంచి నింగిలోకి ఎగిరిన సీప్లేన్
- సెమీ ట్రయల్ రన్ విజయవంతం
- నేడు సీఎం చేతుల మీదుగా ట్రయల్ రన్
- సీప్లేన్‌లో విజయవాడ నుంచి శ్రీశైలానికి చంద్రబాబు


పాతాళగంగ వద్ద సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీశైలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగానికి ఊపు తెచ్చేందుకు రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా చేపడుతున్న సీప్లేన్ సర్వీస్‌కు శుక్రవారం నిర్వహించిన సెమీ ట్రయల్ రన్ విజయవంతమైంది. విజయవాడ ఇంద్రకీలాద్రి, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయాల మధ్య టెంపుల్ టూరిజానికి మరింత ఆకర్షణ, ఆదరణ తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం సీప్లేన్ సేవలకు శ్రీకారం చుట్టనుంది. 'స్కై-మీట్స్ సీ' పేరుతో విజయవాడ-శ్రీశైలం మధ్య ప్రయోగాత్మకంగా చేపడుతున్న సీప్లేన్ సర్వీసుకు సంబంధించిన డెమో కార్యక్రమా (ట్రయల్ రన్)న్ని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ప్రారంభిస్తారు. దీని కోసం శుక్రవారం ముందుగానే సెమీ ట్రయల్ రన్ నిర్వహించారు. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి బయల్దేరిన సీ ప్లేన్ రెండున్నర గంటల్లో శ్రీశైలానికి చేరుకుంది. ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, టూరిజం, ఎయిర్ ఫోర్స్ అధికారుల సమక్షంలో సెమీ ట్రయల్ రన్‌ను పరిశీలించారు. కాగా, శనివారం నిర్వహించే ట్రయల్ రన్ సందర్భంగా సీఎం చంద్రబాబు సీప్లేన్‌లో విజయవాడ నుంచి శ్రీశైలం చేరుకుంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణు చరణ్, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీప్లేన్ ల్యాండయ్యే ప్రదేశం, పాతాళగంగ బోటింగ్ ప్రదేశం నుంచి రోప్‌వేను పరిశీలించారు. 523 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు 10 స్పెషల్ పార్టీలు, నాలుగు గ్రేహౌండ్స్ బృందాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు.

# ధాన్యం.. మాయం!

(మొదటిపేజీ తరువాయి)


ధాన్యం సేకరణపై మంత్రివర్గం ఉపసంఘం భేటీలో పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, తుమ్మల తదితరులు

చేశారు. నిర్మల్ జిల్లాలోని 17 మిల్లుల్లో రూ.107 కోట్ల విలువైన ధాన్యం నిల్వలు లేవని గుర్తించి.. ఆర్ఆర్ యాక్టు కింద కేసులు నమోదు చేశారు. సిరిసిల్ల జిల్లాలో 59 మంది, కరీంనగర్ జిల్లాలో 34 మంది మిల్లర్లు బియ్యం అప్పగించకపోవడంతో డిఫాల్టర్ల జాబితాలో చేర్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 74 రైస్ మిల్లులు ఉండగా... అల్లీపూర్‌లోని లక్ష్మీ నరసింహ రైస్‌మిల్లులో 9.50 కోట్ల విలువైన 3 వేల టన్నుల ధాన్యం మాయమైనట్లు తేలింది. నారాయణపేట్ జిల్లాలోని 37 మిల్లుల్లో సీఎంఆర్ పెండింగ్ ఉండగా... ఆరు మిల్లులపై కేసులు నమోదు చేశారు. గద్వాల జిల్లాలో 11 రైస్‌మిల్లుల్లో 7,520 టన్నుల ధాన్యం మాయం కాగా, అన్నపూర్ణ ట్రేడర్స్, సూర్య ట్రేడర్స్ కృష్ణ రైస్ మిల్లు యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టారు. కామారెడ్డి జిల్లాల్లో బియ్యం బకాయిలు ఉన్న 49 రైస్ మిల్లులను డిఫాల్ట్ జాబితాలో చేర్చారు. కొత్తగూడెం జిల్లా మణుగూరులోని శ్రీసాయి రైస్‌మిల్లులో రూ.3 కోట్ల విలువైన ధాన్యం మాయం కాగా, ఆర్ఆర్ యాక్టు కింద కేసు పెట్టి.. జరిమానా విధించారు. పెద్దపల్లి జిల్లా మంథనిలోని మారుతి రైస్ మిల్లులో రూ. 21కోట్లు, లక్ష్మీప్రసన్న రైస్‌మిల్లులో రూ. 8కోట్లు, వెంకటసాయి మిల్లులో రూ.9 కోట్ల విలువైన ధాన్యం మాయమైంది. ఈ మూడు మిల్లులపై క్రిమినల్ కేసులు పెట్టి, వేలం వేసేందుకు నోటీసులు జారీ చేశారు. నిజామాబాద్ జిల్లాలో 49 మిల్లుల్లో రూ. 120 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు తేలగా.. రూ.40 కోట్ల వరకు రికవరీ చేశారు. ఆర్ఆర్ యాక్టు కింద కేసులు నమోదు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని ఆరు మిల్లుల్లో 21 వేల టన్నుల ధాన్యం మాయమైనట్లు తేలింది. వనపర్తి జిల్లాలో 36 మిల్లులపై ఆర్ఆర్ యాక్టు కింద కేసులు నమోదు చేశారు. రూ.50కోట్ల ధాన్యం రికవరీ కావాల్సి ఉంది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మన్‌పహాడ్‌లోని శ్రీసాయిరాం రైస్‌మిల్లుకు 1,988 టన్నుల ధాన్యం కేటాయించగా... కేవలం 143 టన్నుల బియ్యమే తిరిగి ఇచ్చారు. రూ.5.67 కోట్ల విలువైన 1,774 టన్నుల ధాన్యం ఇవ్వకపోవడంతో క్రిమినల్ కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లా కురవి రైస్‌మిల్లులో రూ.13 కోట్లు, మరిపెడ మండలం ఎల్లంపేటలో రూ.11 కోట్లు, గూడూరు మండలం అప్పరాజుపల్లిలో రూ.13 కోట్లు, కేసముద్రంలోని మిల్లులో రూ.14 కోట్లు, మరో మిల్లులో రూ.4 కోట్ల విలువైన ధాన్యం మాయం కాగా, కేసులు నమోదు చేశారు. వరంగల్ జిల్లాలో రూ.13కోట్లు, హనుమకొండ జిల్లాలో రూ.12కోట్ల విలువైన ధాన్యం మాయం కావడంతో ఆయా మిల్లులపై కేసులు పెట్టారు. మంచిర్యాల జిల్లాలో 52 రైస్ మిల్లులుంటే... 39 మిల్లుల యాజమాన్యాలు ధాన్యం అమ్ముకున్నట్లు తేలింది. దీంతో వారందరినీ డిఫాల్టర్ల జాబితాలో చేర్చారు. బెల్లంపల్లిలోని ఒకే మిల్లులో రూ.17కోట్ల విలువైన ధాన్యం మాయం కాగా, యాజమానిని జైలుకు పంపించారు. మెదక్ జిల్లాలో రూ.240 కోట్ల విలువైన ధాన్యం మాయం కాగా...10 మందిపై క్రిమినల్ కేసులు పెట్టారు. ఖమ్మం జిల్లా కొణిజెర్లలో ఉన్న ఎస్ఏఆర్ రైస్‌మిల్లులో రూ.81కోట్ల విలువైన ధాన్యం గల్లంతైనట్లు తెలిసింది.

**దీర్ఘకాలికంగా బకాయిలున్న డిఫాల్టర్లు**

| సీజన్ | రైస్‌మిల్లులు | మాయమైన ధాన్యం |
|---|---|---|
| 2010-18 | 145 | 97183 |
| 2019- 20 | 120 | 1,43,586 |
| 2020- 21 | 82 | 1,68,473 |
| 2021- 22 ఖరీఫ్ | 461 | 3,47,579 |
| 2021- 22 రబీ | 433 | 3,14,130 |
| 2022- 23 ఖరీఫ్ | 393 | 3,67,699 |

## ఎక్కువ ధాన్యం వస్తే..
## కర్ణాటక, తమిళనాడుకు ఎగుమతి

- బ్యాంకు గ్యారెంటీ ఏపీ కంటే ఇక్కడే చాలా తక్కువ
- రైస్‌మిల్లర్లు సహకరించనిచోట్ల
- మధ్యంతర గోదాముల్లో ధాన్యం నిల్వ
- మంత్రివర్గ ఉపసంఘం భేటీలో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవసరానికి మించి ధాన్యం సేకరణ జరిగితే.. మిగులు ధాన్యాన్ని పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలకు ఎగుమతి చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఖరీఫ్ ధాన్యం సేకరణ పూర్తయిన తర్వాత ఈ అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. తెలంగాణపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి పౌరసరఫరాల భవన్‌లో మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్‌లు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రైస్‌మిల్లర్లు సహకరించని చోట్ల ధాన్యాన్ని మధ్యంతర గోదాములకు తరలించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ పరిధిలో 30 లక్షల టన్నుల స్థలాన్ని అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. మధ్యంతర గోదాముల్లో నిల్వచేసి, ఆతర్వాత కస్టమ్ మిల్లింగ్ ఇవ్వటంకోసం అదనపు ఖర్చు ఎంతైన ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఎక్కడా రైతులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఈ సీజన్‌లో 1.50 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశముందన్నారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రంలో రైస్‌మిల్ ఇండస్ట్రీకి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మిల్లర్ల నుంచి 100% బ్యాంకు గ్యారెంటీ తీసుకొని.. ధాన్యం అప్పగిస్తున్నారని, ఇక్కడ కేవలం 10% మాత్రమే బ్యాంకు గ్యారెంటీ సిస్టమ్ పెట్టినట్లు ఉత్తమ్ వెల్లడించారు. బ్యాంకు గ్యారెంటీలు, డిఫాల్టర్లకు జరిమానాలు.. ఇతర రాష్ట్రాలకంటే తెలంగాణలో తక్కువే ఉన్నాయనే విషయాన్ని రైస్‌మిల్లర్లు గ్రహించాలన్నారు. మిల్లింగ్ చార్జీలు కూడా రూ.40 నుంచి రూ.50కి పెంచినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా మిల్లర్లు, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆయన సూచించారు.

## మరో 20 ఏళ్ల తర్వాత..
## రోడ్డు వేయాలన్నా చైనా ఇంజనీర్లే కావాలి!

- దేశంలో సాఫ్ట్‌వేర్‌పై మక్కువతో సివిల్, మెకానికల్ కోర్సులకు తగ్గుతున్న ప్రోత్సాహం
- ప్రతీ విద్యార్థిలో 'సాఫ్ట్‌వేర్' ఒత్తిడి
- మానసిక ఒత్తిడిని జయించేలా.. హైదరాబాద్ ఐఐటీలో నేడు, రేపు జాతీయ స్థాయి సదస్సు
- ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడి

కంది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనే ఆలోచనలతోనే ఉంటున్నారని, అందువల్ల ఒత్తిడి ఎక్కువై సరిగా చదవలేక, అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ-హైదరాబాద్(ఐఐటీ-హెచ్) డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. విద్యార్థులకు సాఫ్ట్‌వేర్‌పై ఉన్న మక్కువ నేపథ్యంలో ప్రైవేట్ కళాశాలకు సివిల్, మెకానికల్ లాంటి కోర్సులను ప్రోత్సహించడం లేదన్నారు. దీంతో, రాబోయే 20 ఏళ్లలో మనదేశంలో రోడ్డు వేయాలన్నా కూడా చైనా నుంచి ఇంజనీర్లను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించేందుకు ఐఐటీ-హైదరాబాదులో శని, ఆది వారాల్లో జాతీయ స్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర విద్యాశాఖ ఆదేశాలతో దేశంలోనే తొలిసారిగా ఐఐటీ-హెచ్‌లో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌మూర్తి హాజరవుతారని, సదస్సులో దేశం నలుమూలల నుంచి వందకు పైగా విద్యాసంస్థలు పాల్గొంటాయని బీఎస్ మూర్తి వివరించారు. వారంతా తమ విద్యాసంస్థల్లో పిల్లలు మానసిక ఒత్తిడిని తట్టుకునేందుకు, మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఎలాంటి పద్ధతులను అనుసరిస్తున్నారో ఐఐటీ-హెచ్‌లో స్టాళ్ల ద్వారా ప్రదర్శించనున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేసేందుకు ఐఐటీ-హెచ్‌లోనూ సన్‌షైన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు మూర్తి ఈ సందర్భంగా తెలిపారు.

## మాదక ద్రవ్యాల కేసులో
## మహిళకు 13 ఏళ్ల జైలు

శంషాబాద్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో మాదక ద్రవ్యాలతో పట్టుబడ్డ మహిళకు రంగారెడ్డి జిల్లా కోర్టు 13 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 2021 జూన్ 2న ఓ మహిళ హరారే నుంచి విమానంలో వచ్చింది. తన బ్యాగేజీ పోయిందంటూ జూన్ 5న తిరిగి విమానాశ్రమానికి వచ్చింది. అధికారులు స్పందించి ఆమె బ్యాగేజీని గుర్తించారు. తనిఖీలు చేయగా అందులో రూ.25.35 కోట్ల విలువ చేసే 3,900 గ్రాముల హెరాయిన్‌ను గుర్తించారు. పోలీసులు దానిని స్వాధీనం చేసుకొని మహిళను అరెస్టు చేశారు. అదనపు సెషన్స్ జడ్జి విచారణ జరిపి మహిళకు ఆ 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధించారు.

# వేడీ ఎక్కువే.. చలీ ఎక్కువే!

## మధ్యాహ్నం 32 ..రాత్రి 18.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు

- రాజధానిలో పెరిగిన చలిగాలులు
- నిరుడు నవంబర్ కంటే 1-2 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు
- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పెరిగిన చలి తీవ్రత



హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేరుకు చలికాలం వచ్చిందన్నమాటే గానీ.. ఒకరకమైన విచిత్రమైన వాతావరణం నెలకొంది! పగటి పూట ఎండ సెగలు.. రాత్రయితే చలిగాలులు.. ఇదీ మూణ్నాలుగు రోజులుగా రాజధాని హైదరాబాద్‌లో పరిస్థితి!! పగటి పూట 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుంటే.. రాత్రిపూట 18-20 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలతో చలి వాతావరణం! కిందటి సంవత్సరం నవంబరులో ఇదే తేదీలతో పోలిస్తే.. ఈ ఏడాది పగటి ఉష్ణోగ్రతలు సగటున 1-2 డిగ్రీలు అధికంగా నమోదవుతుండడం గమనార్హం. గత మూడురోజులుగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో చలిగాలుల తీవ్రత పెరుగుతూ వస్తోంది. ప్రధానంగా చెట్లు ఎక్కువగా ఉన్న శివారు ప్రాంతాల్లో చలిగాలుల ప్రభావం అధికంగా కనిపిస్తోంది. హైదరాబాద్‌లో నవంబరు 5వ తేదీ వరకూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23-20 డిగ్రీల వరకు నమోదవగా.. గత మూడురోజులుగా 18.5 డిగ్రీలకు పడిపోయాయి. శుక్రవారం పటాన్‌చెరులో 15.2, రాజేంద్రనగర్‌లో 16.5, దుండిగల్‌లో 17.9, హకీంపేటలో 18.3, హైదరాబాద్‌లో 18.5, హయత్‌నగర్‌లో 19 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**అప్పుడు.. ఇప్పుడు..**

| తేది | (2023) గరిష్ఠం-కనిష్ఠం | (2024) గరిష్ఠం- కనిష్ఠం |
|---|---|---|
| 05 | 31.3 - 23.2 | 31.0 - 20.2 |
| 06 | 30.8- 22.8 | 32.4 - 18.5 |
| 07 | 30.8 - 22.6 | 32.4 - 18.4 |
| 08 | 30.7- 22.3 | 31.8 - 18.5 |

హైదరాబాద్‌లో గత ఏడాది, ఈ ఏడాది నవంబరు 5, 6, 7, 8 తేదీల్లో నమోదైన గరిష్ఠ- కనిష్ఠ ఉష్ణోగ్రతలు.

### జిల్లాల్లోనూ..

రాష్ట్రంలోని కొన్నిజిల్లాల్లో రాత్రివేళ కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14 డిగ్రీలకు చేరుకున్నాయి. గురువారం సంగారెడ్డి, కుమ్రం భీమ్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 14.1 నుంచి 14.7 డిగ్రీల మధ్య నమోదు అయ్యాయి. శని, ఆది, సోమవారాల్లోనూ.. రాత్రిపూట ఉష్ణోగ్రతలు 15-18 డిగ్రీల మధ్య నమోదు అవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇందులో ఒకటి రెండు జిల్లాల్లో 15 డిగ్రీలలోపు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంటూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# గోరుముద్ద నుంచే బ్యాక్టీరియా

(మొదటి పేజీ తరువాయి)


ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ బారీ మార్షల్

అమ్మ చేతి గోరుముద్ద కూడా కారణమే అని.. దీనిపై విస్తృతస్థాయిలో పరిశోధనలు చేసి 2005వ సంవత్సరంలో నోబెల్ బహుమతి అందుకున్న శాస్త్రవేత్త, ప్రొఫెసర్ బారీ మార్షల్ చెబుతున్నారు. హెచ్.పైలోరీ వల్ల కలిగే నష్టాలు ప్రపంచానికి తెలియజేసేందుకు.. ఆ బ్యాక్టీరియాను తనకు తానే ఎక్కించుకుని, తన ఉదరాన్నే ప్రయోగశాలగా మార్చిన వ్యక్తి ఆయన! అల్సర్, జీర్ణకోశ సంబంధిత క్యాన్సర్‌ల చికిత్సలో.. ఆయన పరిశోధనలు విప్లవాత్మక మార్పులకు కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో.. హెచ్.పైలోరీ గురించి సమగ్రంగా తెలుసుకునేందుకు, భారతదేశంలో ఈ బ్యాక్టీరియా వ్యాప్తి, నివారణ తదితర అంశాలపై విస్తృత పరిశోధనల కోసం దేశంలోనే తొలిసారిగా గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌లో ఆయన పేరిట ఒక రిసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాన్ని ప్రారంభించేందుకు వచ్చిన మార్షల్ ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. భారతదేశంలో దాదాపు 50-60 కోట్ల మంది ఈ బ్యాక్టీరియా బాధితులేనన్నారు. కడుపులోకి ప్రవేశించిన ఈ బ్యాక్టీరియా.. జీర్ణాశయ గోడలకు అంటుకుని ఉండి క్రమంగా జీర్ణప్రక్రియకు కీలకమైన ఆమ్లాల ఉత్పత్తిని అడ్డుకుంటాయని.. దీనివల్ల క్యాన్సర్‌ల బారిన పడే ముప్పు అధికమని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో ఎక్కువ మంది అల్సర్ల బారిన పడటానికి ఈ బ్యాక్టీరియా ఓ కారణమన్న ఆయన.. ఎండోస్కోపీ, రక్త, మల పరీక్షల ద్వారా మాత్రమే కాక.. శ్వాస పరీక్షలతో కూడా ఈ బ్యాక్టీరియా ఉనికిని గుర్తించి చికిత్స చేయొచ్చన్నారు. కుటుంబంలో ఒకరికి ఈ బ్యాక్టీరియా ఉంటే ఆ కుటుంబం మొత్తం బ్యాక్టీరియా బారిన పడినట్లుగానే భావించాల్సి ఉంటుందని తెలిపారు. 90 శాతం చిన్నారులకు ఈ బ్యాక్టీరియా తల్లి ద్వారానే సోకుతుందని పరిశోధనల్లో తేలినట్టు వెల్లడించారు. ఇతరులతో ఆహారం పంచుకుని తినడం, నీటి ద్వారా కూడా ఈ బ్యాక్టీరియా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. పెద్ద వయసు వ్యక్తులలో ఈ బ్యాక్టీరియా లక్షణాలు పెద్దగా కనబడవన్న బారీ.. 10% మంది అల్సర్ల బారిన పడతారని, మరో 5% మందిలో క్యాన్సర్ వచ్చే ప్రమాదమూ ఉందని పేర్కొన్నారు. కుటుంబంలో జీర్ణకోశ క్యాన్సర్లు, అల్సర్ల బారిన పడిన వారు ఉంటే.. వారు శ్వాస పరీక్షలతో పాటుగా ఎండోస్కోపీ లాంటి పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందని.. ఒకవేళ బ్యాక్టీరియా ఉంటే రెండు వారాల పాటు చికిత్సను తీసుకోవాలని వివరించారు. ఇండియాలో యాంటీ మైక్రో బయాల్ రెసిస్టెన్స్ కేసులు పెరుగుతున్నాయి కాబట్టి నూతన ఔషధాలను వాడాల్సి వస్తోంద అనకునేవారమని.. ఆందోళన వెలిబుచ్చారు.

"హెచ్.పైలోరీ బ్యాక్టీరియా వల్ల జీర్ణకోశంలో ఆమ్లాల స్థాయిలు తగ్గిపోయి క్యాన్సర్ బారిన పడే ప్రమాదాలున్నాయి. ఇండియాలో మసాలాలు దట్టించిన ఆహారం తింటుంటారు కాబట్టి.. వారిలో ఆమ్లాల స్థాయిలు మళ్లీ మెరుగుపడే అవకాశాలున్నాయి" అని మార్షల్ నవ్వుతూ అన్నారు. అయితే.. ఇది దీనికి ఎలాంటి ఆధారాలు లేవు అని నవ్వుతూ అన్నారు. ఈ బ్యాక్టీరియా వ్యాప్తిని అడ్డుకునే మార్గాలే లేవన్న ఆయన.. అది ఎవరి ద్వారా అయినా, ఎలాగైనా మన జీర్ణకోశంలో చేరవచ్చన్నారు. పెద్దలలో ఈ బ్యాక్టీరియా కనబడితే టెట్రాసైక్లిన్స్ తరహా యాంటీ బయాటిక్ మందులను వాడాల్సి ఉంటుందన్నారు.

### అభిమాన ప్రొఫెసర్..

బారీ తన అభిమాన ప్రొఫెసర్లలో ఒకరని.. డాక్టర్ నాగేశ్వర రెడ్డి అన్నారు. "అల్సర్లు కేవలం ఎసిడిటీ వల్ల వస్తాయని 1980లలో అనుకునేవారం. కానీ, ఆ సమయంలో బారీ, మైక్రో బయాలజిస్ట్ వారెన్‌లు తమ పరిశోధనల ద్వారా అల్సర్లు, జీర్ణకోశ క్యాన్సర్‌లకు హెచ్ పైలోరీ కారణమని చెప్పారు. అప్పట్లో వారిని ఎవరూ విశ్వసించలేదు. దానితో తన పరిశోధనలు నిజమని నిరూపించడానికి ఆయన ఆ బ్యాక్టీరియాను మింగారు. బ్యాక్టీరియా చేసే విధ్వంసం అందరికీ చూపారు" అని నాగేశ్వర రెడ్డి వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.